www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

**Published From :** Vijaywada - Hyderabad - Delhi - Bengaluru
ఆదివారం 20, జూలై, 2025 | పేజీలు :12

## ఐసీఏఐ ప్రపంచంలోనే అతిపెద్ద
# అకౌంటింగ్ పవర్ హౌస్

**గుంటూరు:**




ది ఇన్ స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా అన్నది భారతదేశ మేధోశక్తికి వెన్నెముక లాంటిదన్నారు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్, గుంటూరు బండ్లమూడి గార్డెన్స్ లో ఐసీఏఐ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యాన 'స్ఫూర్తి' పేరుతో నిర్వహించిన మెగా సీఏ విద్యార్థుల సమావేశానికి మంత్రి లోకేశ్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఐసీఏఐ స్థాపించి 76 సంవత్సరాలు నిండినా ఆ సంస్థ ఇప్పటికీ నవ్యోత్సాహంతో ఉందని చెప్పారు. ఇది భారతదేశంలో అతిపెద్ద సంస్థగా మాత్రమే కాదు, ప్రపంచంలోనే అతిపెద్ద అకౌంటింగ్ పవర్‌హౌస్ గా ఉందన్నారు. ఐసీఏఐ ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన, విశ్వసనీయ సంస్థగా గుర్తింపు పొందిందని చెప్పారు. ప్రపంచంలో ఫోరెన్సిక్ అకౌంటింగ్ ప్రమాణాలతో పనిచేస్తున్న మొట్టమొదటి సంస్థ అన్నారు. ఐసీఏఐ ద్వారా 10 లక్షల మందికి పైగా చార్టర్డ్ అకౌంటింగ్ విద్యను అభ్యసిస్తుండగా, ప్రతియేటా 2 లక్షలమంది పరీక్షలు రాస్తున్నారు. 4.07 లక్షల మంది సభ్యులు, 54 విదేశీ చాప్టర్లు కలిగిన అతిపెద్ద సంస్థగా ఐసీఏఐ రూపాంతరం చెందిందన్నారు.

భారతదేశం గర్వించదగిన ఐసీఏఐ కుటుంబ సభ్యులు అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు మంత్రి లోకేశ్. నేను చార్టర్డ్ అకౌంటెంట్ కాకపోయినా స్టాన్ఫోర్డ్ ఎంబీఏ గ్రాడ్యుయేట్ గా సీఏ ప్రాధాన్యత నాకు తెలుసు అన్నారు. ఇది కేవలం ఒక కోర్సు కాదు, నిబద్ధతతో కూడుకున్న విద్య అన్నారు. మా కుటుంబ వ్యాపారాల్లో సీఏల కష్టాన్ని నేను ప్రత్యక్షంగా చూశానన్నారు. వ్యాపారాల్లో స్పష్టత లోపించినపుడు మేము సీఏ వైపే చూస్తామని తెలిపారు. పాలనా వ్యవస్థలో బడ్జెట్ ఆమోదం ఉన్న ప్రతి ప్రభుత్వ ఫైల్‌కు ఆడిటర్ల ఆమోద ముద్ర అవసరం. సీఏలు కేవలం సంఖ్యా విశ్లేషకులు మాత్రమే కాదు, వారు ఆర్థిక వృద్ధి చోదకులు. వారు వ్యాపారాలకు మూలధనాన్ని సేకరించడానికి, ఉద్యోగాలను సృష్టించడానికి సహాయం చేస్తారని చెప్పారు.

భారతదేశ చార్టర్డ్ అకౌంటెంట్స్‌కి గుంటూరు నగరం ఫ్యాక్టరీ అన్నారు. ఆశ్చర్యకరంగా గుంటూరు సిటీ వైద్యులు, ఇంజనీర్ల కంటే ఎక్కువగా సీఏలను తయారు చేస్తోందన్నారు. డాక్టర్లు, ఇంజనీర్లకంటే సీఏ చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఎక్కువ. 10 వేల మంది సీఏ చదువుతున్నారు. అత్యుత్తమ ప్రతిభ, అధిక ఉత్తీర్ణత శాతంతో సమున్నత లక్ష్యాలు కలిగిన చార్టర్డ్ అకౌంటెంట్లు గుంటూరుకే సొంతం అన్నారు. గుంటూరు నుంచి గల్ఫ్, అమెరికా, ఆస్ట్రేలియా వరకు విస్తరించిన తెలుగు సీఏలు భారతదేశం గర్వపడేలా ప్రతిభను చాటుతున్నారు. సీఏ వృత్తిలో ప్రవేశించడం కష్టం, విస్మరించడం అసాధ్యం. వజ్రాన్ని తయారు చేయడం ఎంతకష్టమో సీఏ డిగ్రీ సాధించడం కూడా అంతే కష్టం అన్నారు. వికసిత్ భారత్ లో భాగంగా 2047నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించాలన్నది ప్రధాని మోదీ ఆకాంక్ష అన్నారు లోకేశ్. సీఏ ఉత్తీర్ణత సాధించడం కేవలం ఒక మైలురాయి కాదు, ఇది మీ జీవితానికి మణిహారం లాంటిదన్నారు మంత్రి. భారతదేశ ఆర్థికవ్యవస్థకు మీరే గుండెకాయ. సీఏలు పాలనా వ్యవస్థలోకి వస్తే అవినీతిని రూపుమాపడం సులభతరమవుతుందన్నారు. మనమంతా కలసి భారతదేశాన్ని, ఆంధ్రప్రదేశ్ ను ప్రగతిపథం వైపు నడిపిద్దాం. ఏపీ ఆర్థికాభివృద్ధికి అవసరమైన విధానాల రూపకల్పనలో సీఏలు భాగస్వాములు కావాలి... అంటూ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు.



# స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

**తిరుపతి:**

ఏపీ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారాలంటే స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్నారు ఏపీ సీఎం చంద్రబాబు. రాష్ట్రాభివృద్ధికి ఒక్కో నెల ఒక్కో కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రం బాగుండాలంటే అందరూ స్వచ్ఛత పాటించాలని సీఎం పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ప్లాస్టిక్ భూతాన్ని తరిమేయాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ ఎక్కువగా ఉపయోగిస్తే ప్రజలు క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని అన్నారు. జాతీయ స్థాయిలో ఏపీకి 5 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తిరుపతిలో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. యువత ఉత్సాహం చూస్తుంటే సంతోషంగా ఉంది. యువతే ఈ దేశానికి సంపద. ప్రపంచంలో ఎక్కడ చూసినా నూటికి 30 శాతం మంది మనవారే ఉన్నారు. పిల్లల్ని చూస్తుంటే నా కాలేజీ రోజులు గుర్తొస్తున్నాయి. తాను తిరుపతిలో చదువుకుంటూనే ఎమ్మెల్యేగా ఎదిగానని, అంచెలంచెలుగా ఎదిగి నాలుగోసారి సీఎం అయ్యానని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

అమరావతిలో క్యాంటమ్ వ్యాలీని నిర్మించి.. ఏఐని అభివృద్ధి చేస్తామని చెప్పారు సీఎం చంద్రబాబు. క్వాంటమ్ వ్యాలీకి చిరునామాగా అమరావతి మారుతుందన్నారు. విద్యుత్ ఉత్పత్తి కోసం గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ తీసుకురాబోతున్నామని చెప్పారు. కాలుష్యం లేకుండా గ్రీన్ హైడ్రోజన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చు అన్నారు. వాతావరణ సమాచారం ముందుగా తెలిసేలా యాప్ తీసుకొస్తున్నామని.. ఆగస్టు 15 నాటికి వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 700 ప్రభుత్వ సర్వీసులు అందిస్తామన్నారు. ప్రఖ్యాత విద్యా సంస్థలు తిరుపతిలో ఏర్పాటు చేశామని చెప్పారు సీఎం చంద్రబాబు. నేర చరిత్ర కలిగిన నేతలు రాజకీయాల్లోకి వచ్చారు వారిని ఇంట్లో చెత్తను ఊడ్చినట్లు.. నేరచరిత్ర ఉన్న నేతలను ఊడ్చేయాలని ఫైర్ అయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఫ్యాక్షనిజం, ముఠా కలహాలు, మతకలహాలు నివారించాం. నేరస్థుల గుండెల్లో నిద్రపోతాం మన్నారు. వైసీపీ పానలో ఎవరికైనా స్వేచ్ఛ ఉన్నారా? అని చంద్రబాబు ప్రశ్నించారు. నక్సలైట్లు తనను చంపాలని చూశారని, కానీ ఆ వెంకటేశ్వరస్వామినే కాపాడారని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. తానెప్పుడూ హత్యా రాజకీయాలు చేయాలని అనుకోలేదని, అలా అనుకుని ఉంటే ఎవరినీ వదలిపెట్టేవాడిని కాదన్నారు.

తిరుపతిలో పర్యటించిన సీఎం చంద్రబాబు అక్కడి కపిలేశ్వరాలయాన్ని కూడా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పారిశుధ్య కార్మికుడి అవతారమెత్తారు. ఆలయ పరిసరాలను స్వయంగా శుభ్రపరిచారు. చీపురుతో ఊడ్చి, అనంతరం శుభ్రంగా తుడిచారు. పారిశుధ్య కార్మికులతో ఆప్యాయంగా ముచ్చటించారు. వారితో కలిసి గ్రూప్ ఫొటో కూడా దిగారు. ఈ ఫొటోలను సీఎం కార్యాలయం సోషల్ మీడియాలో పంచుకుంది.

శ్రీ కపిలేశ్వరాయంలో సీఎం చంద్రబాబు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఆయన అధికారులు, అర్చక స్వాములు సంప్రదాయబద్ధ స్వాగతం పలికారు. పవిత్ర వస్త్రం కప్పి, వేదాశీర్వచనం అందించారు. అంతకుముందు, తిరుపతి జిల్లా రేణిగుంట సమీపంలోని తూకివాకంలో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాన్ని సీఎం చంద్రబాబు పరిశీలించారు. అక్కడి అధికారులు ఆయనకు వేస్ట్ ప్రాసెసింగ్ విధానాన్ని వివరించారు.

# ప్రతి నగరం డిజిటల్ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలి



ఆంధ్రప్రదేశ్ లో ప్రతి నగరం డిజిటల్ గ్రోత్ ఇంజిన్ గా ఎదగాలని కోరుకుంటున్నామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. వైద్య సాంకేతికత, సేవల రంగంలో ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన ఎక్లాట్ (ECLAT) హెల్త్ సొల్యూషన్స్ సంస్థ విజయవాడ గన్నవరం సమీపం కేసరపల్లిలోని మేధా హైటెక్ సిటీ భవనంలో నూతనంగా ఏర్పాటుచేసిన కార్యాలయాన్ని మంత్రి నారా లోకేశ్ రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. అంతకుముందు మేధ టవర్స్ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేశ్ కు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. ప్రాంగణంలో మొక్కను నాటారు.

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. ఈ రోజు విజయవాడలో మెడికల్ కోడింగ్ కంపెనీ ఎక్లాట్ (ECLAT) హెల్త్ సొల్యూషన్స్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించడాన్ని ఎంతో గౌరవంగా భావిస్తున్నాని తెలిపారు. ఇది విజయవాడ నగరానికి ఎంతో గర్వకారణం కానుందన్నారు. అంతర్జాతీయ ఐటీ రంగంలో ఏపీ ఎదుగుతున్న తీరుకు ఇది నిదర్శనంగా నిలుస్తుందని చెప్పారు. ముందుగా సంస్థ స్థాపకులు కార్తిక్ పోల్సాని, స్నేహ పోల్సాని గారికి హృదయపూర్వక అభినందనలు. అందరూ మెగా నగరాలపై దృష్టి సారించగా.. మీరు చిన్న నగరాలపై నమ్మకం ఉంచారు. కొద్దిమందితో ప్రారంభమైన ఈ సంస్థ, ప్రస్తుతం 3500 మందికి పైగా ఉద్యోగులను కలిగి ఉంది. కరీంనగర్‌ను ఒక రిస్క్‌గా కాకుండా అవకాశంగా చూసి విజయవంతమయ్యారు. ఇప్పుడు అదే దృఢసంకల్పంతో విజయవాడకు వచ్చారు. ఇది కేవలం కంపెనీ ప్రారంభం మాత్రమే కాదు.. ఎంతోమంది కలల ప్రారంభం. డిజిటల్ సాధికారతకు నాంది" అని లోకేశ్ వివరించారు.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 3వేలకు పైగా నిపుణులను ఈ సంస్థ నియమించింది. మనదేశంలోని హైదరాబాద్, కరీంనగర్, లక్నో, ముంబై నగరాల్లో కంపెనీ తన కార్యకలాపాలను విస్తరించింది. విజయవాడలోని మేధ ఐటీ పార్క్ లో 25వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. స్థాపించిన రెండు నెలల్లోనే 300కు పైగా ఉద్యోగ నియామకాలు చేపట్టారు. వచ్చే ఏడాదిలోగా మరో వెయ్యి మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు.



# రాష్ట్రంలో భారీ వర్షాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఏపీలో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. వీటి ప్రభావంతో ఆది, సోమవారాల్లో ఉత్తర కోస్తాంధ్ర, యానాంలలో తేలికపాటి నుంచి ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే దక్షిణ కోస్తాంధ్రలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని, గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. రాయలసీమలోనూ ఇదే పరిస్థితి ఉంటుందని వెల్లడించింది. ఇవాళ ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, కృష్ణా, గుంటూరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, కర్నూలు, ఏలూరు జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవొచ్చన్నారు. ఈనెల 22 వరకు రాష్ట్రంలో ఈ వర్షాలు కొనసాగుతాయని వివరించారు. కాగా, ఈనెల 24న ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని చెప్పారు.

# వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్.. తర్వాత ఎవరు?

**విజయవాడ:**



ఏపీ లిక్కర్ కేసులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టయ్యారు. ఈ కేసులో ఏ4గా ఉన్న ఆయన్ను సిట్ అరెస్ట్ చేసింది. విజయవాడలోని సిట్ కార్యాలయంలో సుమారు 7 గంటలపాటు విచారించిన అనంతరం ఎంపీని అరెస్ట్ చేసింది. ఆయన్ను అరెస్ట్ చేసినట్లు బంధువులకు సిట్ అధికారులు సమాచారమిచ్చారు. ఇప్పటికే మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. అటు సుప్రీం కోర్టులోను ఆయనకు ఎదురుదెబ్బ తగిలింది. ముందస్తు బెయిల్ పిటిషన్ రద్దు చేయడంలో నేరుగా శనివారం ఉదయం ఆయన విజయవాడలోని సిట్ కార్యాలయానికి విచారణకు హాజరయ్యారు. తాజాగా మిథున్‌రెడ్డి అరెస్ట్‌తో లిక్కర్ కేసులో అరెస్ట్‌ల సంఖ్య 12 మందికి చేరుకుంది. ఢిల్లీ నుంచి శనివారం ఉదయం గన్నవరం చేరుకున్నారు. అక్కడి నుంచి నేరుగా విజయవాడలోని సిట్ ఆఫీస్‌కు చేరుకున్నారు. సిట్ అధికారులు మిథున్ రెడ్డిని ప్రశ్నించారు. ఇప్పటి వరకు లభించిన ఆధారాలు, రికార్డు చేసిన వాంగ్మూలాలు ఆధారంగా మిథున్ రెడ్డిని క్వశ్చన్ చేశారు. సిట్ విచారణకు వెళ్లే ముందు వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. వైసీపీ నేతలను టార్గెట్ చేసుకుంటూ కేసులు పెట్టడం వేధించడం పరిపాటిగా మారిందన్నారు. తమకు లొంగిపోయిన వారితో స్టేట్మెంట్‌లను నమోదు చేసి వాటి ఆధారంగా ప్రత్యర్థులను ఇరికించేలా కేసులు ఫైల్ చేసి ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి కేసులతో తాము వెనక్కి వెళ్లే పరిస్థితిలేదని కచ్చితంగా న్యాయపరంగా ఎదుర్కొంటామని అన్నారు. మద్యం కేసులో ఎలాంటి ఆధారాలు లేకపోయినప్పటికీ చాలా మంది ఇబ్బంది పెడుతున్నారని అందులో తాను కూడా ఉన్నట్టు మిథున్ రెడ్డి వెల్లడించారు. ఎలాంటి సాక్ష్యాలు లేకుండా కేవలం ఒకరిద్దరి స్టేట్మెంట్‌లను ఆధారంగా చేసుకొని ఇరికించేందుకు కుట్ర చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. తన పాత్ర ఉన్నట్టు ఒక్క ఆధారమైనా చూపించాలని సవాల్ చేశారు. తాము తప్పు చేయలేదని అందుకే ధైర్యంగా దర్యాప్తునకు హాజరవుతున్నట్టు వెల్లడించారు. ఎవరెవర్ని జైల్లో వేయాలో నిర్ణయించుకొని దాని ఆధారంగానే కేసులు పెట్టిస్తున్నారని మిథున్ రెడ్డి ఆరోపించారు. దీని కోసం కొందర్ని ప్రలోభపెట్టి స్టేట్మెంట్‌లు రికార్డు చేస్తున్నారని అన్నారు. ఇలా కట్టుకథలలతో నేతలను జైల్లో పెట్టడమే రెడ్ బుక్ రాజ్యాంగమని అన్నారు. తనను టార్గెట్ చేయడం ఇది కొత్త కాదని మిథున్ రెడ్డి అన్నారు. 2014లో కూడా టార్గెట్ చేశారని గుర్తుచేశారు. అరెస్టు కూడా చేశారని అన్నారు.

**మిథున్‌రెడ్డి పేరు లేకుండా సిట్ ఛార్జిషీట్**

మరోవైపు ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. వైసీపీ హయాంలో జరిగిన ఈ స్కామ్ పై సిట్ ఛార్జిషీట్ దాఖలు చేసింది. 300 పేజీలతో ప్రిలిమినరీ ఛార్జిషీట్‌ను రెడీ చేసిన అధికారులు.. దానిని కోర్టుకు సమర్పించారు. ఆ ఛార్జిషీటుతో పాటు 100కు పైగా ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలు, ఎలక్ట్రానిక్ వస్తువుల్ని కూడా జతచేశారు. ఈ కేసులో ఇప్పటి వరకూ రూ.62 కోట్లు సీజ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. 268 మంది సాక్ష్యుల్ని విచారించామని పేర్కొన్న సిట్.. 11 మంది వాంగ్మూలాలు, రిమాండ్ రిపోర్టులు, ఇతర పత్రాలను కూడా జతచేశారు. సిట్ అధికారులు.. దాఖలు చేసిన ప్రాథమిక ఛార్జిషీట్ లో మాత్రం ఆయన పేరు పేర్కొనలేదు. అయితే మరో 20 రోజుల్లో రెండో ఛార్జిషీట్ దాఖలు చేస్తామని కోర్టుకు చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో రెండో ఛార్జిషీట్ లో మిథున్ రెడ్డి పేరు ఉండే అవకాశం ఉంది. ఈ కేసులో ఇప్పటివరకూ మొత్తం 33 మందిపై ఆరోపణలు ఉండగా, మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి వంటి వాళ్లు ఇంకా అరెస్ట్ కాలేదు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతున్నందున త్వరలో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉంది. వైసీపీ అధినేత, మాజీ సీఎంను ఇదే కేసులో అరెస్ట్ చేస్తారనే టాక్ వినిపిస్తోంది. అందుకు బలమైన సాక్ష్యాధారాలు సేకరించే పనిలో ఉంది సిట్.



## టీటీడీ కీలక నిర్ణయం.. నలుగురిపై వేటు

నలుగురు అన్యమత ఉద్యోగులను టీటీడీ సస్పెండ్ చేసింది. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (క్వాలిటీ కంట్రోల్) ఎలిజర్, బర్డ్ ఆసుపత్రి స్టాఫ్ నర్స్ రోసి, గ్రేడ్ 1 ఫార్మసిస్ట్ ఎం.ప్రేమావతి, ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీలో విధులు నిర్వహిస్తున్న డా. జి.అసుంతను టీటీడీ సస్పెండ్ చేసింది. వీరు క్రైస్తవ మతాన్ని అనుసరిస్తున్నారని మిగతా 2లో..




## మాజీ మంత్రి రజినికి నోటీసులు

మాజీ మంత్రి విడదల రజినికి పల్నాడు జిల్లా సత్తెనపల్లి పోలీసులు నోటీసులు ఇచ్చారు. మాజీ సీఎం జగన్ రెంటపాళ్ల పర్యటన సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించి జన సమీకరణ చేయడంపై కేసు నమోదైంది. ఈ కేసులో విడదల రజినికి నోటీసులు ఇచ్చిన పోలీసులు.. ఈనెల 20న విచారణకు హాజరుకావాలని సూచించారు. గత నెల 18న సత్తెనపల్లిలో నిబంధనలు ఉల్లంఘించి మిగతా 2లో..



## లిక్కర్ కేసులో నారాయణస్వామికి నోటీసులు

ఏపీ మద్యం కుంభకోణంలో సిట్ మరింత వేగం పెంచింది. ఇప్పటికే పలువురిని సిట్ విచారించి..కొందరిని అరెస్ట్ చేసింది. అయితే తాజాగా గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా పని చేసిన కలత్తూరు నారాయణ స్వామికి సిట్ నోటీసులు జారీ చేసింది. సోమవారం సిట్ విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే గత కొన్ని మిగతా 2లో..



## వీరమల్లుకు మినహాయింపు

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ప్రధాన పాత్రలో నటించిన హరిహర వీరమల్లు చిత్రబృందానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఈనెల 24వ తేదీన సినిమా విడుదల ఉండటంతో మొదటి పది రోజులు టికెట్ల రేట్లు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు శనివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో లోయర్ క్లాస్ టికెట్ పై రూ. 100, అప్పర్ క్లాస్ మిగతా 2లో..

## టీటీడీ కీలక నిర్ణయం.. నలుగురిపై వేటు

**మొదటిపేజీ తరువాయి**

నిర్ధారణ కావడంతో ఈ చర్య తీసుకుంది. టీటీడీ ఉద్యోగులుగా పనిచేస్తూ సంస్థ ప్రవర్తనా నియమావళిని పాటించలేదని, హిందూ ధార్మిక సంస్థలో ఉంటూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని తెలిపింది. విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదికను, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం వారిని సస్పెండ్ చేసినట్లు టీటీడీ పేర్కొంది.మరోవైపు శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల విషయంలో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల ప్రణాళికల రూపకల్పనలో ఇస్రో సేవలను వినియోగించుకునేందుకు టీటీడీ రెడీ అవుతోంది. కొన్నేళ్లుగా ముఖ్య వాహన సేవల్లో పాల్గొంటున్న భక్తుల సంఖ్యను టీటీడీ సుమారుగా లెక్కిస్తోంది. అయితే, సెప్టెంబర్ 24న ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే గరుడోత్సవం రోజున మాడవీధులు, బయట ఎంతమంది భక్తులు శ్రీవారిని దర్శించుకునే అవకాశం ఉందన్నది అత్యాధునిక శాటిలైట్ల ద్వారా గుర్తించి, సమాచారాన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. తద్వారా తగిన ఏర్పాట్లు చేసే వీలు కలుగుతుందని టీటీడీ అధికారులు భావిస్తున్నారు.

## వీరమల్లుకు మినహాయింపు

**మొదటిపేజీ తరువాయి**

టికెట్ పై రూ. 150 పెంచుకునేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మల్టీప్లెక్స్‌లలో రూ. 200 వరకు పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది. అంతేగాకుండా, విడుదలకు ముందురోజు రాత్రి (జులై 23) పెయిడ్ ప్రీమియర్ షోకు కూడా అనుమతి మంజూరు చేసింది. ఈ ప్రీమియర్ షో టికెట్ ధర రూ.600.... జీఎస్టీ అదనం.
పవన్ కల్యాణ్ పోరాట యోధుడి పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది. బాలీవుడ్ యాక్టర్ బాబీ డియోల్ ఔరంగజేబు పాత్రలో నటిస్తున్నారు. సునీల్, నాజర్, రావు రమేశ్, అనుదీప్ కేవీ, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ సహా తదితరులు కీలక పాత్రలు పోషించారు. పవన్ కల్యాణ్ కెరియర్‌లో వస్తోన్న తొలి పాన్ ఇండియా చిత్రం కావడంతో అభిమానులతో పాటు మూవీ లవర్స్ కూడా ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. తొలి భాగం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది.

## మాజీ మంత్రి రజినికి నోటీసులు

**మొదటిపేజీ తరువాయి**

బల ప్రదర్శన చేయడం, ప్రజల ఆస్తులు ధ్వంసం చేయడంపై నమోదైన కేసులో 113 మందికి పోలీసులు నోటీసులు జారీ చేశారు. వీరిలో వైసీపీ నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులు ఉన్నారు. ఈ కేసులో ఇప్పటికే మాజీ ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, ఆపార్టీ నేత గజ్జల సుధీర్‌రెడ్డి పోలీసుల విచారణకు హాజరయ్యారు.

## లిక్కర్ కేసులో నారాయణస్వామికి నోటీసులు

**మొదటిపేజీ తరువాయి**

రోజులుగా మాజీ మంత్రి నారాయణ స్వామి సైతం కనిపించడం లేదు. అరెస్టు భయంతో కనిపించకుండా పోయారని ప్రచారం జరుగుతోంది. గత ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ మంత్రిగా పని చేసిన నారాయణ స్వామికి సిట్ ఈ నెల 21న ఉదయం 10 గంటలకు విచారణకు రావాలంటూ నోటీసులు జారీ చేసింది. ఏపీ లిక్కర్‌కేసులో ఇప్పటికే వరకు మొత్తం 49 మందిని నిందితులుగా చేర్చారు. అందులో 11 మందిని సిట్ అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో A1గా కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, A2 దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి, A3గా దొడ్డ వెంకట సత్యప్రసాద్, A4 పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, A5 మాజీ ఎంపీ వి.విజయసాయి రెడ్డి, A6 సజ్జల శ్రీధర్ రెడ్డి, A7గా ముప్పిడి అవినాష్ రెడ్డి, A8గా బూనెటి చాణక్య, A9గా తుకేకుల ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డి, A10గా SK సైఫ్ అహ్మద్ ఉన్నారు.

## పేర్ని నాని అరెస్టుకు అవకాశం

**మచిలీపట్నం:**



మాజీ మంత్రి పేర్ని నానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. రప్పా రప్పా వ్యాఖ్యలతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ కృష్ణా జిల్లా పామర్రు పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో తొందరపాటు చర్యలు తీసుకోకుండా ఆదేశించాలని హైకోర్టును ఆయన అభ్యర్థించగా.. ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. పిటిషన్‌పై తదుపరి విచారణను జులై 22కి వాయిదా వేసింది. అయితే 22న తీర్పు నానికి వ్యతిరేకంగా వస్తే అరెస్ట్ చేస్తారని టాక్ వినిపిస్తోంది. దీంతో వైసీపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.
అయితే ఈ నెల 8న పామర్రులోని ఆరేపల్లి కల్యాణ మండపంలో వైసీపీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న పేర్ని నాని.. ఆపార్టీ శ్రేణులను 'రప్పా.. రప్పా' అంటూ రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారు. ఇవి వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణలను పెంచేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని టీడీపీ సీనియర్ నాయకుడు చాట్ల రమేష్, ఇతర నేతలు పామర్రు సీఐ సుభాకర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యకర్తలను ఆ విధంగా ప్రేరేపించిన పేర్ని నాని, అనిల్‌కుమార్, వైసీపీ నాయకులు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, పెయ్యల రాజు, బాలవెంకటేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, కల్యాణ మండప నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో పేర్ని నాని హైకోర్టును ఆశ్రయించగా.. అతడి అభ్యర్థనను న్యాయస్థానం తోసి పుచ్చింది. 22న కోర్టు తీర్పుపై ఉత్కంఠ నెలకొంది.

# ఎమ్మెల్యే వ్యాఖ్యలపై మాజీ సీఎం జగన్ ఫైర్!



మాజీ మంత్రి ఆర్‌కె రోజా సెల్వమణిపై టీడీపీ ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేసిన వ్యాఖ్యలపై మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు . తెలుగుదేశం పార్టీలో దారుణంగా మారిన సంస్కృతికి ఆ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయంటూ విమర్శించారు. ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపుతూ మాట్లాడుతున్నందుకు, వాటిని ప్రశ్నిస్తున్నందుకూ ఓర్చుకోలేక, రెండుసార్లు ఎమ్మెల్యేగానూ, మంత్రిగానూ పని చేసిన నా సోదరి ఆర్‌కె రోజాను అత్యంత అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తారా అంటూ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. తమను విమర్శించే మహిళల గొంతు నొక్కడమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీలో ఒక తంతుగా మారిన అత్యంత హేయమైన సంస్కృతికి ఇది ఒక నిదర్శనమంటూ ట్వీట్ చేశారు. వ్యక్తిత్వ హననం చేస్తూ చంద్రబాబునాయుడు తన రాజకీయ జీవితం కొనసాగిస్తున్నారన్నారు. ఒక మహిళపై అత్యంత హేయంగా ఆరోపణలు చేసి, దుష్ప్రచారం చేసే ఉన్నత పదవి పొందారంటూ ధ్వజమెత్తారు. ధైర్యంగా మాట్లాడే మహిళలను భయపెట్టి వారి నోరు మూయించడానికి అత్యంత అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంతో పాటు, విమర్శించడాన్ని ఆ పార్టీ నాయకులు ఒక ఆనవాయితీగా పెట్టుకున్నారన్నారు.ఏడాది కాలంగా అనేక మంది వైఎస్‌ఆర్‌సీపీ మహిళా నాయకులను దారుణంగా వేధిస్తూ అవమానించడం తగదన్నారు. తనపై ఒక ఎమ్మెల్యే చేసిన అత్యంత హేయమైన వ్యాఖ్యలపై ఫిర్యాదు చేయడానికి ఆర్‌కె రోజా వెళ్లగా, వాస్తవాలు స్పష్టంగా కళ్లెదుటే కనిపిస్తున్నా పోలీసులు తిరిగి ఆమెపైనే సందేహాలు వ్యక్తం చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇది రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ఎంత దారుణంగా మారింది? టీడీపీ నేతలను రక్షించేందుకు వారు ఏ స్థాయిలో తమ బాధ్యత, కర్తవ్యాన్ని మరచి వ్యవహరిస్తున్నారో ఈ ఘటనలు తెలియజేస్తున్నాయని జగన్ అన్నారు. మాజీ మంత్రి విడదల రజని, కృష్ణా జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికతో పాటు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుల కుటుంబ సభ్యుల విషయంలో కూడా చాలా అవమానకర ఘటనలు చోటు చేసుకున్నయని గుర్తు చేశారు. ఇకనైనా మాజీ మంత్రి ఆర్‌కె రోజాను దారుణంగా అవమానించిన ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను తక్షణమే అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ సీఎం జగన్ ఎక్స్ వేదికగా కోరారు.

# రాష్ట్ర అభివృద్ధి అజెండాకు శ్రీసిటీ అధినేతల మద్దతు



అమరావతి: రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన P4 (పబ్లిక్‌ప్రైవేట్‌పీపుల్ పార్టనర్‌షిప్) మెంటర్ల సమావేశంలో శ్రీసిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ సమావేశంలో హాజరై ముఖ్యమంత్రితో రాష్ట్రాభివృద్ధిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో శ్రీసిటీకి చెందిన ఇతర పారిశ్రామిక ప్రముఖులు తైజో ఇవామి (ఎండీ, ఐఎంటిపి), యుచి టోమిటా (ప్లాంట్ హెడ్, ఐసాన్ ఆటో పార్ట్స్) ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా కలిసి రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనకు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ముఖ్యంగా, పేదల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన P4 కార్యక్రమానికి సహకారం అందించేందుకు శ్రీసిటీ పరిశ్రమలు సిద్ధంగా ఉన్నాయని వారు తెలిపారు.
సమావేశానికి ముందు, డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో వేర్వేరుగా భేటీ అయ్యారు. శ్రీసిటీ అభివృద్ధి, ప్రత్యేకతలు, భవిష్యత్ ప్రణాళికలపై వారికి వివరించి, పరిశ్రమల పురోగతిని నేరుగా పరిశీలించేందుకు శ్రీసిటీలో సందర్శనకు ఆహ్వానం ఇచ్చారు. దీనిపై అధికారుల నుంచి సానుకూల స్పందన వచ్చింది. ఈ సందర్భంగా డాక్టర్ సన్నారెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు పారిశ్రామిక వృద్ధికి మార్గం చూపుతున్నాయని, ఈ సమావేశాలు తమ పరిశ్రమకు మరింత ప్రోత్సాహాన్నిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములమవడం గర్వంగా భావిస్తున్నామని ఆయన అన్నారు

# అధికారులకు ఎమ్మెల్యే వార్నింగ్



**రాజానగరం:**

ఫీల్డ్ స్థాయి సిబ్బంది తమ పనితీరును సరి చేసుకోవాలని, వ్యతిరేకంగా పనిచేస్తే ఉపేక్షించేది లేదంటూ రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ హెచ్చరించారు. శనివారం ఆయన కార్యాలయంలో కార్యాలయంలో డిఆర్డిఏ —ఎస్ ఇ ఆర్ పి అధికారులు , సిబ్బంది తో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న అన్ని పథకాలు అర్హులకి అందే విధంగా చూడాలని, మహిళా సంఘాల పనితీరు మరింత పటిష్ట పరచడానికి కృషి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అనంతరం మహిళా, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై ఆయన పిడి , డిఆర్డిఏతో కలిసి సమీక్షించారు. డ్వాక్రా మహిళలను చైతన్య పరుస్తూ ప్రభుత్వ కార్యక్రమాలు నిరంతరం సమర్థ వంతంగా అమలు అయ్యేలా చూడాలన్నారు. ఫీల్డ్ సిబ్బంది పనితీరు మెరుగు పరచుకోవాలన్నారు. ఈ రివ్యూ మీటింగ్ లో అధికారులు, రిటైర్డ్ డిఎస్పి కదలి వెంకటేశ్వర రావు, శ్రీకృష్ణపట్నం గ్రామ ప్రెసిడెంట్ కిమిడి శ్రీరామ్, రాజానగరం మండలం జనసేన పార్టీ అధ్యక్షులు వేగిశెట్టి రాజు, సీనియర్ నాయకులు అడపా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ పెట్టుబడులపై చర్చకు దారితీసిన యాడ్!



మహీంద్రా నుంచి ఫ్యూరియో ట్రక్ తెలుగు అడ్వర్టైజ్‌మెంట్‌ను తన ఎక్స్ వేదికగా ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ''ఒక్క నిర్ణయం చాలు.. మీ విధి మీ చేతుల్లో ఉంది. ట్రక్‌ను సొంతం చేసుకోండి.. జీవితం మార్చుకోండి'' అంటూ తెలుగులో ఆ వీడియోకు క్యాప్షన్ కూడా పెట్టారు.
ఎక్స్ లో ఆ వీడియోను చూసిన ఆంధ్రప్రదేశ్ ఐటీ మంత్రి నారా లోకేశ్.. ప్రకటన హృదయాన్ని హత్తుకునేలా ఉందంటూ ప్రశంసిస్తూ ట్వీట్ తో బదులిచ్చారు. మహీంద్రా వాహనాలకు అతిపెద్ద మార్కెట్ అయిన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూడా ఇది నచ్చుతుందని పేర్కొన్నారు. పెట్టుబడులకు అన్ని అవకాశాలున్న ఏపీలో మహీంద్రా తయారీ కేంద్రాన్ని నెలకొల్పే అంశాన్ని పరిశీలించాలని ఈ సందర్భంగా లోకేశ్ కోరారు. దీనికి ఆనంద్ మహీంద్రా ఈ విధంగా రీ ట్వీట్ చేశారు.ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు అనేక అవకాశాలు ఉన్నాయని ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా అన్నారు. రాష్ట్రంలో సోలార్ ఎనర్జీ, మైక్రో ఇరిగేషన్, టూరిజం విభాగాల్లో పెట్టుబడులు పెట్టే అంశంపై తమ బృందాలు ఆంధ్రప్రదేశ్‌తో చర్చలు జరుపుతున్నాయని పేర్కొన్నారు. 'మన ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది. ముమ్ముందు ఏమవుతుందో చూద్దాం' అంటూ లోకేశ్ ట్వీట్ పై తెలుగులోనే పోస్ట్ పెట్టి మహీంద్ర ఆశ్చర్యపరిచారు.



## పేర్ని కిట్టుతో సహా 19మందిపై కేసు

**కృష్ణా జిల్లా:**

మచిలీపట్నంలో పెను సంచలనం నమోదు అయింది. మాజీ మంత్రి పేర్ని నాని కుమారుడు పేర్ని కిట్టుతో కలిపి 19 మంది వైసీపీ నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు పోలీసులు. ఈకేసులో ఇప్పటివరకూ ఏడుగుర్ని అరెస్ట్ చేశారు. టీడీపీ నేత బొడ్డు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు చర్యలు చేపట్టారు. గురువారం మచిలీపట్నంలో హోంమంత్రి వంగలపూడి అనిత పర్యటన నేపథ్యంలో మంత్రి కొల్లు రవీంద్ర ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. అయితే హోంమంత్రి వెళ్లకముందే ఈ రూట్ లో కొంతమంది వైసీపీ నేతలు ఆందోళనలు నిర్వహించారు. మంత్రి కొల్లు రవీంద్ర ఫ్లెక్సీపై చొప్పులు ఉంచారు. భారీగా చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తతలు చోటు చేసుకునే అవకాశంతో హోంమంత్రి పర్యటన రద్దు చేసుకున్నారు. అయితే వైసీపీ నేతలు అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించినట్లు టీడీపీ నేత బొడ్డు శ్రీనివాస్ ఫిర్యాదు చేయడంతో వారిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

**నిడదవోలు:**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆరోగ్యకర జీవన విధానానికి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని మంత్రి కందుల దుర్గేష్ ప్రజానీకానికి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రతి నెలా 3వ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఒక్కో థీమ్ తో ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్న నేపథ్యంలో జులై నెల 3వ శనివారం ప్లాస్టిక్ వాడకం ప్రమాదకరమని తెలుపుతూ ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేద్దామన్న నినాదంతో కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం కానూరు గ్రామంలో మంత్రి కందుల దుర్గేష్ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. కానూరు కూడలిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ మానవహారం నిర్వహించారు. చెత్త నిర్వహణను కట్టుదిట్టంగా నిర్వహించి పర్యావరణాన్ని కాపాడతామని, పర్యావరణానికి ముప్పు తెచ్చే ప్లాస్టిక్ ను వినియోగించమని, ప్రతిరోజూ స్వచ్ఛత కోసం కొంత సమయం కేటాయిస్తామని మంత్రి దుర్గేష్ ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రజలు బాధ్యతగా పర్యావరణ రక్షణకు నడుం బిగించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ప్రజలు, అధికారులతో కలిసి పలు స్లోగన్స్ చేశారు. ర్యాలీ నిర్వహించారు.



ప్లాస్టిక్ వాడకం, రిఫ్రిజిరేటర్, ఏసీలు తదితర వస్తువుల వినియోగం వల్ల వెలువడే వాయువులతో ఓజోన్ పొరకు విచ్ఛిన్నం ఏర్పడి పర్యావరణానికి హాని కలుగుతుందని చెప్పారు మంత్రి దుర్గేష్. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి క్రమక్రమంగా అంతం చేద్దామని పిలుపునిచ్చారు. తద్వారా మన గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రజలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొర ప్రయోజనాలను వివరించారు. గ్రీన్ హౌస్ ఎఫెక్ట్ గురించి అర్థమయ్యేలా వివరించారు.ఇంట్లోని చెత్తా చెదారాన్ని బయట వేసే క్రమంలో భూమిలో కరగని ప్లాస్టిక్ ను వేరు చేద్దామని పిలుపునిచ్చారు. తద్వారా రీసైక్లింగ్ కు అవకాశం ఉంటుందన్నారు. ప్లాస్టిక్ సంచులు, వస్తువులకు బదులు ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. ప్రస్తుతం ప్రధాన నగరాల్లో ప్లాస్టిక్ బాటిళ్ల స్థానంలో గాజు సీసాలు వినియోగిస్తున్నారని తెలిపారు. ఎవరికి వాళ్లు తమ తమ ఇళ్ళతో పాటు ప్రభుత్వం నిర్మించిన రోడ్లను, కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోకపోతే అనారోగ్యాలబారిన పడతామని తెలిపారు. చెత్తాచెదారాలు ఎక్కడ పేరుకుపోయినా అంతిమంగా నష్టపోయేది మానవుడే అన్న విషయం ప్రతి ఒక్కరు గ్రహించాలని అందరికీ అర్థమయ్యేలా మంత్రి దుర్గేష్ వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం భవిష్యత్ లో ఉద్యమంగా మారుతుందని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో, డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ మంత్రివర్యులు పవన్ కళ్యాణ్ సారథ్యంలో స్వచ్ఛాంధ్ర, ప్రధాని మోదీ సారథ్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిరంతరంగా అమలు చేస్తూ దేశాన్ని, రాష్ట్రాన్ని అత్యంత పరిశుభ్రత కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామన్నారు మంత్రి కందుల దుర్గేష్. ప్రతి నెలా 3వ శనివారం ఈ తరహా కార్యక్రమాలు చేస్తూ తప్పనిసరిగా ఇంటినే కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సందేశాన్ని ఇస్తున్నామన్నారు. అలా ప్రతి నెలా 3వ శనివారం ఒక్కో కార్యక్రమంతో ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నామన్నారు. జులై మాసంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిద్దాం, గుడ్డ సంచులు వినియోగిద్దాం అన్న నినాదంతో ప్రజల్లోకి వచ్చామన్నారు. స్వచ్ఛత మన లక్ష్యం ప్లాస్టిక్ ను చేద్దాం దూరం మంత్రి దుర్గేష్ నినదించారు.



# ప్లాస్టిక్ భూతానికి మహిళలు నడుంబిగించాలి

**విజయనగరం:**

ప్లాస్టిక్ ప్రతి ఒక్కరి నిత్య జీవితంలో భాగమైపోయిందని, ప్లాస్టిక్ తో మన ఆరోగ్యాన్ని మనమే నాశనం చేసుకుంటున్నామని, ప్లాస్టిక్ అత్యంత ప్రమాదకరమని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి, హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం విజయనగరం పట్టణంలోని గంటస్థంభం నుండి బాలాజీ కూడలి వరకు జరిగిన ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం బాలాజీ కూడలిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి అనిత పాల్గొని ప్రసంగించారు. ఈ మూడవ శనివారం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం అనే నినాదంతో ప్రభుత్వం రాష్ట్రమంతటా కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగంపై ఒక్క రోజులో మార్పు రాదనీ, ప్లాస్టిక్ కి ప్రత్యామ్నాయం చూడాలని తెలిపారు. డ్వాక్రా, మెప్మా సంఘాల ద్వారా పేపర్, జనపనార, కాటన్ తో బ్యాగులను తయారు చేసే యూనిట్లను స్థాపించేలా శిక్షణ ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో చిన్న చిన్న యూనిట్లను స్థాపించడం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, తద్వారా ప్లాస్టిక్ నియంత్రణకు కూడా కృషి జరుగుతుందని అన్నారు. చెత్త నుండి సంపదను సృష్టించే ముఖ్యమంత్రి రాష్ట్రంలో పని చేయడం మన అదృష్టమని, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి చెత్త నిర్వహణకు రాష్ట్ర వ్యాప్తంగా కృషి చేస్తున్నారని తెలిపారు. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా డిస్పోజ్ చేయాలనీ ఇంటి నుండే చెత్త నిర్వహణ జరగాలని తెలిపారు.



# జగన్‌పై సోము వీర్రాజు సెటైర్లు

**విజయవాడ:**

వైసీపీ అధినేత జగన్ పై బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట్లాడే విధానాన్ని జగన్ మార్చుకోవాలని అన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామని... అధికారుల అంతు చూస్తామని జగన్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో ఉన్న అధికారులు జైల్లకు వెళుతున్నారని చెప్పారు. వైసీపీ హయాంలో రూ. 420కి నెయ్యి కొని తిరుమలలో లడ్డూలు తయారు చేశారని విమర్శించారు. మళ్లీ అధికారంలోకి వస్తే రూ. 320కి కొంటారా?, మళ్లీ భూం భూం బీర్లు తీసుకొస్తారా? అని ఎద్దేవా చేశారు. వైసీపీ నేతలు ఎందుకు జైళ్లకు వెళుతున్నారో జగన్ ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. లోకేశ్ చేసిన యువగళం పాదయాత్రలో వైసీపీ నేతలు ఏం చేశారో రికార్డులను వెనక్కి తీయిస్తే వారి అరాచకాలు బయటపడతాయని చెప్పారు. ప్రభుత్వాన్ని బెదిరించినంత మాత్రాన ప్రజలు మిమ్మల్ని నమ్మరని... మీరు మళ్లీ అధికారంలోకి రావడం కలేనని వీర్రాజు అన్నారు. 2029లో కూడా కూటమే అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. వైసీపీ పాలనలో రోడ్డుపై ఒక్క గొయ్యి కూడా పూడ్చలేదని విమర్శించారు. గతంలో తనను గుడివాడకు వెళ్లకుండా అడ్డుకున్నారని చెప్పారు. తాను రామతీర్థం నుంచి కపిలతీర్థం వెళ్లడానికి కూడా జగన్ ప్రభుత్వం అనుమతించలేదని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏపీపై ఉన్నంత గౌరవం తెలంగాణపై కూడా ఉందని చెప్పారు. ఏపీలోని అన్ని పార్టీలు బనకచర్లకు అనుకూలంగా మాట్లాడాలని కోరారు.



# లోకేశ్ డైరెక్షన్‌లో మిథున్‌రెడ్డిపై కక్ష సాధింపు

**తిరుపతి:**

వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి లిక్కర్ కేసు ఎపిసోడ్‌పై తీవ్రంగా స్పందించారు వైసీపీ నేత, మాజీ టీడీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి. కక్ష సాధింపు రాజకీయాలతో చంద్రబాబు, లోకేష్‌లు రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్నారని మండిపడ్డారు భూమన కరుణాకర్‌రెడ్డి. మిథున్‌రెడ్డి వైసీపీలో కీలక నేత మాత్రమే కాదు.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సన్నిహితుడు కూడా అన్నారు. అందుకే ఆయన్ని అరెస్ట్ చేయాలని రంగం సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. లిక్కర్ కేసు వ్యవహారంలో కూటమి ప్రభుత్వ రాజకీయ కుట్ర దాగుందన్నారు. అందుకే ఎలాంటి సంబంధం లేని మిథున్‌రెడ్డి ఈ స్కామ్‌ను అంటగట్టాలని చూస్తున్నారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం స్కామ్ జరిగింది అనే ఓ అబూతకల్పన మాత్రమే అన్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో అరెస్టు చేసిన వారికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఇప్పుడు అదే తరహాలో మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని చూస్తున్నారు. ఇదంతా నారా లోకేష్ డైరెక్షన్‌లోనే జరుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏపీలో వైసీపీ నేతలు, కార్యకర్తలను అరెస్టు చెయ్యడం.. కొట్టడం చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాలలో ప్రత్యర్థులను శత్రువులుగా చూడటం మంచిది కాదు. ప్రజాస్వామ్యంలో రాజకీయాలు మారుతుంటాయి. ఆ ఇంగితజ్ఞానం కూడా లేకపోతే ఎలా? అని ప్రశ్నించారు.



# ఐదేళ్ల ఫించన్ డబ్బుతో ఐదు పోలవరం ప్రాజక్టులు కట్టొచ్చు

**చోడవరం:**

ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏపీలో ఐదేళ్లలో ఇచ్చే పెన్షన్ సొమ్ముతో ఐదు పోలవరం ప్రాజెక్టులు నిర్మించవచ్చు అంటూ సరదాగా అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా చోడవరం నియోజకవర్గంలో పాల్గొన్నారు మంత్రి నిర్మల. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని హామీలు అమలు చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా, పెంచిన పెన్షన్లను ఇంటివద్దకే అందిస్తున్నామన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఎక్కడా రాజీపడకుండా పెన్షన్ అందిస్తున్నామని మంత్రి నిమ్మల వివరించారు. గత ప్రభుత్వ పాలనలో వ్యవస్థలు అస్తవ్యస్తం అయ్యాయని విమర్శించారు. మూడు రాజధానులు అన్నారు... ఒక్క రాజధాని కూడా కట్టలేదన్నారు. రాష్ట్రానికి వచ్చిన కంపెనీలను తరిమేశారు. మద్యం, ఇసుక, మైనింగ్, భూములు... ఇలా అన్నీ కొల్లగొట్టారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఆ తప్పులన్నీ సరిదిద్దుతూ వస్తోందని నిమ్మల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మలతో పాటు ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ, కేఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు తదితరులు పాల్గొన్నారు.



# పోలవరం ఎత్తు కుదింపు జగన్ పాపమే

**విజయవాడ:**

పోలవరం ప్రాజెక్టు ఎత్తు కుదింపు పాపం ముమ్మాటికీ మాజీ సిఎం జగన్‌దే అని ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. బీజేపీకి అమ్ముడుపోయి మోడీ కోసం పోలవరం ప్రయోజనాలు తాకట్టు పెట్టి, ఇప్పుడు ప్రాజెక్ట్ ఎత్తు పెంచాలని జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని" ఎక్స్" వేదికగా ఆమె విమర్శించారు. పేరుకే టీడీపీ, వైసీపీ, జనసేన ఎంపీలు.. కాని వాళ్లంతా బీజేపీకి బానిసలని షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కన్నా స్వప్రయోజలే వారికి ముఖ్యమని విమర్శించారు. రాష్ట్ర హక్కుల కన్నా మోడీ మెప్పు మిన్న అని ఎద్దేవా చేశారు. పదవులు అనుభవించడంపై ఉన్న శ్రద్ధ విభజన హామీలపై లేదన్నారు. తమ నోరును హక్కుల కోసం కాకుండా మోడీ జపానికి మాత్రమే వాడతారని మండిపడ్డారు. నమ్మి ఓటేస్తే మతపిచ్చి పార్టీకి ఊడిగం చేస్తున్నారని.. ఉద్ధరించింది శూన్యమని షర్మిల వ్యాఖ్యానించారు. మోడీ చేతిలో 25 మంది లోక్ సభ, 11 మంది రాజ్య సభ ఎంపీలు రబ్బర్ స్టాంప్స్ గా ఉన్నారని ధ్వజమెత్తారు. బీజేపీ కోసం పని చేసే కీలుబొమ్మలని వైఎస్ షర్మిల ఆరోపించారు. హోదాపై అడిగే దమ్ములేదు. రాజధానికి నిధులు అడిగే సత్తా లేదన్నారు. పోలవరాన్ని ముంచుతుంటే ఎదురు తిరిగే ధైర్యం లేదన్నారు. అడ్డికి పావుసేరు కింద విశాఖ స్టీల్‌ను అమ్ముతున్నా.. పౌరుషం ఉండదన్నారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్ర హక్కులపై గళం విప్పకుండా బీజేపీ అక్రమ బిల్లులకు గొర్రెల్లా తల ఊపడం తప్ప... మన ఎంపీలకు ఏమి చేతకాదని తీవ్రంగా విమర్శించారు షర్మిల. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం అనుకుంటే ఈ పార్లమెంట్ సమావేశాల్లో రాష్ట్ర హక్కులపై నిలదీయండి అని సవాల్ విసిరారు. మోడీ మోసాన్ని ప్రశ్నించండి. హోదాపై తాడోపేడో తేల్చండి. ఢిల్లీని తలదన్నే రాజధాని ఏదని అడగండి. కేంద్రం బాధ్యతగా అమరావతికి నిధులు కాకుండా అప్పులు ఎందుకు ఇస్తున్నారో సమాధానం చెప్పమని రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో ప్రశ్నించాలని కోరింది. జీవనాడి పోలవరం ఎత్తు 41.15 మీటర్లకు కుదించి ఎందుకు జీవం తీశారని ఉభయ సభలను స్తంభింపజేయలని కోరింది. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ఉండదని మోడీతో అధికారిక ప్రకటన చేయించండి'' అని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.




# ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దండి

**నరసరావుపేట:**

పల్నాడు జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అరుణ్ బాబు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు సంయుక్తంగా పిలుపునిచ్చారు. శనివారం నరసరావుపేటలోని మున్సిపాలిటీ కార్యాలయం దగ్గర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా "స్వచ్ఛత, ప్లాస్టిక్ నిర్మూలన" పై నిర్వహించిన ర్యాలీని కలెక్టర్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ లు ప్రారంభించారు. మానవాళి మనుగడకు ప్రశ్నార్థకంగా మారిన ప్లాస్టిక్‌ను నిర్మూలించడం ఎంతో ముఖ్యం అన్నారు కలెక్టర్ అరుణ్‌బాబు. ప్రధానంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వాడడం ఆపి జూట్ బ్యాగులను వినియోగించాలన్నారు. ప్రతి ఒక్కరూ షాపింగ్‌కు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ కవర్లకు బదులు జూట్ బ్యాగ్ లను వాడాలన్నారు ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు. తోపుడు బండ్ల వ్యాపారులు మొదలు పెద్ద పెద్ద షాపులు, సూపర్ మార్కెట్లు.. మొదలైన వ్యాపారులు ప్లాస్టిక్ కు బదులు జూట్ బ్యాగులు, క్లాత్ బ్యాగులను వినియోగదారులకు ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ నిర్మూలన జూట్ బ్యాగులు, స్టీల్ వాటర్ బాటిల్స్ వినియోగంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో ప్రజల భాగస్వామ్యం అవసరం అన్నారు. అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ప్లాస్టిక్ నిర్మూలన జూట్ బ్యాగుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛత, ప్లాస్టిక్ నిర్మూలన ప్రత్యామ్నాయాల వినియోగం" పై అవగాహన కల్పించే దిశగా ప్రయత్నిస్తానని విద్యార్థులు, ప్రజలతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతకై అమూల్యమైన సేవలను అందిస్తున్న స్వచ్ఛతా కార్మికులను జిల్లా కలెక్టర్ సన్మానించారు. స్వచ్ఛత, ప్లాస్టిక్ నిర్మూలన ప్రత్యామ్నాయాల వినియోగంపై అవగాహన కల్పించే దిశగా ఏర్పటు చేసిన స్టాల్స్ ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట ఆర్డీవో ,మున్సిపల్ కమిషనర్ విద్యార్థులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమం .. అభివృద్ధి జోడెద్దులు

కొవ్వూరు టౌన్ 18 వ వార్డ్‌లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. టుమెన్ కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. వారికి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుని సమస్య పరిష్కార దిశగా సంబంధిత అధికారులకు ఫోన్ చేసి తక్షణ పరిస్కారం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తనను నేరుగా కలవాలని.. 24గంటలు నియోజకవర్గ ప్రజలకు కోసం తన ఇంటి తలుపులు తీసే ఉంటాయని చెప్పారు ఎమ్మెల్యే. స్వర్ణాంధ్ర సాధన దిశగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని.. సంక్షేమం, అభివృద్ధి సమానంగా చేస్తోందన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీలను 70శాతం అమలు చేశామని.. మరో ముప్పై శాతం కూడా అమలు చేస్తామని చెప్పారు ఎమ్మెల్యే ముప్పడి.

# ప్లాస్టిక్ రహిత సమాజ కోసం పాటుపడదాం

**నందిగామ:**

మన ఆరోగ్యాన్ని, పర్యావరణాన్నీ, ఆర్థిక వనరులను కాపాడుకుందామన్నారు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. శనివారం నందిగామ మండలం, పెద్దవరంలో జరిగిన స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి నెలా మూడో శనివారం ప్రత్యేక థీమ్‌తో స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది జనవరిలో న్యూ ఇయర్ క్లీన్ స్టార్ట్‌తో ఈకార్యక్రమం ప్రారంభమైందన్నారు కలెక్టర్ లక్ష్మీశ. ఈనెల ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం ఇతివృత్తంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగం దిశగా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఈ కార్యక్రమాలను ఊరూవాడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం లేచింది మొదలు, పడుకునే వరకు రోజువారీ జీవితంలో ప్లాస్టిక్ భాగమై పోయిందని.. ఇది ఇలానే కొనసాగితే పర్యావరణానికీ, మన ఆరోగ్యానికీ పెనుముప్పుగా మారతోందని.. భావితరాల మనుగడ ప్రమాదంలో పడుతుందన్నారు. ప్లాస్టిక్ వస్తువులను విచ్చలవిడిగా వాడి బయటపడేస్తే.. అవి డ్రెయిన్లలోకి చేరుతాయని, దీంతో కాలువలు పూడుకుపోయి మురుగునీరు రోడ్లపైకి వస్తుందన్నారు. దోమలు వృద్ధి చెంది డెంగ్యూ, మలేరియా వంటి విష జ్వరాల బారినపడే ప్రమాదముందన్నారు. అదేవిధంగా భూమిలోకి చేరిన ప్లాస్టిక్‌లు మైక్రో ప్లాస్టిక్స్‌గా మారి మనల్ని మెల్లమెల్లగా కబళించేస్తాయన్నారు. ఈ నేపథ్యంలో తొలి అడుగుగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి దూరంగా ఉందామని, క్లాత్ బ్యాగ్స్, జ్యూట్ బ్యాగ్స్, పేపర్ ప్యాకింగ్ వంటివాటికి చేరువవుదామని కలెక్టర్ పిలుపునిచ్చారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కోసం కలిసికట్టుగా అడుగేద్దాం.. గౌరవ ప్రధాని, గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు ప్రతిరూపాలైన వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి సమష్టిగా కృషిచేద్దామని.. మనసుంటే మార్గం ఉంటుందని, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందమున్న పాలిథీన్ కవర్లు వినియోగించినా, ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్ వస్తువులు వినియోగించినా చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపర చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయ వస్తువులు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు తదితరాలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. తడి చెత్త పొడిచెత్తను సక్రమంగా, క్రమశిక్షణతో, నిబద్ధతతో వేరుచేసి ఇస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న 12 మందికి మొక్కలు, సర్టిఫికెట్లు, జ్యూట్ బ్యాగులు అందించారు. అదేవిధంగా గ్రీన్ అంబాసిడర్లను సత్కరించారు. స్వచ్ఛత, ప్లాస్టిక్ నిర్మూలనపై, ప్రత్యామ్నాయాల వినియోగంపై అవగాహన కల్పించే దిశగా ప్రయత్నిస్తానని, మన ఆంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేటట్లు తన వంతు కృషిచేస్తానంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధిలు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.






# దారి కోసం రైతుల ఆందోళన

**వత్సవాయి:**

యన్.టి.ఆర్ జిల్లా వత్సవాయి మండలం పెద్ద మోదుగపల్లిలో దారి కోసం రైతులు ఆందోళనకు దిగారు. రైతుల పంటల సాగు, పంటల దిగుబడుల కోసం రాకపోకలు ఇబ్బందులు పడుతున్నామని నిరసనకు దిగారు. ఇప్పటికే గ్రామ పంచాయతీ సచివాలయంలో మట్టి రోడ్డు వేసుకోవడానికి అనుమతులు ఇవ్వాలని అధికారులను విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఇందులో భాగంగా వత్సవాయి మండల ఎమ్మార్వో కార్యాలయానికి సంబంధించిన సర్వే నెంబర్ కి హద్దులు నిర్ణయించాలని పంచాయతీ అధికారులు కోరారని, వెంటనే రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ణయించి, మార్కింగ్ చేసి స్థానిక రైతులకు అప్పగించారని రైతులు తెలియజేశారు. దీనితో రైతులు దారి కోసం రెవెన్యూ సిబ్బంది నిర్ణయించిన హద్దులలో సుమారు 2 లక్షల రూపాయల ఖర్చుతో చదును చేసారని రైతులు తెలియజేశారు. కొందరు వ్యక్తులు రైతుల దారి కోసం చదును చేసిన దానిని ధ్వంసం చేసారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫోన్ చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన రైతులపై దాడి చేయడానికి కూడా కొందరు వ్యక్తులు వెనుకాడటం లేదన్నారు. ఇప్పటికే పెద్ద మోదుగపల్లి గ్రామంలో రైతుల కోసం సర్వే నెంబర్ 43లో పొలిమేరు డొంక పేరు మీద 3 ఎకరాల 50 సెంట్ల భూమి ఉందని.. దీనికి తూర్పు, పడమర దారి కూడా ఉందని ఈ సర్వే నెంబర్ వెంట 40 ఎకరాల భూమిలో సుమారు 80 మంది రైతులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైన రైతులు వారికి రక్షణ కల్పించి వ్యవసాయ సాగు కోసం స్వచ్ఛందంగా పొలిమేరు డొంకని దారి చేసుకోవడానికి రైతులకు ప్రభుత్వం అండగా నిలబడి రైతులను ఆదుకోవాలని వారు ప్రభుత్వాని డిమాండ్ చేశారు.

# ఆకలి కేకలు పోస్టర్ రిలీజ్




**విజయవాడ:**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలపై ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం చేపట్టిన పోరాటానికి లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి మద్దతిస్తున్నట్లు పార్టీ అధ్యక్షులు, దళాధిపతి విజయ్ కుమార్, జి. ఎస్ఆర్‌కేఆర్ ప్రకటించారు. శనివారం ప్రాతూరులోని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం నాయకులు.. విజయ్ కుమార్ గారిని కలిసి మద్దతు కోరడం జరిగింది. ఈ సందర్భంగా వారితో విజయ్ కుమార్ మాట్లాడుతూ.. బీసీ హాస్టళ్లలోని విద్యార్థులకు మెస్ ఛార్జీలు రోజుకు రూ.150, కాస్మోటిక్ ఛార్జీలు రూ.500కు పెంచాలని.. బీసీ హాస్టళ్లకు శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే బీసీ హాస్టళ్లలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను ప్రభుత్వం తక్షణమే భర్తీ చేయాలన్నారు. లేని పక్షంలో ఓబీసీ సంక్షేమ సంఘం చేపట్టే పోరాటంలో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో పాల్గొని విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యేవరకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. దేశ భవిష్యత్తుకు వెన్నెముకలైన విద్యార్థుల సమస్యల కోసం తాము ఎందాకైనా వెళ్తామని.. ప్రభుత్వం దిగివచ్చేవరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని విజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఓపీసీ విద్యార్థి సంక్షేమ సంఘం చేపట్టిన 'ఆకలి కేకలు' పోరాట పోస్టర్ ను ఆయన ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓబిసి విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు, రాయలసీమ అధ్యక్షులు విజయ ఉత్తరాది, చిత్తూరు జిల్లా అధ్యక్షులు వెంకట్ యాదవ్, శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వ విద్యాలయ అధ్యక్షులు డాన్ ఏబ్రా, యూనివర్సిటీ విద్యా సంఘం నాయకులు శివాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండి చదువు పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలి

**తెనాలి:**

రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మొవ్వ విజయలక్ష్మి స్మారక అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప పాల్గొన్నారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులకు మూడు లక్షల రూపాయలు ప్రోత్సహక నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు స్మారక సేవా సమితి వ్యవస్థాపకులు మొవ్వ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప.. విద్యార్థులు భవిష్యత్తు సవాళ్లు అనే అంశంపై ప్రసంగించారు. ముందుగా ఇదే అంశంపై. విద్యార్థుల్ని పలు ప్రశ్నలు వేసి, వారి ఆలోచన విధానాన్ని ఈ సందర్భంగా తెలుసుకున్నారు. నేటి సమాజంలో విద్య అనేది ఎంతో ముఖ్య అవసరమని విద్యార్థి దశ నుండి చదువు పట్ల ప్రత్యేక దృష్టి కలిగి ఉండి విద్య ద్వారా జ్ఞానాన్ని సంపాదించుకోవాలని విద్యార్థులకు న్యాయమూర్తి డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప... హితవు పలికారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవాలంటే విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. కాకినాడ jntuk వైస్ ఛాన్సలర్ డాక్టర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ విద్య ముఖ్యమని,నేటి కాలంలో చదువుకోటానికి అనేక అవకాశాలు ఉన్నాయని ఆర్థికపరంగా ఆదుకునేందుకు ఎన్నో స్మారక సేవా సంస్థలు సహాయం అందిస్తున్నాయని అన్నారు. బ్యాంకులు లోన్లు ఇస్తున్నాయని ప్రభుత్వం స్కాలర్షిప్స్ ఇవ్వటం జరుగుతుందని చెప్పారు. విద్యార్థులు చదువు పట్ల మక్కువతో ఉన్నత విద్యను అభ్యసించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు నగదు ప్రోత్సాహ బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, ఆమె భర్త వంగర శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించి అవార్డుని అందజేశారు. ఈ కార్యక్రమాన్ని మొవ్వ సత్యనారాయణ కుటుంబ సభ్యులు గీతిక, రోహిణి, పద్మజ, బుజ్జి తదితరులు పర్యవేక్షించారు.





## జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు

**అనంతపురం:**

చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, నేరాలకు తావులేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో జిల్లాలోని పలు సమస్యాత్మక గ్రామాలు/ కాలనీలలో ఆయా పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు శనివారం తెల్లవారుజామున నుండి నిర్వహించి విస్తృత తనిఖీలు చేపట్టారు. ఫుట్ పెట్రోలింగ్, గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించి గంజాయి అనర్థాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, క్రైం అగనెస్ట్ ఉమెన్ , శక్తి యాప్ , డయల్ 100, సిసి కెమేరాల ప్రాముఖ్యత, తదితర అంశాలపై అవగాహన చేశారు. అంతేకాకుండా... రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, అనుమానితులు, పాత కేసుల్లోని నిందితులపై ప్రత్యేక నిఘా వేసి ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. గ్రామాలలో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయా గ్రామాలలో ప్రజలకు సూచించారు. గంజాయి, కర్నాటక మద్యం, నాటు సారా, గుట్కా నియంత్రణ కోసం అనుమానితులు/ పాత కేసుల్లోని నిందితుల ఇళ్లల్లో... పశువుల పాకలు, గడ్డి వాము ప్రాంతాలు, దుకాణాలు, బడ్డీ కొట్లలో క్షుణ్ణంగా తనిఖీలు కొనసాగించారు. అక్రమ మద్యం జోలికెళితే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. పాత కేసుల్లో నిందితులతో సమావేశమై పాత పంథా కొనసాగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. బెల్టు దుకాణాలు నిర్వహించి మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు ఆయా గ్రామాలలో తెలియజేశారుకార్డన్ సర్చ్‌లో భాగంగా బుక్కరాయసముద్రం పోలీసులు చెన్నంపల్లిలో 10 లిక్కర్ బాటిళ్లు, సరైన ధ్రువ పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. యల్లనూరు పోలీసులు బొప్పేపల్లిలో సరైన ధ్రువ పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. గుంతకల్లు ఒన్ టౌన్ పోలీసులు షికారీ కాలనీలో సరైన ధ్రువ పత్రాలు లేని 6బైక్‌లను సీజ్ చేశారు. పలు చోట్ల అక్రమ లిక్కర్, నాటు సారా స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.



## లాఠీలు వదిలి.. చీపుర్లు పట్టారు

**అనంతపురం :**

జిల్లా వ్యాప్తంగా పోలీసు స్టేషన్లలో "స్వర్ణాంధ్ర స్వచ్ఛ దివస్" జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసు స్టేషన్లు, పరిసరాలను పరిశుభ్రం చేశారు పోలీసులు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ మూడవ శనివారం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎస్సైలు, సి.ఐ లు, సిబ్బంది పాల్గొని ఆయా పోలీసు స్టేషన్లు, పరిసరాలను శుభ్రం చేశారు. చీపుర్లు చేత పట్టి చెత్తా చెదారాన్ని ఊడ్చి అక్కడి నుండీ తరలించారు. పిచ్చి మొక్కలను తొలగించారు. చిన్న చిన్న గుంతలు పూడ్చారు. పోలీసు స్టేషన్ల ఆవరణ, పరిసరాలలో మొక్కలు నాటి నీరు పోశారు.




## అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

**కడప :**

కడప జిల్లా చాపాడు మండలంలోని పెద్ద చీపాడులో మహిళ దారుణ హత్య కలకలం రేపింది. అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో భర్త తన భార్యను హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెద్ద చీపాడు గ్రామానికి చెందిన గోపాల్ ప్రైవేట్ బస్సు డ్రైవర్గా విధులు నిర్వహిస్తున్నాడు. అతని భార్య సుజాతతో గత కొంతకాలంగా వివాదాలు నెలకొన్నట్లు సమాచారం. అయితే, సుజాతకు మరో వ్యక్తితో అక్రమ సంబంధం ఉందని అనుమానించిన గోపాల్, ఎన్నిసార్లు హెచ్చరించినా ఆమె వినకపోవడంతో కోపంతో రెండు రోజుల క్రితం హత్య చేసి.. అనంతరం ఆ మృతదేహాన్ని వనిపెంట సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి పడేశాడు. ఈ దారుణ ఘటన తర్వాత పోలీస్ స్టేషన్‌కి వెళ్లిన గోపాల్, తానే హత్య చేశానని లొంగిపోయాడు. దీంతో గోపాల్ ఇచ్చిన సమాచారం మేరకు చాపాడు పోలీసులు వనిపెంట అటవీ ప్రాంతంలో సుజాత మృతదేహం కోసం గాలించగా, గోనే సంచిలో కట్టి పడవేసిన శవం కనిపించింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. నిందితుడు గోపాల్ ను అదుపులోకి తీసుకుని రిమాండ్ కు తరలించారు పోలీసులు.

## విశాఖలో భారీ అగ్నిప్రమాదం

**విశాఖపట్నం:**



విశాఖ జిల్లా ఆనందపురం మండలం గండిగుండం సమీపంలోని ఐటీసీ కంపెనీకి చెందిన స్టాక్ పాయింట్ గోదాంలో శుక్రవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి 10 గంటలకు గోదాం మూసివేశారు. 11.30 గంటల ప్రాంతంలో గోదాంలో సిగరెట్లు, అగరబత్తులు నిలవ ఉంచే ప్రాంతం నుంచి పొగ రావడాన్ని సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. అగ్నిమాపక కేంద్రానికి సమాచారాన్ని అందించారు. దీంతో ఘటనాస్థలికి చేరుకున్న చిట్టివలస అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. మంటలు అప్పటికే భారీగా వ్యాపించడంతో.. ఇతర ప్రాంతాల నుంచి 8 అగ్నిమాపక వాహనాలను రప్పించి మంటలను ఆర్పివేశారు. అయితే.. అప్పటికే గోదాముల్లోని ఉత్పత్తులు మొత్తం అగ్నికి ఆహుతయ్యాయి. సంఘటన స్థలాన్ని ఏసీపీ అప్పలరాజు, సీఐ వాసు నాయుడు, అగ్నిమాపక ఉన్నతాధికారులు రేణుకమ్మ తదితరులు పరిశీలించారు. ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. గోదాములో అగ్ని ప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన పరికరాలు పనిచేయలేదు. వీటి నిర్వహణలో లోపం, అక్కడ పని చేస్తున్న సిబ్బందికి వీటిపై అవగాహన లేకపోవడంతో మంటలు విస్తరించాయని అగ్నిమాపక అధికారులు గుర్తించారు.

# జగన్ 2.0లో సినిమా చూపిస్తాం

**కడప:**

చంద్రబాబు ష్యూరిటీ దౌర్జన్యాలు, అక్రమాలు, అన్యాయాలకు గ్యారెంటీగా మారిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. శనివారం నగరంలోని ఐఎంఏ హాలులో నార్త్ జోన్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజాపక్షమేనన్నారు. ఎన్నికల ముందు సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నీ అప్పులు చేస్తున్నారని మండిపడ్డారు. వెయ్యి రూపాయలు పింఛన్ పెంచి 5లక్షల పింఛన్లు తొలగించారని, పాలన ఎలా చేయాలో కూటమి నేతలే నేర్పిస్తున్నారని ఆరోపించారు. ఈ పాలనలో అన్యాయంగా, అక్రమంగా ప్రవర్తించిన నాయకులు, అధికారులకు 2.0లో సినిమా చూపిస్తామని హెచ్చరించారు. అధికారం ఉందని వైసీపీ కార్యకర్తలను ఎన్ని రకాలుగా వేధిస్తే అంతకు అంత వడ్డీతో సహా చెల్లిస్తామన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి చట్ట పరిధిలో పనిచేయాలని సూచించారు.




అనంతరం నగర మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకొని ఇతర రాష్ట్రాలు సంక్షేమ పథకాలు అమలు చేశాయన్నారు. తల్లికి వందనం లోకేష్ ఆలోచనల నుంచి పుట్టిందని చంద్రబాబు చెప్పడం హాస్యాస్పదమన్నారు. డబ్బులు ఉన్నవారు లేనివారికి సాయం చేయాలని పీ4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని, లక్షల కోట్లు ఉన్న చంద్రబాబు ఎంతమందిని దత్తత తీసుకోవాలో ప్రజలే ఆలోచించాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 మాసాలైనా ఉద్యోగ, ఉపాధ్యాయులు, నిరుద్యోగులకు చేసిందేమీ లేదన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కడప ఎమ్మెల్యే మాధవి చుట్టూ ఉన్నవారంతా దొంగలు, దోపిడీదారులేనని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఆరోపించారు. గత ప్రభుత్వంలో తాము మంజూర చేయించిన నిధులకు తేదీలు మార్చి కొత్త జీవోలు తెచ్చి మేమే తెచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బుగ్గవంకపై రెండు బ్రిడ్జిలకు రూ.20కోట్లు మంజూరు చేయిస్తే ఇంతవరకూ ఆ పనులు పూర్తి చేయించలేని స్థితిలో ఎమ్మెల్యే ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కడప నగరపాలక సంస్థకు చిల్లిగవ్వ కూడా ఇవ్వకపోయినా ఎవరి సొమ్మని ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేస్తున్నారని ప్రశ్నించారు. నగర ప్రథమ పౌరుడైన మేయర్‌ను పిలవకుండా అధికారిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పేరు పెద్దగా వేయించుకుంటున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆఫ్ట్రాల్ పులివెందుల ఎమ్మెల్యే అంటున్న టీడీపీ నేతలు ఆయన పర్యటనలకు 2వేల మంది పోలీసులను బందోబస్తుకు పంపి జనాన్ని ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. అనంతరం చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, వైసీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



**రాయచోటి:**

జగనన్న రాజ్యం మళ్లీ వస్తేనే పేదల కష్టాలు తీరుతాయన్నారు వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి . హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. రాయచోటి రూరల్ మండలంలో బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ.. రీ కాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో కార్యక్రమం వైసిపి కార్యాలయంలో జరిగింది. సమావేశంలో పలువురు వైసీపీ నేతలు పాల్గొన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చక అన్ని వర్గాల ప్రజలను మోసాగిస్తున్నారన్నారని మండిపడ్డారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 'అన్నదాత సుఖీభవ', 20 లక్షల ఉద్యోగాల కల్పన ,నిరుద్యోగ భృతి వంటి హామీలను అమలు చేయలేదన్నారు శ్రీకాంత్‌రెడ్డి. చంద్రబాబు పాలనతో ప్రతి కుటుంబానికి జరిగిన నష్టం ఎంత? చంద్రబాబు మోసాలపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు. రీకాలింగ్ చంద్రబాబూస్ మ్యానిఫెస్టో గుర్తుకు తెస్తూ..' అనే కార్యక్రమాన్ని రాయచోటి రూరల్ మండల పరిధిలో విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను ఆయన కోరారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే ప్రజాగళం, సూపర్‌సిక్స్, సూపర్ సెవెన్ హామీలు వస్తాయన్నారు అంతేకాకుండా చంద్రబాబు చేసిన దగా, పచ్చి మోసం వివరాలు కూడా వస్తాయన్నారు. గత ఏడాది ఇవ్వకుండా ఎగ్గొట్టింది ఎంత? ఇక ఈ ఏడాది రావాల్సిన మొత్తం ఎంత? అనేది కూడా తెలుస్తుందన్నారు. ఏడాదిలోనే కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో తీవ్ర వ్యతిరేఖత వచ్చిందన్నారు హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రెడ్డెప్ప గారి రమేష్ కుమార్ రెడ్డి. సపరిపాలనలో తొలి అడుగు అంటూ టిడిపి చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు ఎవ్వరూ నమ్మడం లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి, చంద్రబాబు మోసాలను ఎండగడుదామని పిలుపునిచ్చారు.



## పొగాకు కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**బాపట్ల:**

రైతు పండించిన పొగాకును పూర్తిస్థాయిలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం సంసిద్ధంగా ఉందని బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. పర్చూరు లో ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాలను శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు కలెక్టర్. రైతులు అమ్మేందుకు తీసుకువచ్చిన పొగాకును పరిశీలించారు. పొగాకు కేంద్రాల క్రయవిక్రాల విషయంలో రైతులకున్న సందేహాలను అడిగి తెలుసుకున్నారు. రైతులను పొగాకు కంపినిలు మోసం చేయటంతో ప్రభుత్వం ముందుకు వచ్చింది అని.. రైతులు రకరకాల సందేహాలతో అధైర్య పడవద్దని సూచించారు. బ్లాక్ బర్లీ పొగాకు మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు ధైర్యం చెప్పారు. ఇప్పటివరకు రూ. 25 కోట్ల విలువైన పొగాకును కొనుగోలు చేశామని, వర్షాలకు పొగాకు తడవకుండా కాపాడుకోవాలని కలెక్టర్ సూచన చేశారు. సోమవారం నుంచి కొనుగోలు కేంద్రాలలో వేగం పుంజుకుంటుందని, ప్రతి రోజు 900 టన్నుల పొగాకును కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. పొగాకు బేళ్లు 20 కంటే తక్కువ తేమ శాతం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి అని రైతులకు సూచించారు.

# పల్నాడు జిల్లాలో అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశం

**నరసరావుపేట:**

పల్నాడు జిల్లాలో అధిక నేరాలు జరుగుతున్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని 13 వ ఏడిజె న్యాయమూర్తి ఎన్ సత్యశ్రీ అన్నారు. అధిక నేరాలున్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. స్థానిక ఏ1 కన్వెన్షన్ హాల్‌లో పల్నాడు జిల్లా అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశం శనివారం జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో నరసరావుపేట 13 వ ఏడిజె న్యాయమూర్తి ఎన్ సత్యశ్రీ, పల్నాడు జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు లు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు, సమయానికి న్యాయపరమైన ఆధారాలు సమర్పించాలన్నారు 13 వ ఏడిజె న్యాయమూర్తి ఎన్ సత్యశ్రీ . సాక్షుల హాజరును నిర్ధారించే చర్యలు, వారిని రక్షించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నేర గణాంకాల అప్డేట్, కేసుల పరిష్కార రేటు మెరుగుపరచాలని, సరైన సాక్ష్యాధారాలతో న్యాయ విచారణ విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు మాట్లాడుతూ బాలికలు, మహిళలు, వృద్ధులపై దాడులను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించి నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ఫోక్సో కేసులపై పాఠశాలలు, కళాశాలలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలపై యువతలో జాగ్రత్త కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మైనర్లు వాహనాలు నడపడం, ఓవర్ లోడింగ్ వంటి అంశాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పిడీఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడానికి రెవెన్యూ, పోలీస్ సంయుక్త చర్యలపై చర్చించారు. ఈ సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఆరు నెలల నేర గణాంకాలపై సమగ్ర సమీక్ష, కేసుల దర్యాప్తు పురోగతి, ప్రజల ఫిర్యాదుల పరిష్కార అంశాలపై చర్చించటం జరిగిందన్నారు. న్యాయ, ఫోరెన్సిక్, పోలీస్, ఇతర శాఖల సమిష్టి కృషి యొక్క ప్రాధాన్యతను వివరించారు. సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు వేగవంతం చేసి ప్రజలకు స్నేహ పూర్వక పోలీసింగ్ అందించాలని ఆదేశించారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెంచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పోలీస్ బీట్ వ్యవస్థను బలోపేతం చేయడం, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ముమ్మరం చేయడం వంటి కార్యక్రమాలు, నేర ప్రభావిత ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. మత్తు పదార్థాలపై నిరంతర స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించడం, శక్తి టీంల ద్వారా మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆధునిక పద్ధతుల ద్వారా సమర్థవంతమైన దర్యాప్తు, సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం, పల్లెనిద్ర, అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువ కావడం, మైనర్ల వాహన నడుపుదలపై ప్రత్యేక డ్రైవ్, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం లాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.గత ఆరు నెలల కాలంలో కేసుల దర్యాప్తు, సమాచార వ్యవస్థ బలోపేతం, అవగాహన కార్యక్రమాలు, బందోబస్తు విధుల నిర్వహణలో ఉత్తమంగా సేవలందించిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు చేతుల మీదుగా మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సమావేశం ద్వారా జిల్లాలో నేరాల నివారణ, ప్రజల భద్రత, న్యాయ పరిరక్షణకు సంబంధించి సమగ్ర వ్యూహాన్ని రూపొందించడమే కాకుండా, విభిన్న శాఖల మధ్య సమన్వయం బలోపేతం చేయడంలో ఇది ఒక మైలురాయిగా నిలిచింది. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి, ఉమ్మడి గుంటూరు జిల్లా ఫోరెన్సిక్ శాస్త్రవేత్త రవికుమార్, పిపీలు, ఏపీపీలు, రెవెన్యూ, ఎక్సైజ్, ఫైర్, ఇతర శాఖల అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రేమపై కోర్సు.. అవును ఉండాల్సిందే..!



ఇంజనీర్, డాక్టర్ లేదా టీచర్ కావడానికీ కోర్సులు ఉంటాయి. మరి ప్రేమించడానికేంటి? ఇది వినడానికి విచిత్రంగా అనిపించవచ్చు కానీ వాస్తవానికి చాలా అవసరం. చదువు మనకు ఉద్యోగానికై సిద్ధం చేస్తే, ప్రేమపై కోర్సు మన జీవితానికి సిద్ధం చేస్తుంది. దీన్ని గుర్తించిన ఢిల్లీ యూనివర్సిటీ, విద్యార్థుల కోసం ప్రేమపై ప్రత్యేక సిలబస్‌తో కోర్సు ప్రవేశపెట్టింది. నేటి పరిస్థితిలో, ప్రేమపై గందరగోళంతో జీవిస్తున్న యువతకు ఇది అత్యంత అవసరం.

**ప్రేమ – శాశ్వతమైన శక్తి**

ప్రేమ అనేది సదాకాలికమైన విషయం. ప్రతి ఒక్కరూ దీనిని అనుభవిస్తారు - స్నేహం, కుటుంబం లేదా రొమాన్స్ రూపంలో. ప్రేమ వల్లే బలమైన బంధాలు, దీర్ఘకాలిక పెళ్లిళ్లు ఏర్పడతాయి. ప్రేమ జీవితాన్ని మారుస్తుంది. కానీ దీని గురించి సరిగ్గా అర్థం చేసుకోకపోతే, బాధకీ, నష్టానికీ కారణమవుతుంది. నేటి యువత ప్రేమ అంటే ఏమిటో పూర్తిగా అర్థం చేసుకోలేకపోతున్నారు. భ్రమలే ఎక్కువ, నిజమైన ప్రేమ అర్థం కాకపోవడం వల్ల అస్థిరత, భావోద్వేగ సమస్యలు తలెత్తుతున్నాయి.

**జెన్ Z – కొత్త ప్రేమ పదజాలం**

నేటి ప్రేమకి జెన్ Z తనదైన పదజాలాన్ని కల్పించింది: సిట్యుయేషన్‌షిప్, ఘోస్టింగ్, బెంచింగ్, బ్రెడ్‌క్రంబింగ్ లాంటి పదాలు ఇవాళ్టి ప్రేమలోని భావోద్వేగ రాహిత్యాన్ని సూచిస్తున్నాయి. ప్రేమను శారీరక లేదా ఆర్థిక మార్పిడి వరకు పరిమితం చేస్తున్నారు. భావోద్వేగం, మానసిక అనుబంధం తక్కువైపోతుండటమే యువత ఈ ప్రేమలో విఫలమవడానికీ, బాధపడటానికీ ప్రధాన కారణం.

**ప్రేమ – ఒక శక్తివంతమైన ప్రేరణ**

నిజమైన ప్రేమ ఒక వ్యక్తిని ప్రేరేపించే శక్తిగా మారుతుంది. ఉదాహరణకు, ఒక గ్రామీణ యువకుడు పోలీస్ ఆఫీసర్ గౌరవాన్ని చూసి ఐపీఎస్ కావాలని నిశ్చయించుకున్నాడు. కోచింగ్ సమయంలో కలిసిన యువతితో ఏర్పడ్డ ప్రేమానుభంధం అతనికి భావోద్వేగ మద్దతుగా మారింది. తన ఆర్థిక స్థితిని దృష్టిలో పెట్టుకొని కష్టపడి విజయాన్ని సాధించి, చివరికి ఆమెను పెళ్లిచేసుకున్నాడు – ఈ కథ 12th ఫెయిల్ చిత్రంగా ప్రేరణనిస్తుంది. మరో వ్యక్తి భార్య జ్ఞాపకార్థంగా కొండను కోసి రోడ్డు వేశాడు. ఇవన్నీ ప్రేమ ఎంతటి శక్తివంతమైన ప్రేరణగా మారుతుందో చూపుతున్నాయి. హార్వర్డ్ యూనివర్సిటీ పరిశోధనల ప్రకారం, ప్రేమతో కూడిన బంధాలు ఉన్నవారు ఎక్కువ ఆనందంగా, ఆరోగ్యంగా జీవిస్తారు. కానీ యువత ఈ ప్రేమ శక్తిని కొంతకాలం నెమ్మదిగా నాశనం చేసుకుంటూ తాత్కాలిక అవసరాలకు వాడుతున్నారు.

**అపరిపక్వ ప్రేమ గోతులు**

కళాశాల విద్యార్థులు తక్కువలోపే ప్రలోభాలకు లోనై, పాటలు, బహుమతులతో మొదలై, అవసరాలు తీరిన తర్వాత మోసం చేసే ప్రేమలో పడతారు. దీన్ని లవ్ బాంబింగ్ అంటారు. ఈ తతంగం మనోభంగానికి దారితీస్తుంది. మరో ప్రమాదకర మాయాజాలం క్యాట్‌ఫిషింగ్ – నకిలీ సోషల్ మీడియా ఖాతాల ద్వారా ఇతరులను మోసం చేయడం. 40 సంవత్సరాలపైబడినవారూ దీనికి గురవుతున్నారు. ఇంకా గ్యాస్‌లైటింగ్ అనే మానసిక నియంత్రణ పద్ధతిలో, ఒక వ్యక్తి మరోవారిని భావోద్వేగంగా ఒత్తిడికి గురిచేస్తూ వారిని విడివిడిగా చేస్తారు, అవమానిస్తారు. ఇవన్నీ తెలియకపోవడం వల్లే జీవితాలు నాశనమవుతున్నాయి.

మరి నిజమైన ప్రేమ అంటే ఏమిటి?

ప్రేమ అనే భావనను మనోవైద్యులు సంవత్సరాలుగా అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మనిషి ప్రేమలో పడటం వెనుక కారణం ఏంటి? నిజమైన ప్రేమ అంటే ఏమిటి? లైకింగ్ థియరీ, కలర్ వీల్ థియరీ, అటాచ్‌మెంట్ థియరీ, ట్రయాంగిల్ థియరీ వంటి సిద్ధాంతాలు ప్రేమను వివరిస్తాయి. కానీ ఇవాళ్టి యువత వీటిలో ఏదీ తెలుసుకోలేదు. అందుకే ప్రేమలో పదే పదే తప్పులు చేస్తున్నారు.

**నేటి పరిస్థితుల్లో అవగాహన అవసరం**

డేటింగ్ యాప్స్, డిజిటల్ కమ్యూనికేషన్ పెరిగిన ఈ రోజుల్లో సంబంధాలు మరింత క్లిష్టమయ్యాయి. ఆన్లైన్ స్టాకింగ్, భావోద్వేగ నొక్కులు, తేలికపాటి విడిపోనలు – ఇవన్నీ యువతను వేధిస్తున్నాయి. కానీ ఇలాంటి విషయాలపై మాట్లాడే వేదికలు – ఇంట్లోనూ, కళాశాలలలోనూ – లేవు. దారి తప్పిన నిర్ణయాలు, భావోద్వేగ నష్టాలు – ఇవన్నీ మార్గదర్శనం లేకపోవడం వల్లే జరుగుతున్నాయి. కోర్ట్ అనే సినిమాలో చూపించినట్లుగా, చట్టాలు చేయడం సరిపోదు – అవి నేర్పించాలి. అదే ప్రేమ విషయంలోనూ వర్తిస్తుంది. ప్రేమ పట్ల హెచ్చరికలు ఇవ్వడం కంటే ప్రేమను ఎలా అర్థం చేసుకోవాలి, పెంపొందించుకోవాలి, విఫలమైన ప్రేమతో ఎలా నెగ్గుకోవాలి, స్వార్థపూరిత సంబంధాలను ఎలా గుర్తించాలో నేర్పాలి.

**ప్రేమను జీవన నైపుణ్యాలుగా నేర్పాలి**

మన పిల్లలకు నడవడం, మాట్లాడటం, తినడం, ఇతరులతో వ్యవహరించడం నేర్పిస్తాం. అలానే ప్రేమించడం నేర్పించకూడదా? ప్రేమపై సరైన అవగాహన ఉండడం వల్ల యువత భావోద్వేగ విపత్తుల నుంచి తప్పించుకోగలుగుతారు. ప్రేమ శక్తిని సానుకూలంగా ఉపయోగించుకొని విజయవంతమైన జీవితం నిర్మించగలుగుతారు. ప్రేమపై ఒక సదుపాయమైన కోర్సు ద్వారా మనం భావోద్వేగ పరిపక్వత గల, బాధ్యతాయుతమైన తరం తయారు చేయగలుగుతాం.



బీ కృష్ణ, సీనియర్ సైకాలజిస్ట్
99854 28261

## ఓ సినిమా క్లాస్ రూమ్‌నే మార్చేసింది..!

# ఆ రాష్ట్రంలో ఇక బ్యాక్ బెంచీలు లేవు..!!





అనగనగా ఓ సినిమా..ఆ సినిమా స్ఫూర్తితో కేరళ రాష్ట్రంలో క్లాస్ రూం స్టైల్ మారిపోయింది. కొల్లం జిల్లాలోని ఆర్.వి.వి సెకండరీ హయ్యర్ స్కూల్‌కు విద్యార్థులు వెళ్లి క్లాస్‌రూమ్‌లోకి అడుగు పెట్టి ఆశ్చర్యపోయారు. ఎందుకంటే అక్కడ బెంచీలు ఒకదాని వెనుక ఒకటి లేవు. బెంచీలన్నీ రౌండ్‌గా వేసున్నాయి. పాపినిశ్శేరిలోని స్కూల్, అదూర్‌లోని స్కూల్, తూర్పు మంగడ్‌లోని స్కూల్, పాలక్కాడ్‌లోని స్కూల్... ఈ స్కూళ్లన్నింటిలోనూ విద్యార్థులకు ఇదే ఆశ్చర్యం. కారణం... అక్కడ కూడా క్లాస్‌లలో బెంచీలు ఒకదాని వెనుక ఒకటి లేవు. చుట్టూ వేసి ఉన్నాయి. గత నెల రోజులుగా కేరళలోని ఒక్కోబడి ఒక్కోబడి ఈ మార్పు చేసుకుంటూ వస్తోంది.


**ఈ మార్పుకు కారణం 'శనార్థి శ్రీకుట్టన్' సినిమా**

కేరళ రాష్ట్రంలో ఉన్నట్టుండి అక్కడ తరగతి గదులలో బ్యాక్ బెంచీలన్నీ రౌండ్ బెంచీలవడానికి కారణం రిలీజైనప్పుడు ఎవరూ పట్టించుకోని ఒక సినిమా. నెల క్రితం ఓటీటీలోకి వచ్చాక అందరూ దాన్నే చూస్తున్నారు. ఆ చూసే వారిలో విద్యార్థులు, టీచర్లు, పాఠశాల కరెస్పాండెంట్‌లు, తల్లిదండ్రులు ఉన్నారు... వారందరినీ ఆ సినిమా కదిలించింది. అందుకే వారందరూ క్లాస్‌రూమ్‌లో బ్యాక్‌బెంచ్ ఉండకూడదని నిశ్చయించుకున్నారు. నిజమే. క్లాస్‌రూమ్‌లో బ్యాక్‌బెంచ్ ఎందుకు? అంటూ ఆ సినిమా స్ఫూర్తితో క్లాస్ రూమ్ స్టైల్ మార్చేశారు.

సినిమా కథ...క్లుప్తంగా చెప్పాలంటే కె.ఆర్. నారాయణన్ అప్పర్ ప్రైమరీ స్కూల్, కారెట్టు, తిరువనంతపురం. ఈ పల్లెటూరు స్కూల్లోని ఏడో తరగతి సి సెక్షన్‌లో జరిగే సినిమా కథే 'శనార్థి శ్రీకుట్టన్'. శ్రీకుట్టన్ అనే కుర్రవాడు ఇంట్లోని పరిస్థితుల వల్ల రోజూ స్కూల్‌కి లేట్‌గా వస్తుంటాడు. తను వచ్చేసరికి ముందు బెంచీలన్నీ ఫిల్ అవడం వల్ల తప్పని పరిస్థితుల్లో బ్యాక్‌బెంచ్‌లో కూచుంటుంటాడు. వాడికి ముగ్గురు ఫ్రెండ్స్. వీళ్లంతా అల్లరి గ్యాంగ్ అని క్లాస్‌లో ఫ్రంట్ బెంచ్‌లో కూచునేవారి అభిప్రాయం. నిజానికి ఏ క్లాస్ రూం అయినా లాస్ట్ బెంచ్ స్టూడెంట్స్ పై సహజంగా అందరికీ ఉండే అభిప్రాయం కూడా ఇదే. క్లాస్‌కు వచ్చే ఒక ఉపాధ్యాయుడైతే వీరి మీద పగపడతాడు. వీరు దేనికీ పనికి రారన్నది ఆ స్కూల్ టీచర్ల అభిప్రాయం. ఇక్కడే కథ మలుపు తిరుగుతుంది. శ్రీకుట్టన్ స్కూల్ ఎలక్షన్‌లో నిలబడాలనుకుంటాడు. వీడి మీద పోటీగా ఫ్రంట్ బెంచ్‌లో కూచునే అంబడి అనే కుర్రవాడు నిలబడతాడు. ఎవరు గెలుస్తారు అనేది కథ. క్లాసురూముల్లో వివక్ష ఎన్ని రూపాల్లో ఉంటుంది... వివక్షకు కారణమైన నిర్మాణం ఎలా ఉంటుంది... క్లాస్‌రూమ్‌లోనే వివక్ష పాటించిన విద్యార్థి బయటకు వెళ్లాక పాటించడని గ్యారంటీ ఏమిటీ... పైకి ఇదే కథ అనిపించినా దీనిని ముందు నుంచే మార్చాలి అని దర్శకుడు వినేష్ విశ్వనాథ్ చెప్పదలుచుకున్నాడు...చాలా బాగా చెప్పాడు.

**1996లో కేంద్రం చెప్పినా...**

క్లాస్‌రూమ్‌లో విద్యార్థుల సీటింగ్ వారిలో వివక్షకు కారణం కాకూడదని, పిల్లల తెలివితేటలు... ఆర్థిక స్థితి... ప్రవర్తనను ఆధారంగా ముందు బెంచీలకు కొందరిని, వెనుక బెంచీలకు కొందరిని పరిమితం చేయకూడదని 1996లో కేంద్ర ప్రభుత్వం ఆరు రాష్ట్రాలను మోడల్‌గా తీసుకుని మార్పులకై ప్రతిపాదించింది. అయితే ఆ మార్పులను ఎవరూ పట్టించుకోలేదు. మన దేశంలో స్కూళ్లు మొదలైనప్పటి నుంచి 'మొద్దు'లుగా భావించే పిల్లలను వెనుక కూచోబెట్టడం టీచర్లకు అలవాటైపోయింది. వెనుక కూచుని వెనుకబడితే మళ్లీ వారిదే తప్పుగా నిలబెట్టడం కూడా ఆనవాయితీనే. విద్యార్థిగా పొందే గౌరవం వెనుక బెంచీ విద్యార్థులకు చాలామందికి ఉండదు. ఈ పరిస్థితి మారాలని ఒక వెనుకబెంచీ కుర్రాడిని హీరోగా చేసి అతనిలోని తెలివితేటలను, చురుకుదనాన్ని చూపుతూ నిరూపించాడు దర్శకుడు ఈ సినిమాలో. అందుకే అది కేరళ బడుల్లో కదలిక తెచ్చింది. ఇక దేశం మొత్తం ఇలాంటి సినిమాలో ఆలోచనలు వచ్చి



మార్పు తేవాల్సి ఉంటుంది. మార్పు మంచిదైతే అందరికీ మంచే కదా?




## గూగుల్, మెటాలకు ఈడీ నోటీసులు

**టీపీఎన్, న్యూఢిల్లీ :** టెక్ దిగ్గజాలు గూగుల్, మెటాకు ఈడీ నోటీసులు ఇచ్చింది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై దర్యాప్తు చేస్తున్న ఈడీ ఈ నెల 21న తమ ముందు హాజరు కావాలని ఆదేశిస్తూ సమన్లు జారీచేసింది. ఎంతోమంది సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న నేపథ్యంలో ఈడీ రంగంలోకి దిగడం ప్రాధాన్యం సంతరించుకుంది. మనీలాండరింగ్, హవాలా వంటి తీవ్రమైన ఆర్థిక నేరాలపై దర్యాప్తు జరుగుతున్న వేళ గూగుల్, మెటా రెండూ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నట్టు ఈడీ ఆరోపించింది. ఈ రెండు కంపెనీలు వెబ్‌సైట్లలో బెటింగ్ యాప్‌లకు సంబంధించిన ప్రకటనలు ప్రదర్శిస్తున్నాయని పేర్కొంది. ఇది అక్రమ కార్యకలాపాల విస్తృతికి దోహదం చేస్తోందని ఆరోపించింది. పలువురు హై ప్రొఫైల్ సెలబ్రిటీలు కూడా ఈ అక్రమ బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.



## ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ మౌనం వీడాలి : జైరాం రమేష్

**టీపీఎన్, న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ మౌనం వీడి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్. భారత్ పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని ఆపానని, భారత్ పాకిస్థాన్ అమెరికాతో వాణిజ్యం కోరుకుంటే యుద్ధం ఆగిపోవాలని ట్రంప్ అన్నారని చెప్పారు. ఇప్పుడు ఐదు యుద్ధ విమానాలు కూలిపోయాయని ట్రంప్ కొత్తగా చెబుతున్నారని అన్నారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయని.. ట్రంప్ వ్యాఖ్యలపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ మౌనం వీడాలని కోరారు ఎంపీ జైరాం రమేష్.



## కర్నాటక డిప్యూటీ సీఎంకు తప్పిన ప్రమాదం

**టీపీఎన్, బెంగళూరు :** కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మాండ్యా జిల్లాలో ఆయన కాన్వాయ్‌లోని ఒక వాహనం బోల్తాపడటంతో డ్రైవర్‌తో సహా ఐదుగురు ఎస్కార్ట్ సిబ్బంది గాయపడ్డారు. శ్రీరంగపట్న ప్రాంతంలోని ఎక్స్‌ప్రెస్‌వేపై గౌడహల్లి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఎస్కార్ట్ వాహనం డివైడర్‌ను ఢీకొట్టి తల్లకిందులైంది. క్షతగాత్రులను మైసూరులోని ఆసుపత్రికి తరలించారు. వారికి తగిన వైద్య చికిత్స అందేలా చూడాలని అధికారులను డీకే శివకుమార్ ఆదేశించారు. ఎస్పీ మల్లికార్జున్ బలదండి స్వయంగా ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రుల పరిస్థితిని తెలుసుకున్నారు.

## పామును చేత్తో పట్టుకున్న రియల్ హీరో



**టీపీఎన్, ముంబై :** బాలీవుడ్ నటుడు సోనూ సూద్ మరోసారి రియల్ లైఫ్ హీరోగా నిలిచాడు. ముంబైలో తాను నివసించే సోసైటీలోకి అనుకోకుండా పాము ప్రవేశించింది. అక్కడ ఉన్నవారు పామును చూసి భయపడగా, పామును గుర్తించిన సోనూసూద్ వెంటనే దానిని జాగ్రత్తగా పట్టుకుని ఓ సంచిలో బంధించారు. ఇకపై దానిని దగ్గరలోని ఆటవీ ప్రాంతంలో వదిలేసి రావాలని తన వద్ద పనిచేసే యువకులకు పురమాయించారు. మీ ఇండ్లలోకి కూడా ఇలానే పాములు వస్తే జాగ్రత్తగా ఉండాలని, వాటిని ఏమీ చెయొద్దని, స్నేక్ క్యాచర్స్ పిలిపించి పట్టించాలని, వాటికి ఎలాంటి హానీ తలపెట్టవద్దని హతవు తెలిపారు.అది ర్యాట్ స్నేక్ (జెర్రిపోతు) అని అది విషపూరితమైనది కాదని సోనూ సూద్ స్పష్టం చేశారు. అదే సమయంలో పాముల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నెటిజన్లు సోనూ సూద్ ధైర్యాన్ని, జంతువులపై చూపిన ప్రేమను ప్రశంసిస్తున్నారు. రియల్ హీరో, హ్యూమానిటీకి సింబల్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# బీ2 బాంబర్ తయారీలో నిమగ్నమైన భారత్..!



**టీపీఎన్, న్యూఢిల్లీ :**
బీ 2 బాంబర్.. గత కొద్దిరోజులుగా ఈ పేరు మార్మోగిపోతున్నది. ఇరాన్ అణుశుద్ధి కేంద్రాలను అమెరికాకు చెందిన ఈ బాంబర్లే నేలమట్టం చేయడంతో ప్రపంచం మొత్తం వీటి శక్తిసామర్థ్యాల గురించే మాట్లాడుకున్నది. అయితే, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. భారత్ గతకొంతకాలంగా ఈ తరహా యుద్ధవిమానాలపై కసరత్తులు చేస్తున్నది. దీనికి ఇప్పటికైతే అల్ట్రా లాంగ్‌రేంజ్ స్ట్రైక్ ఎయిర్‌క్రాఫ్ట్ (ULRA) అని పేరుపెట్టారు. భవిష్యత్తులో కొత్త పేరు పెడతారో చూడాలి. ఈ విమానానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఇందులో ముఖ్యమైనది ఈ విమానం ఏకబిగిన 12వేల కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఇందులో 12 టన్నుల బాంబులను మోసుకెళ్లగలదు. ఇందులో అన్నింటికంటే ప్రత్యేకమైన అంశం.. ఈ విమానాన్ని శత్రు రాడార్లు కనిపెట్టడం దాదాపు అసాధ్యం. ఎందుకంటే ఇందులో వినియోగిస్తున్న టెక్నాలజీ అంత క్లిష్టమైనది. రష్యా బాంబర్ Tu160 బ్లాక్‌జాక్, అమెరికా B21 రైడర్ మోడళ్లను స్ఫూర్తిగా తీసుకుని దీని డిజైన్ రూపొందించారు. ఇందులో ఏయే పార్ట్స్ వాడాలి? ఆకారం ఎలా ఉండాలన్నది ఖరారైంది. 202335కల్లా ఈ తరహా తొలి విమానం వైమానిక దళానికి అందవచ్చు.

టెక్నాలజీఇది పూర్తిగా స్టెల్త్ విమానం. అంటే దీనిని గుర్తించేలోపే ఎంతో వేగంగా వెళ్లిపోతుంది. రాడార్ నుంచి తప్పించుకునే ప్రత్యేక వ్యవస్థలు ఇందులో ఉంటాయి. ఈ విమానాన్ని ప్రత్యేక ఆకారంలో తయారు చేయనున్నారు. సాధారణంగా ప్రతి రాడార్ సెకండ్ల వ్యవధిలో వేలాది తరంగాలను పంపిస్తుంటుంది. వాటికి ఏమైనా అడ్డు తగిలినప్పుడు దాని ఆకారాన్ని రాడార్లు గుర్తిస్తాయి. అయితే, ఈ విమానం తరంగాలను పూర్తిగా అడ్డుకోకుండా వాటిని వేరే దిశలో పంపేలా నిర్మాణం ఉంటుంది. దీనివల్ల తరంగాలను అడ్డుకోలేకపోతే రాడార్లు గుర్తించే అవకాశం దాదాపుగా ఉండదు. పైగా శత్రువుల ఆయుధాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పైలట్‌కు అందించే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఈ విమానంలో ఉంటుంది. దీని వల్ల పైలట్ కచ్చితమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. మానవ తప్పిదాలు 99శాతం నివారించవచ్చు. ఫ్రాన్స్ నుంచి ఏవియానిక్స్, స్టెల్త్ టెక్నాలజీ సరఫరా సంబంధించిన ఒప్పందాలు కూడా పూర్తికావడంతో ఈ విమానంలో అవి కీలకపాత్ర పోషిస్తాయి. వీటితోపాటు AIఆధారిత నావిగేషన్, టార్గెటింగ్ సిస్టమ్స్, ఖచ్చితమైన దాడులకు అవకాశం ఏర్పడుతుంది. ఇప్పటికైతే ఇంజన్ ఎంపిక ఖరారు కాలేదు. రష్యన్ NK32 (245 కిలో న్యూటన్స్ (థ్రస్ట్) లేదా జనరల్ ఎలక్ట్రిక్ GE414 యొక్క సవరించిన వెర్షన్ తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఈ విమానంలో బ్రహ్మోస్‌ఎన్‌జీ సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైల్స్, అగ్ని1P న్యూక్లియర్ బాలిస్టిక్ మిస్సైల్స్, లేజర్‌గైడెడ్ బాంబులు, యాంటీరేడియేషన్ మిస్సైల్స్ సహా అధునాతన ఆయుధాలను కూడా చేర్చనున్నారు.

**12వేల కిలోమీటర్లు నాన్‌స్టాప్**

భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (DRDO), హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (HAL), మరియు ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ADA) ఈ ప్రాజెక్టులో భాగమయ్యాయి. ఈ విమానం భారతదేశ రక్షణ వ్యూహాన్ని ప్రాంతీయ స్థాయి నుండి గ్లోబల్ స్థాయికి పెంచుతుంది. న్యూక్లియర్ సెకండ్‌స్ట్రైక్ సామర్థ్యాన్ని మరియు గ్లోబల్ పవర్ ప్రొజెక్షన్‌ను అందిస్తుంది. అంతేకాకుండా దేశ న్యూక్లియర్ ట్రైడ్‌ను (భూమి, సముద్రం, గగనం) పూర్తి చేస్తుంది, చైనా H20 స్టెల్త్ బాంబర్, అమెరికా B21 రైడర్‌తో పోటీపడుతుంది. ఈ విమానాల రేంజ్ 12,000 కిలోమీటర్లు కావడంతో రీఫ్యూయలింగ్ లేకుండానే న్యూయార్క్, బీజింగ్, యూరప్, ఆఫ్రికా, ఆస్ట్రేలియా వంటి దూర ప్రాంతాలను కూడా సునాయాసంగా లక్ష్యంగా

## మరాఠీని అర్థం చేసుకోండి లేదా చెంపదెబ్బ కొట్టండి'

- **స్థానికేతరులకు రాజ్ థాకరే హెచ్చరిక**




**టీపీఎన్, ముంబై :** మహారాష్ట్రలో మరాఠీ మాట్లాడటంపై వివాదం ఇప్పట్లో తగ్గే అవకాశం లేదు, ఎందుకంటే మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ థాకరే రాష్ట్రంలోని స్థానికేతరులకు కొత్త హెచ్చరిక జారీ చేశారు. ముంబైలోని మీరా భయాందర్‌లో జరిగిన ర్యాలీలో ప్రసంగించిన ఠాక్రే, ఎవరైనా మరాఠీ అర్థం చేసుకోకపోతే, వారికి గట్టి దెబ్బ పడుతుందని హెచ్చరించారు. ఇప్పుడు, మీరు మరాఠీని నేరుగా మీ చెవిలో చెప్పినా అర్థం చేసుకోలేకపోతే, మీకు కిందే ఒక చెంపదెబ్బ తగులుతుంది. ప్రజలు ఎటువంటి కారణం లేకుండా గొడవ సృష్టిస్తారు" అని థాకరే ముంబైలోని మీరాభయందర్‌లో జరిగిన ర్యాలీలో ప్రసంగిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక దుకాణదారుడిపై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ స్థానిక వ్యాపారులు నిరసన తెలిపిన సంఘటనను ప్రస్తావిస్తూ, ఠాక్రే ఇలా అన్నారు, "ఆ వ్యక్తికి ఏమైనా జరిగిందంటే అది అతని వైఖరి వల్లే జరిగింది. ఇతర వ్యాపారులు బంద్‌కు పిలుపునిచ్చారు. కానీ ఎవరైనా ఒత్తిడితో తమ దుకాణాన్ని మూసివేస్తే, దీన్ని అర్థం చేసుకోండి: మీరు మీ దుకాణాన్ని ఎంతకాలం మూసివేస్తారు? మేము కొనడం మానేస్తే, అప్పుడు ఏమిటి పరిస్థితి అనినారు. స్థానికేతరులందరూ ఇక్కడికి వచ్చారు, నిశ్శబ్దంగా ఉండండి .. మీ పని చేసుకోండి. కానీ మీరు ఇక్కడ మూర్ఖంగా తిరుగుతుంటే, చెంపదెబ్బ ఖాయం అని బెదరించారు.

# మోదీకి బీజేపీ అవసరం లేదు.. బీజేపీ మనుగడకే మోదీ అవసరం



**టీపీఎన్, న్యూఢిల్లీ :**
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బలం లేకుండా 2029 లోక్‌సభ ఎన్నికల్లో 150 సీట్లు కూడా గెలవలేరని బిజెపి ఎంపి నిషికాంత్ దూబె అన్నారు. 75 ఏళ్లు నిండిన తర్వాత నాయకులు పార్టీ నుంచి తప్పుకోవాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన ప్రకటన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాబోయే రెండు దశాబ్దాల పాటు మోడీ ఎక్కడికీ వెళ్లరని దుబే అన్నారు. పార్టీకి వేరే మార్గం లేనందున ప్రధాని మోడీ రాబోయే 15 20 సంవత్సరాలు పార్టీని నడిపిస్తారు. బిజెపి బలం మోడీ తప్ప మరొక మార్గం కాదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీకి భారతీయ జనతా పార్టీ అవసరం లేదని.. ఆయన ప్రపంచ ఖ్యాతి సాధించారని బీజేపీకే మోదీ అవసరం ఉందన్నారు. 75 ఏళ్ల శాలువా మన మీద కప్పారంటే, మనం ఒక నిర్దిష్ట వయస్సుకు చేరుకున్నామని అర్థం అన్నారు. అప్పుడు మనం కాస్త పక్కకు జరిగి, వేరే వాళ్లకు పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలని తెలిపారు. అయితే ఆయన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపాయి. దీంతో కాంగ్రెస్ ప్రధాని మోదీపై విమర్శలు చేసింది. మోదీకి ఈ ఏడాది 75 ఏళ్లు నిండనున్నాయని.. మోదీని ఉద్దేశించే భగవత్ ఈ వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ ఆరోపించింది. అయితే ప్రధాని మోదీ, భగవత్ ఇద్దరికీ సెప్టెంబర్ లో 75 ఏళ్లు నిండుతాయి. ఆదిత్యనాథ్ కు పెరుగుతున్న ప్రజాదరణ, మోడీ వారసుడిగా ఆయనను కొన్ని వర్గాలు ముందుకు తెస్తున్న తీరు గురించి మాట్లాడుతూ.. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆదిత్యనాథ్ పేరుపై ఓటు వేయలేదని, పార్టీ విజయం సాధించిన తర్వాత బీజేపీ తొలిసారిగా ఆయనను ముఖ్యమంత్రిగా ఎన్నుకుందని దూబే గతంలో ఒక ఇంటర్వ్యూలో అన్నారు.




## ఐదు విమానాలు కూలిపోయాయన్న ట్రంప్

**టీపీఎన్, న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ గురించి ట్రంప్ చేసిన కామెంట్స్ మరోసారి చర్చనీయాంశంగా మారాయి. ఇండియాపాక్ యుద్ధంలో 5 ఫైటర్ జెట్లు కూలిపోయినట్లు ట్రంప్ చెప్పారు. రిపబ్లికన్ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన డిన్నర్ సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే కూలిన జెట్ విమానాలు ఎవరివనే విషయాన్ని చెప్పడానికి మాత్రం నిరాకరించారు. యుద్ధవాతావరణంలో నాలుగు లేదా ఐదు విమానాలు గాల్లోనే పేలిపోయాయని.. కూలిపోయాయని ట్రంప్ చెప్పారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడిలో భారత పౌరులు 26 మంది చనిపోయారు. ఈ దాడి తర్వాత భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాకిస్తాన్ లో 9 టెర్రరిస్ట్ క్యాంపులతో పాటు ఆర్మీ బేస్ క్యాంపులను, రన్ వేలను కూల్చేసింది ఇండియన్ ఆర్మీ. అదేవిధంగా కొన్ని ఫైటర్ జెట్లను కూడా ధ్వంసం చేసింది. ఈ వివరాలన్నింటినీ ఇండియా అధికారికంగా ప్రకటించింది.ఈ యుద్ధంలో తమ వైమానిక దళం భారత జెట్‌లను కూల్చివేసిందని, వాటిలో మూడు ఫ్రెంచ్ నిర్మిత రాఫెల్ యుద్ధ విమానాలు కూడా ఉన్నాయని, భారత పైలట్లను తాము బంధించామని పాకిస్తాన్ నిరంతరం వాదిస్తోంది. ఈ వాదనలను నిరూపించడానికి ఇస్లామాబాద్ ఎటువంటి ఆధారాలను అందించలేదు. దీనికి విరుద్ధంగా, భారతదేశం తన నష్టాలను వివరించడంలో ఎక్కువగా దూరంగా ఉంది. అయితే, కాల్పుల విరమణ తర్వాత కొన్ని వారాలలో, భారత వైమానిక దళం (IAF) విమానాలను కోల్పోయిందని భారత రక్షణ సిబ్బంది చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ అంగీకరించారు. కానీ ఆరు భారతీయ జెట్‌లు ధ్వంసమయ్యాయనే పాకిస్తాన్ కథనాన్ని తోసిపుచ్చారు. 300 కిలోమీటర్ల లక్ష్యాన్ని ఖచ్చితత్వంతో దాడులు చేశామని తెలిపారు. జూన్ 15న ఫ్రెంచ్ రాఫెల్ తయారీదారు డస్సాల్ట్ ఏవియేషన్ ఛైర్మన్ CEO ఎరిక్ ట్రాపియర్ పాకిస్తాన్ వాదనలను ఖండించారు.

# నేను అలాంటి లేఖ పంపలేదు

- **వాల్ స్ట్రీట్ జర్నల్ పై 10 బిలియన్ల దావా**




**టీపీఎన్, అమెరికా :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో వివాదంలో ఇరుక్కున్నారు. సెక్స్ కుంభకోణంలో నిందితుడైన జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్ కు సంబంధాలు ఉన్నట్టు ఇటీవల ప్రచారం జరిగింది. ఆ దేశానికి చెందిన వాల్ స్ట్రీట్ జర్నల్ పత్రిక తాజాగా ఓ కథనాన్ని రాసింది. ఫైనాన్షియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌కు సంబంధాలు ఉన్నాయని, గతంలో ట్రంప్ అతనికి ఓ శృంగారత్మ లేఖను రాసినట్లు ఆ కథనంలో పత్రిక పేర్కొన్నది. అయితే ఆ లేఖా కథనాన్ని తప్పుపట్టని ట్రంప్.. ఆ పత్రికపై చర్యలకు దిగారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెదిరించారు. వాల్ స్ట్రీట్ జర్నల్ పేరెంట్ కంపెనీ డౌ జోన్స్‌తో పాటు దాని ఓనర్ రూపర్ట్ ముర్డోక్ పై పరువునష్టం దావా వేశారు.

**10 బిలియన్ డాలర్ల పరువునష్టం**

దాదాపు 10 బిలియన్ డాలర్ల పరువునష్టం కేసును ట్రంప్ ఫైల్ చేసినట్లు తెలుస్తోంది. 2003లో ఎప్‌స్టీన్ 50వ బర్త్‌డే సందర్భంగా ట్రంప్ ఆ లేఖ రాసినట్లు ఆ కథనంలో తెలిపారు. దాంట్లో ట్రంప్ సంతకం కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. కానీ ఆ లేఖ అవాస్తవమని ట్రంప్ వెల్లడించారు. ఆ లేఖలో ఉన్న భాష, పదాలు తాను వాడేవి కాదన్నారు. వాల్ స్ట్రీట్ జర్నల్‌పై కేసు వేస్తున్నట్లు ట్రంప్ తెలిపారు.జెఫ్రీ ఎప్‌స్టీన్‌పై అమెరికాలో చైల్డ్ సెక్స్ ట్రాఫికింగ్ కేసు నమోదు అయ్యింది. సెక్స్ క్రైంలో దోషిగా తేలిన అతన్ని జైలులో వేశారు. అయితే మన్‌హట్టన్ జైలులో శిక్ష అనుభవిస్తున్న అతను 2019లో ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. ఎప్‌స్టీన్ కు సంబంధించిన అన్ని అంశాలు బహిర్గతం చేయాలని ఇటీవల అమెరికా న్యాయ శాఖ ఆదేశాలు ఇవ్వడంతో తాజా వివాదం మళ్లీ రాజుకున్నది.
మరోవైపు, ట్రంప్‌కు సన్నిహిత నాయకులు కూడా వాల్ స్ట్రీట్ జర్నల్ పత్రిక స్టోరీ నకిలీ అని అన్నారు. ఉపాధ్యక్షుడు JD వాన్స్ మాట్లాడుతూ ఇది పూర్తి అర్ధంలేనిదని కొట్టిపారేశారు. అదే సమయంలో, ఎప్స్టీన్ కేసుల్లో ట్రంప్ దోషి అయితే, డెమొక్రాట్లు ఈపాటికి దానిని ఉపయోగించుకుని ఉండేవారని కాంగ్రెస్ మహిళ మార్జోరీ టేలర్ గ్రీన్ అన్నారు.
ఎప్‌స్టీన్ కేసులకు సంబంధించిన అన్ని పత్రాలు , సాక్ష్యాలను బహిర్గతం చేయడానికి అటార్నీ జనరల్ పామ్ బోండి కోర్టు నుండి అనుమతి తీసుకోవాలని ట్రంప్ డిమాండ్ చేశారు, తద్వారా నిజం బయటకు వస్తుందన్నారు. మైనర్ బాలికలను అక్రమంగా రవాణా చేశాడనే ఆరోపణలపై 2019లో ఎప్‌స్టీన్ అరెస్ట్ అయ్యాడు.




## హెచ్‌ఆర్ మేనేజర్ తో రొమాన్స్ ..సీఈవోపై వేటు

**టీపీఎన్, అమెరికా :** అమెరికాకు చెందిన ఆస్ట్రోనామర్ కంపెనీ సీఈవో ఆండీ బైరన్‌పై వేటు పడింది. ఆ కంపెనీ అతన్ని సస్పెండ్ చేసింది. తాజాగా జరిగిన కోల్డ్‌ప్లే కన్సర్ట్ ప్రోగ్రామ్‌లో సీఈవో ఆండీ బైరన్.. ఆ కంపెనీకి చెందిన హెచ్‌ఆర్ మేనేజర్‌తో రొమాన్స్ చేస్తూ కనిపించాడు. ఈ ఘటనకు చెందిన వీడియో వైరల్ కావడంతో ఆ కంపెనీ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నది. బోస్టన్‌లో జరుగుతున్న మ్యూజిక్ షో సమయంలో... ఆస్రోనామర్ కంపెనీకి చెందిన సీనియర్ ఉద్యోగులు ఫుల్ రొమాన్స్ మూడ్‌లో ఉన్నారు.
కంపెనీలో చీఫ్ పీపుల్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న క్రిస్టిన్ కాబట్‌ను గట్టిగా హత్తుకుని సీఈవో ఆండీ బైరన్ డ్యాన్స్ చేశాడు. ఆ ఇద్దరూ తన్మయత్వంతో ఊగిపోయారు. అయితే కన్సర్ట్ షోకు చెందిన లైట్లు వాళ్లపై ఫోకస్ చేయగానే ఆ జంట సడెన్‌గా విడిపోయారు. ఒకరి నుంచి ఒకరు దూరం వెళ్లే ప్రయత్నం చేశారు. సీఈవో బైరన్ కిందకు వంగాడు. దీంతో ఆ మ్యూజిక్ షోలో పాట పాడుతున్న గాయకుడు ఆ ఇద్దరి మధ్య అఫైర్ ఉన్నట్లు తెలుస్తోందన్నాడు.ఈ ఘటనకు చెందిన వీడియో వైరల్ కావడంతో గత రెండు రోజుల నుంచి ఇంటర్నెట్‌లో టాపిక్ ట్రెండ్ అవుతున్నది. ఘటన గురించి తెలుసుకున్న కంపెనీ.. ఆ ఇద్దరు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నది. సీఈవో ఆండీ బైరన్‌ను సస్పెండ్ చేస్తూ లీవ్



## ఇరాన్‌లో బస్సు బోల్తా, 15 మంది మృతి

**టీపీఎన్, ఇరాన్ :** ఇరాన్ దేశ దక్షిణ ప్రాంతంలో బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దాదాపు 15 మంది మరణించారని ఆ దేశ అధికారులు తెలిపారు. 27 మంది గాయపడ్డారని ఫార్స్ ప్రావిన్స్ అత్యవసర సంస్థ అధిపతి మసౌద్ అబెద్ తెలిపారు. ప్రావిన్స్ రాజధాని షిరాజ్ నగరంలో ఈ ప్రమాదం జరిగింది. ఇరాన్ రోడ్డు ప్రమాదాల్లో ప్రపంచ వ్యాప్తంగా అగ్రస్థానంలో ఉంది. ఏటా దాదాపు 17,000 మంది మరణిస్తున్నారు. ఇరుకు రోడ్లు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

# ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు

- **కీవ్‌పై 300కు పైగా డ్రోన్లు, 30 క్షిపణులతో ఎటాక్**



**టీపీఎన్, కీవ్ :** ఉక్రెయిన్‌పై రష్యా మెరుపు దాడులు చేస్తోంది. కీవ్‌పై 300కు పైగా డ్రోన్లు, 30 క్షిపణులతో రష్యా దాడి చేసినట్లు ఉక్రెయిన్ అధికారులు తెలిపారు.. ఈ దాడిలో అనేక నివాస భవనాలు, ఆసుపత్రులు, వాహనాలు ధ్వంసమైనట్లు పేర్కొన్నారు. భవనాల శిథిలాల కింద అనేకమంది ప్రజలు చిక్కుకున్నారని, వారిని బయటకు తీసుకురావడానికి భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపడుతున్నాయన్నారు. ఈ దాడుల్లో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఒడెసా నగరంపై 20కి పైగా డ్రోన్లు, పదుల సంఖ్యలో క్షిపణులు ప్రయోగించడంతో ఒకరు ప్రాణాలు కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారని వెల్లడించారు. భారీ ఆస్తి నష్టం సంభవించిందని, ఈశాన్య సుమీ ప్రాంతంలో కీలకమైన మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని తెలిపారు. యుద్ధం సమయంలో తమకు అండగా ఉంటూ ఆయుధాలను సరఫరా చేస్తున్న మిత్ర పక్షాలకు కృతజ్ఞతలు తెలిపారు.
ఉక్రెయిన్‌కు ఆస్ట్రేలియా కూడా ఆయుధ సరఫరా చేస్తోంది. ఇందులో భాగంగా కీవ్‌కు ఎం1ఏ1 అబ్రమ్స్ ట్యాంకులను అందజేసింది. ఇతర సామగ్రిని రాబోయే నెలల్లో పంపించనున్నట్లు ఆస్ట్రేలియా రక్షణ మంత్రి రిచర్డ్ మార్లెస్ పేర్కొన్నారు. కీవ్‌పై మాస్కో దండయాత్రకు వ్యతిరేకంగా ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు ఆస్ట్రేలియా తెలిపింది.




## రాజద్రోహ కుట్ర'పై ఒబామాపై విచారణ జరపాల్సిందే


**టీపీఎన్, అమెరికా :** అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాపై తీవ్ర ఆరోపణలు చేశారు అమెరికా జాతీయ నిఘా డైరెక్టర్ తులసి గబ్బర్డ్. 2016 అధ్యక్ష ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్ విజయాన్ని అడ్డుకోవడానికి ఒబామా , ఆయన పరిపాలనలోని పలువురు ఉన్నతాధికారులు ప్రయత్నించారని..దీన్ని రాజద్రోహ కుట్రగా భావించాల్సి ఉంటుందన్నారు. ఒబామా సీనియర్ జాతీయ భద్రతా బృందం 2016లో రష్యా జోక్యానికి సంబంధించిన నిఘా అంచనాలను ఉద్దేశపూర్వకంగా "తయారు చేసి" రాజకీయం చేసిందన్నారు. ఈ ప్రయత్నాలు అధ్యక్షుడు ట్రంప్‌ను అప్రతిష్టపాలు చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు.



## ఇజ్రాయెల్, సిరియా మధ్య సీజ్ ఫైర్..!

**టీపీఎన్, తుర్కియే :** ఇజ్రాయెల్, సిరియా కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఇరు దేశాలు సీజ్ ఫైర్ కు ఒప్పుకున్నాయని తుర్కియేలోని అమెరికా రాయబారి టామ్ బరాక్ శనివారం ప్రకటించారు. తుర్కియే, జోర్డాన్ సహా పొరుగు దేశాలు ఈ కాల్పుల విరమణకు మద్దతు ఇచ్చాయని తెలిపారు. 'డ్రూజ్, బెడౌయిన్, సున్నీలు తమ ఆయుధాలను విడిచిపెట్టి. ఇతర మైనారిటీలతో చేరాలి. వారితో కలిసిపోయి కొత్త, ఐక్యమైన సిరియన్ గుర్తింపును నిర్మించడానికి దోహదపడాలి' అని తెలిపారు. దక్షిణ సిరియాలోని స్వీడా ప్రావిన్స్ లో డ్రూజ్ మిలీషియాలు, సున్నీ బెడౌయిన్ తెగల మధ్య తీవ్రమైన మత హింస తర్వాత కాల్పుల విరమణ జరగడం గమనార్హం.
అయితే సీజ్ ఫైర్ ఎంతకాలం కొనసాగుతుందనే దానిపై స్పష్టత ఇవ్వలేదు. అంతేగాక కాల్పుల విరమణకు సంబంధించి ఇజ్రాయెల్, సిరియాలు అధికారికంగా స్పందించలేదు. కాగా, సిరియాలోని స్వీడా ప్రావిన్స్ లో సిరియన్ దళాలు, డ్రూజ్ మైనారిటీ కమ్యూనిటీ మధ్య జరిగిన హింస తర్వాత ఇజ్రాయెల్ సిరియాపై దాడి చేసిన విషయం తెలిసిందే.

## రూ. 260 కోట్లు పలికిన డైనోసార్ శిలాజాలం



**టీపీఎన్, న్యూయార్క్ :**
నగరంలో ఒక పురాతన డైనోసార్ శిలాజాన్ని వేలం వేయగా అది 30.5 మిలియన్ డాలర్లకు అమ్ముడుపోయింది. భారతీయ కరెన్సీలో దీని విలువ సుమారు రూ. 263 కోట్లు. సోథ్ బీ సంస్థ ఇటీవల నిర్వహించిన అరుదైన వస్తువుల వేలంలో ఈ డైనోసార్ శిలాజం కూడా ఉంది. దీనికి వేలం నిర్వహించగా ఊహించని రీతిలో భారీ ధర పలికింది. ప్రపంచంలోనే అత్యంత విలువైన డైనోసార్ అస్థిపంజరాలలో ఇది మూడవదిగా నిలిచింది. గతేడాది జులైలో జరిగిన వేలంలో అపెక్స్ అనే డైనోసార్ శిలాజం 44.6 మిలియన్ డాలర్లకు అమ్ముడుపోయింది. ఇది భారతీయ కరెన్సీలో సుమారు రూ. 380 కోట్లు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ డైనోసార్ శిలాజాన్ని ఎవరు కొనుగోలు చేశారో వేలం నిర్వాహకులు వెల్లడించలేదు. ఇది దాదాపు 150 మిలియన్ సంవత్సరాల క్రితం నాటిదని వారు తెలిపారు.

## బరువు తగ్గేందుకు కిమ్ ప్రయత్నాలు



**టీపీఎన్, నార్త్ కొరియా :** ఉత్తరకొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ బరువు తగ్గే ప్రయత్నం చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బరువు తగ్గే మందుల అన్వేషణలో పడిపోయారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ముందుగా తనలాంటి బరువు ఉన్న పౌరులపై ప్రయోగించిన తర్వాతనే ఆయన వాడతారట. కిమ్ మద్యానికి, సిటరెట్లకు బానిసైనట్లు గతంలో అమెరికాకు చెందిన ఓ పత్రిక పేర్కొంది. దీంతో ఆయన నిద్రలేమి సమస్యలతో బాధపడుతున్నట్టు తెలిపింది. కిమ్ 140 కేజీల వరకు బరువు పెరిగి ఉండొచ్చని పేర్కొంది.

# బ్రిక్స్ దేశాలకు ట్రంప్ వార్నింగ్..!

**టీపీఎన్, వైట్‌హౌస్ :** వాణిజ్య సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) కఠిన వైఖరి అవలంబిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్రిక్స్ (BRICS) కూటమిపై మరోసారి విమర్శలు గుప్పించారు. బ్రిక్స్‌ను ఒక చిన్న గ్రూప్‌గా అభివర్ణించిన ట్రంప్, తమ దేశ డాలర్ ఆధిపత్యాన్ని సవాల్ చేయాలనుకుంటే ఆ దేశాలు 10 శాతం అదనపు సుంకాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. క్రిప్టో కరెన్సీ చట్టబద్ధతకు సంబంధించిన 'జీనియస్' బిల్లుపై సంతకం చేసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.
ట్రంప్ మాట్లాడుతూ.. 'బ్రిక్స్ అనే ఓ చిన్న గ్రూప్ ఉంది. వారు డాలర్ ఆధిపత్యాన్ని కట్టడి చేయాలని ప్రయత్నిస్తున్నారు. మా కరెన్సీ విలువను తగ్గించాలని చూస్తున్నారు. అందుకే మేము వారిపై టారిఫ్‌లను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాం. అది వేగంగా తన ప్రభావాన్ని కోల్పోతోంది. మేము వారిపై బలంగా చర్యలు తీసుకున్నాం' అని అన్నారు. అంతేకాకుండా, అమెరికా డాలర్‌కి ఉన్న గ్లోబల్ రిజర్వ్ కరెన్సీ హోదాను కాపాడతామని, దాని విలువ తగ్గితే దాన్ని ఓటమిగా భావిస్తామని స్పష్టం చేశారు.
కాగా, బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలతో ఏర్పడిన బ్రిక్స్ కూటమిలో ఇటీవల ఇరాన్, ఈజిప్ట్, ఇథియోపియా, యూఏఈ, ఇండోనేసియా దేశాలు కూడా చేరాయి. వీటిని కలిపి బ్రిక్స్ ప్లస్‌గా పిలుస్తున్నారు. అయితే, ఇటీవల జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో అమెరికా వాణిజ్య విధానాలపై ఆ దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అమెరికా వ్యతిరేక వైఖరి కలిగిన దేశాలపై అదనపు 10% సుంకాలు విధిస్తామని, బ్రిక్స్ దేశాలపై టారిఫ్‌లు అమలు చేస్తామని స్పష్టం చేశారు.



# YES బ్యాంక్ Q1 రిజల్టు.. 59% పెరిగిన నికర లాభం




**టీపీఎన్, ముంబై :**
ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో యెస్ బ్యాంకు బలమైన ఆర్థిక పనితీరును కనబరిచింది. నికర లాభం 59% పెరిగి రూ. 801 కోట్లకు చేరింది. వడ్డీయేతర ఆదాయంలో 46.1% వృద్ధి, స్థిరమైన అసెట్ క్వాలిటీ, డిపాజిట్లలో 4.1% పెరుగుదలతో బ్యాంక్ గణనీయమైన పురోగతి సాధించింది. సుమిటోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ ఒప్పందం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని మరింత పెంచింది.

యెస్ బ్యాంకు నికర లాభం 59.4% పెరిగి రూ. 801 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఇది రూ. 502 కోట్లే. రీస్ట్రక్చరింగ్ తర్వాత సంస్థకు ఇదే అత్యుత్తమ త్రైమాసికం కావడం గమనార్హం. నికర వడ్డీ ఆదాయం (NII) 5.7% పెరిగి రూ. 2,371 కోట్లకు చేరింది. స్థూల వడ్డీ ఆదాయం 1.6% తగ్గి రూ. 7,596 కోట్లకు చేరింది.

బ్యాంకు వడ్డీయేతర ఆదాయం (నాన్ఇంటరెస్ట్ ఇన్‌కమ్) 46.1% పెరిగి రూ. 1,752 కోట్లకు చేరింది. ఇందులో ట్రెజరీ ఆదాయం ప్రధాన పాత్ర పోషించింది. గ్రాస్ నాన్‌పెర్ఫార్మింగ్ ఆస్తుల (GNPA) నిష్పత్తి 1.6% వద్ద స్థిరంగా ఉండగా, నికర NPA నిష్పత్తి 0.3%కు తగ్గింది. ప్రొవిజన్స్ రూ. 284 కోట్లకు చేరాయి. గత త్రైమాసికంతో పోలిస్తే తగ్గినప్పటికీ వార్షిక ప్రాతిపదికన పోలిస్తే 34% పెరిగాయి.

ఇక నికర రుణాలు 5% పెరిగి రూ. 2.41 లక్షల కోట్లకు చేరగా, కమర్షియల్ బ్యాంకింగ్ 19%, మైక్రో బ్యాంకింగ్ 11.2% వృద్ధి చెందాయి. రిటైల్ రుణాలు కేవలం 0.3% పెరిగాయి. మొత్తం డిపాజిట్లు 4.1% పెరిగి రూ. 2.76 లక్షల కోట్లకు చేరాయి. రిటైల్, బ్రాంచ్ బ్యాంకింగ్ 20% వృద్ధిని నమోదు చేసింది. CASA నిష్పత్తి 32.8%కు మెరుగైంది. "బహుముఖ వృద్ధి, స్థిరమైన అసెట్ క్వాలిటీ, బలమైన CET1 నిష్పత్తితో బ్యాంక్ ఆర్థిక సంవత్సరాన్ని బలంగా ప్రారంభించింది" అని MD, CEO ప్రశాంత్ కుమార్ అన్నారు.

TEPA

# అక్టోబర్ 1 నుంచి TEPA అమలు

**టీపీఎన్, ముంబై :**
భారత్, యురోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (TEPA) ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి అమలులోకి వస్తుందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. EFTA సభ్య దేశాలైన ఐస్‌లాండ్, లీచెన్‌స్టీన్, నార్వే, స్విట్జర్లాండ్ ఈ ఒప్పందాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. ఇది భారత్‌లో $100 బిలియన్ల పెట్టుబడులు, 10 లక్షల ఉద్యోగాలను సృష్టించనుంది.

2024లో జరిగిన TEPAలో భాగంగా EFTA దేశాల 8085% వస్తువులపై భాతర్ సుంకాలను తగ్గిస్తుంది. స్విస్ వాచీలు, చాక్లెట్లు, డైమండ్స్ వంటివి తక్కువ సుంకాలతో దిగుమతి అవుతాయి. EFTA దేశాలు భారత బియ్యంతో సహా 99% వస్తువులకు సుంకం లేని మార్కెట్ యాక్సెస్‌ను అందిస్తాయి. ఈ ఒప్పందం ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్, స్పేస్ సెక్టార్‌లలో పెట్టుబడులను పెంచనుంది.

EFTA దేశాలు 15 ఏళ్లలో $100 బిలియన్లు పెట్టుబడి పెట్టేందుకు అంగీకరించాయి. మొదటి 10 ఏళ్లలో $50 బిలియన్లు, తర్వాతి 5 ఏళ్లలో మరో $50 బిలియన్లు పెడతాయి. వీటితో 10 లక్షల ఉద్యోగాల సృష్టి జరుగుతుందని అంచనా. 2025, జులై 10న స్విట్జర్లాండ్ రిఫరెండం ద్వారా ఈ ఒప్పందాన్ని ఆమోదించింది. ఇతర EFTA దేశాలూ ఆమోదించాయి.

RBL BANK

# 46% తగ్గిన ఆర్బీఎల్ బ్యాంకు ప్రాఫిట్

**టీపీఎన్, ముంబై :**
ఈ ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికంలో ఆర్బీఎల్ బ్యాంకు నికర లాభం 46% తగ్గి రూ. 200.33 కోట్లకు చేరింది. గత ఏడాది ఈ విలువ రూ. 371.52 కోట్లు కావడం గమనార్హం. నికర వడ్డీ ఆదాయం 13% తగ్గి రూ.1,481 కోట్లకు, నికర వడ్డీ మార్జిన్ 4.50%కి పడిపోయాయి. అధిక ప్రావిజన్స్ (రూ. 442 కోట్లు), ఆపరేటింగ్ ఖర్చులే (12% పెరిగి రూ. 1,847 కోట్లు) లాభం తగ్గడానికి కారణం. గ్రాస్ నాన్‌పెర్ఫార్మింగ్ ఆస్తుల (GNPA) నిష్పత్తి 2.78%కు, నికర NPA 0.45%కు చేరాయి. డిపాజిట్లు 11% పెరిగి రూ. 1.12 లక్షల కోట్లకు, అడ్వాన్స్‌లు 9% పెరిగి రూ. 94,431 కోట్లుగా నమోదయ్యాయి. మూడో త్రైమాసికం నుండి మార్జిన్‌లు మెరుగుపడతాయని బ్యాంకు సీఈవో ఆర్ సుబ్రమణ్యకుమార్ ధీమా వ్యక్తం చేశారు.

# $40 బిలియన్లు దాటిన ఎలక్ట్రానిక్ ఎగుమతులు



**టీపీఎన్, ముంబై :**
భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు గత 11 సంవత్సరాల్లో ఎనిమిది రెట్లు పెరిగి $40 బిలియన్ల మైలురాయిని అధిగమించాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. స్థానిక ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి సైతం ఆరు రెట్లు పెరిగిందని పేర్కొన్నారు. ఈ సంవత్సరమే తొలి 'మేడ్ ఇన్ ఇండియా' సెమీ కండక్టర్ చిప్ వాణిజ్య స్థాయిలో తయారవుతుందని ధీమా వ్యక్తం చేశారు. భారత బుల్లెట్ రైలు ప్రాజెక్టు 2027 ఆగస్టు లేదా సెప్టెంబరు నాటికి అందుబాటులోకి వస్తుందని ఐఐటీ హైదరాబాద్ 14వ స్నాతకోత్సవంలో వెల్లడించారు.

'గత దశాబ్దంలో భారత ఎలక్ట్రానిక్స్ రంగం గణనీయమైన పురోగతి సాధించింది. ఎగుమతులు $40 బిలియన్లకు చేరాయి. దేశీయ ఉత్పత్తి రూ. 11 లక్షల కోట్లకు పైగా పెరిగింది. ఈ రంగం 25 లక్షల ఉద్యోగాలను సృష్టించింది. ముఖ్యంగా మహిళలకు ఎక్కువగా అవకాశాలు లభించాయి. మేక్ ఇన్ ఇండియా విధానాలు, ప్రోత్సాహకాలు, రాష్ట్రాల సహకారం వల్లే ఈ ఘనత సాధ్యమైంది. తమిళనాడు వంటి రాష్ట్రాలు 36% ఎగుమతులతో ఇందుకు దోహదం చేశాయి' అని వైష్ణవ్ అన్నారు. సెమీకండక్టర్ రంగంలో ప్రపంచంలోని టాప్5 దేశాలలో భారత్ ఒకటిగా ఎదగగలదని వైష్ణవ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఆరు సెమీకండక్టర్ ప్లాంట్లు ఇప్పటికే నిర్మాణంలో ఉన్నాయన్నారు. రూ. 76,000 కోట్ల సెమీకండక్టర్ మిషన్, రూ. 23,000 కోట్ల కాంపోనెంట్స్ ఇన్సెంటివ్ ప్రోగ్రామ్ ఈ రంగంలో స్వయం సమృద్ధిని పెంచుతున్నాయని పేర్కొన్నారు. ఇండియా ఏఐ మిషన్ ద్వారా 10 లక్షల మందికి కృత్రిమ మేధలో శిక్షణ ఇస్తున్నామని, ఇది యువతకు సరికొత్త అవకాశాలను కల్పిస్తుందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో 3035% వాల్యూ యాడిషన్ సాధించే లక్ష్యంతో పనిచేస్తున్నామని వివరించారు. దక్షిణ కొరియా, తైవాన్‌ల స్థాయికి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

# భగ్గుమంటున్న బంగారం ధరలు.. మరోసారి లక్ష దాటిన గోల్డ్



**టీపీఎన్, ముంబై :**
మన ఇంట్లో ఏ చిన్న శుభకార్యం జరిగినా బంగారం కొనుగోలు చేస్తుంటాము. ఇక అందులోనూ మన దేశంలో గోల్డ్‌కి మరింత పాపులారిటీ ఎక్కువ. ఇక ఈ మధ్య కాలంలో బంగారం ధరల్లో హెచ్చు తగ్గులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గత రెండు రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం ధరలు గత రెండు రోజుల నుంచి పెరుగుతున్నాయి. ఈ క్రమంలో నేడు కూడా భారీగా పెరిగాయి. ఇక ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడలో నిన్న రూ.91,100 ఉన్న 22 క్యారెట్ల బంగారం ధర నేడు రూ.600 పెరిగి రూ.91,700గా ఉంది. అలాగే నిన్న రూ.99,380 ఉన్న 24 క్యారెట్ల బంగారం ధరపై నేడు రూ.660 పెరిగి రూ.1,00,040గా ఉంది. ఇక అటు వెండి ధర రూ.2,100 పెరిగి కిలో రూ.1,26,000గా ఉంది. కాగా దాదాపు రెండు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు ఇవే ఉన్నాయి.

## మదుపరులూ జాగ్రత్త!


**టీపీఎన్, ముంబై :**
దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా చలించే అవకాశముంది. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై స్పష్టత వచ్చేంత వరకు ఊగిసలాట తప్పకపోవచ్చు. మరోవైపు జియో పొలిటికల్ పరిణామాలూ కీలకంగా మారుతున్నాయి. నిఫ్టీ సైతం 25000 దిగువకు రావడం నెగటివ్ సెంటిమెంటును ప్రతిబింబిస్తోంది. ఇప్పటికే సూచీలు చాలా నష్టపోవడంతో ఏదేమైనా సానుకూల సంకేతాలు వస్తే బౌన్స్‌బ్యాక్ అవ్వొచ్చు. ఏదేమైనా మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది.

wipro

**స్టాక్ రికమెండేషన్స్**
విప్రో: ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి డౌన్‌ట్రెండులో పయనిస్తున్న ఈ షేర్లు ప్రస్తుతం కన్సాలిడేట్ అవుతున్నాయి. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ ఫర్వాలేదు. తాజా త్రైమాసిక ఫలితాల తర్వాత దీనిపై ఆసక్తి పెరిగింది. గత శుక్రవారం రూ.266 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.290 టార్గెట్ ధరతో రూ.260 వద్ద పొజిషన్ తీసుకోవాలి. రూ.256 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకోవాలి.

ICICI Bank

**ఐసీఐసీఐ బ్యాంకు:**
ప్రస్తుతం ఈ షేర్లు జీవితకాల గరిష్ఠ స్థాయుల్లో చలిస్తున్నాయి. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ లేనప్పటికీ తాజా త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఆసక్తి పెరిగింది. 20, 50 రోజులు మూవింగ్ యావరేజెస్ వద్దే షేర్లు కన్సాలిడేట్ అవుతున్నాయి. గత శుక్రవారం రూ.1425 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.1400 శ్రేణిలో బయ్ ఆన్ డిప్స్ పద్ధతిలో కొనుగోలు చేయాలి. టార్గెట్ రూ.1480/1530. స్టాప్‌లాస్ 1375.




**బజాజ్ ఫైనాన్స్:**
నష్టాల మార్కెట్లోనూ ఈ షేర్లు బలం ప్రదర్శిస్తున్నాయి. మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా మెరుగవుతున్నాయి. టైట్ రేంజులో కన్సాలిడేట్ అవుతున్నాయి. గత శుక్రవారం రూ.942 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.980 / 1050 టార్గెట్ ధరతో రూ.910/900 శ్రేణిలో కొనుగోలు చేయాలి. రూ.880 వద్ద స్టాప్‌లాస్ తప్పనిసరి.

TATA CONSUMER PRODUCTS

**టాటా కన్జూమర్:**
ప్రస్తుతం ఈ షేర్లు స్థిరంగా చలిస్తున్నాయి. మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1095 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.1700/1720 స్థాయిలో ప్రవేశించాలి. టార్గెట్ ధర రూ. 1840. స్టాప్‌లాస్ రూ. 1680.

एनएमडीसी NMDC

**ఎన్ఎండీసీ:**
ఈ ఏడాది ఆరంభం నుంచి ఈ షేర్లు సైడ్‌వేస్‌లో చలిస్తున్నాయి. ప్రస్తుతం అక్యూములేషన్ దశ కొనసాగుతోంది. ఎఫ్ఐఐలు తమ వాటాను పెంచుకున్నారు. మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.71 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో ఇన్వెస్టర్లు రూ.82 టార్గెట్ ధరతో రూ.70 వద్ద పొజిషన్ తీసుకోవాలి. రూ.67 వద్ద స్టాప్‌లాస్ ఉంచుకోవాలి.



**మూర్తి నాయుడు పాదం**
**నిఫ్ట్ మాస్టర్**
**స్టాక్ మార్కెట్ అనలిస్ట్**
**+91 988 555 9709**

# రూ. లక్షల్లో జీతం వదిలి.. సైకిలెక్కి!



కొన్ని రియల్ కథలు విన్నప్పుడూ మన మనసు స్ఫూర్తి పొందడం మాత్రమే కాదు.. ఒక్కోసారి మనలోనూ దాగి ఉన్న కలను నిద్రలేపుతుంది. ఈ రోజు అలాంటి ఓ మంచి స్టోరీ తెలుసుకుందాం. కరోనా.. ప్రపంచాన్నే అతలాకుతలం చేసిన మహమ్మారి. అది ధనవంతుడిని బికారిగా మార్చేసింది. అర్ధాంతరంగా ఆరోగ్యవంతుడి ఆయుష్షు తీసింది. ఆ విషాదంలోనే కుటుంబానికి పెద్ద దిక్కైన నాన్నని కోల్పోయాడు రంజిత్. క్రిమినల్ లాయర్‌గా ఆయనకి సొంతూరు వరంగల్ జిల్లా గిర్మాజీపేటలో మంచి పేరుండేది. ప్రతిక్షణం వెన్నంటి ఉండే నాన్న అకాల మరణంతో ఏడాదిపాటు డిప్రెషన్ లోకి వెళ్లిపోయాడు రంజిత్. దాన్నుంచి తేరుకున్నాక.. మనిషి ఆరోగ్యంగా ఉండటం ఎంత ముఖ్యమో తెలిసొచ్చింది. ఇది వీలైనంత ఎక్కువమందికి తెలియజేయాలనుకున్నాడు. అదీగాక రంజిత్ నాన్నకి ట్రావెలింగ్ అంటే చాలా ఇష్టం. ఈ రెండూ కలిసి వచ్చేలా సైకిల్ యాత్రను ఎంచుకున్నాడు. 2021 ఏప్రిల్లో.. రంజిత్ హైదరాబాద్‌కన్యాకుమారి యాత్ర మొదలైంది. అలవాటు లేని పని కావడంతో మొదట్లో చాలా ఇబ్బంది పడ్డాడు. కర్నూలుకి వెళ్లేసరికి అంగుళం కదల్లేని పరిస్థితికి వచ్చాడు. అప్పుడు ఓ పోలీసు అధికారి చికిత్స చేయించారు. అదే సమయంలో కరోనా సెకండ్ వేవ్ లాక్ డౌన్ వచ్చింది. ఆహారం, నీటి కోసం పరితపించాడు. ఓ రోజైతే తిండి లేక సొమ్మసిల్లి, మదురైలోని ఓ ఆలయంలో పడుకున్నాడు. ఆ సమయంలో ఒక యాచకురాలు తన దగ్గరున్న ఇడ్లీలు ఇచ్చి కడుపు నింపింది. కర్ణాటకలోని శివమొగ్గలో కొందరు దుండగులు రంజిత్ ని లూటీ చేసి నడిరోడ్డుపై వదిలేశారు. తర్వాత పోలీసుల సాయంతో తన సామాను, సైకిల్ ని తిరిగి పొందగలిగాడు. మొదటి యాత్ర కొన్ని చేదు అనుభవాల్ని మిగిల్చినా, అంతులేని ప్రోత్సాహాన్ని అందించింది. వెంటనే వరంగల్, లద్దాఖ్ యాత్ర మొదలుపెట్టాడు. మనాలి వరకూ ట్రక్‌లో వెళ్లి, అక్కడ్నుంచి సైకిల్ ఎక్కాడు. మనాలి, లద్దాఖ్, కశ్మీర్‌లో సైక్లింగ్ అంటే ప్రాణాలతో చెలగాటమే. మంచు చరియలు విరిగిపడటం, ఘాట్ రోడ్లలో ప్రమాదాలు అక్కడ ఎన్నో జరుగుతాయి. ఈ ప్రయాణంలోనే ఓ రోజు హిమాలయాల ప్రాంతంలో టెంట్ వేసుకుని పడుకున్నాడు. ఉదయం నిద్ర లేచేసరికి మంచులో కూరుకుపోయి ఉన్నాడు. దాంతో చిన్న గ్యాస్ పొయ్యిని వెలిగించుకొని, వేడి రాజేసుకుని అతి కష్టమ్మీద బతికి బయటపడ్డాడు. ఆపై హిమాలయాల్లోనే అత్యంత ఎత్తైన, కఠినమైన ప్రదేశాల్లో ఖార్దూంగ్లా పర్వతం చేరుకున్నాడు. లద్దాఖ్, కశ్మీర్, హరియాణా, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రల మీదుగా తిరిగి వరంగల్ చేరుకున్నాడు. కరోనా టైమ్ లో విశేష సేవలందించిన నటుడు సోనూసూద్ కి ట్రిబ్యూట్ గా అతడి ఫొటో పెట్టుకొని ప్రయాణం చేశాడు రంజిత్. తిరుగుయాత్రలో అతడ్ని కలవాలని ముంబయి చేరుకున్నాడు. అభిమానుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న సోనూసూద్ వేరేచోట ఉన్న తన షూటింగ్‌ని మధ్యలోనే నిలిపివేసి మరీ ముంబయి వచ్చి కలిశాడు. రెండు యాత్రల్లో దేశ పశ్చిమ సరిహద్దు దాదాపు కవర్ చేశాడు. మూడోసారి తూర్పు వైపు వెళ్లాలనుకున్నాడు. హైదరాబాద్‌లో మొదలై.. విజయవాడ, విశాఖపట్నం, భువనేశ్వర్, కోల్‌కతా, అస్సాం, సిక్కిం ఇలా తూర్పు వైపునున్న రాజధానులు, రాష్ట్రాలు దాటుతూ, 6 వేల కిలోమీటర్లు పూర్తి చేసి హిమాలయాల్లోని ఇండోచైనా సరిహద్దు వరకు చేరుకున్నాడు. యాత్ర స్టార్ట్ చేసేటప్పటికి ఫార్మసిస్ట్ గా రంజిత్ నెలకి రూ.మూడున్నర లక్షలు అందుకుంటున్నాడు. పదీ పాతిక వేల రూపాయల కోసం నానా కష్టాలు పడే రోజులివి. అంత మంచి జీతం వదిలి కష్టాల బాట పట్టొద్దని చాలామంది చెప్పారు. కానీ సంపాదన కాదు.. విలువైన ప్రాణం, దాన్ని నిలబెట్టుకునే ఆరోగ్యమే ముఖ్యమని నమ్మాడు రంజిత్. వీటిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సైక్లింగ్ ఎంచుకున్నాడు. మొదట నగరాలు తిరిగాడు. తర్వాత రాష్ట్రాలు, దేశాలు.. ఇప్పుడు ఖండాలూ దాటేస్తున్నాడు. అక్కడి సంస్కృతి, సాంప్రదాయాలు, వింతలూ, విశేషాలను రంజిత్ ఆన్ వీల్స్ పేరుతో యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లాంటి సోషల్ మీడియాల ద్వారా తెలుగు ప్రజలకు తెలియజేస్తున్నాడు. నాలుగోసారి సరిహద్దులు దాటాలనుకున్నాడు రంజిత్. మొదటిసారి శ్రీలంక ఎంచుకొని, 30రోజుల్లో ఆ దేశం చుట్టేశాడు. రామసేతు దగ్గర అనుమతించిన దానికన్నా ఎక్కువ దూరం వెళ్లాడని అక్కడి ఆర్మీ అధికారులు రంజిత్ తలకు తుపాకులు గురిపెట్టి బెదిరించారు కూడా. శ్రీలంక పర్యటన తర్వాత అంతర్జాతీయ యాత్రలు అధికం చేశాడు. సైక్లింగ్ చేస్తూ ఆయా దేశాల్లోని అలవాట్లు, ఆహారం, ఇతర వింతలు, విశేషాలు అప్‌లోడ్ చేశాడు. వియత్నాంలో వీసా గడువుకన్నా ఎక్కువ రోజులు ఉన్నావంటూ పోలీసులు అతడి దగ్గరున్న డబ్బులు లాక్కున్నారు. కాంబోడియాలో అతిపెద్ద హిందూ దేవాలయమైన అంగ్ కోర్ వాట్ ని చూశారు. థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్ నగరం మొత్తాన్ని సైకిల్‌పైనే చుట్టేశాడు. మలేసియాలో సైక్లింగ్ చేస్తున్న విషయాన్ని తెలుసుకుని 2023లో ఇండియన్ హైకమిషన్ ఆహ్వానించింది. దాంతో భారత స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నాడు. ఆ సమయంలో మలేసియా తెలుగు ఆసోసియేషన్ అతడిని సన్మానించింది. తర్వాత చైనా, జపాన్, దక్షిణకొరియాలో వేల కిలోమీటర్లు సైక్లింగ్ చేశాడు. తైవాన్, మంగోలియా, ఆస్ట్రేలియా చేరుకున్నాడు. అక్కడా రకరకాలు అనుభవాలు మూటగట్టుకొని తెలుగువారికి అందించాడు. మొత్తానికి 14 దేశాల్లో, సుమారు 42వేల కిలోమీటర్లు విజయవంతంగా ప్రయాణం చేశాడు. ఇలా ఎన్నో ఘనతలు సాధించిన రంజిత్ నేడు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. ముఖ్యంగా కొంతకాలమే ఈ భూమి మీద ఉండటానికి వచ్చిన మనకి సంపాదన, ఆస్తి పాస్తులు పోగు చేసుకోవడం కన్నా.. ఆరోగ్యం, నలుగురు మనుషులు పోగు చేసుకోవడం ఎంత ముఖ్యమో చెబుతున్నాడు.



# లైవ్ రిపోర్టింగ్ చేస్తూ.. వరదలో కొట్టుకుపోయిన జర్నలిస్ట్..


కొన్ని సార్లు జర్నలిస్టులు ధైర్యసాహసాలతో పాటు రేటింగ్స్ కోసం కొన్ని పిచ్చి వేషాలు కూడా వేస్తుంటారు. అయితే ఈ సాహసాలు వారి ప్రాణాలకే ముప్పు తీసుకొస్తూ ఉంటుంది. బాంబుల వర్షం పడుతున్నా, భూకంపాలు వచ్చినా, సునామీలు వచ్చినా, కరోనా లాంటి మహమ్మారి విజృంభిస్తున్నా.. తమ కర్తవ్యం నిర్వహించేవారు జర్నలిస్టులు. తాజాగా ఓ జర్నలిస్ట్ భారీ వర్షాలు, వరదల గురించి రిపోర్ట్ చేస్తూ.. అదే వరదలో కొట్టుకుపోయాడు. ఈ ఘటన పాకిస్థాన్‌లోని రావల్పిండిలో చోటు చేసుకుంది. చేతిలో మైక్రోఫోన్ పట్టుకొని మెడ లోతు నీటిలో నిలబడి ఉన్న రిపోర్టర్ లైవ్ కవరేజ్ అందిస్తుండగా, వరద నీటికి కొట్టుకుపోయాడు. అల్ అరేబియా ఇంగ్లీష్ ఫేస్‌బుక్‌లో షేర్ చేసిన ఈ వీడియోలో కేవలం తల, చేయి మాత్రమే కనిపించేలా ఓ జర్నలిస్ట్ వరదలో దిగి లైవ్ రిపోర్టింగ్ అందిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నెటిజన్లు అతని ధైర్యానికి ప్రశంసలు కురిపిస్తూ అతని భద్రత పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. చాలా మంది జర్నలిస్ట్ ధైర్యాన్ని ప్రశంసించగా, మరికొందరు అటువంటి ప్రమాదకరమైన పరిస్థితుల్లో రిపోర్టింగ్ చేయాల్సిన అవసరం ఏముందని అంటున్నారు. ఇది ధైర్యవంతమైన జర్నలిజమా లేకా రేటింగ్‌ల కోసం నిర్లక్ష్యంగా అతిగా వ్యవహరించడమా అని మరికొంతమంది ప్రశ్నిస్తున్నారు. జూన్ 26 నుండి నిరంతర కుండపోత వర్షాలు పాకిస్తాన్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. దాదాపు 116 మంది మరణించినట్లు నివేదికలు చెబుతున్నాయి. పంజాబ్ ప్రావిన్స్‌లో అత్యధికంగా 44 మంది మరణించారు, తరువాత ఖైబర్ పఖ్తుంఖ్వాలో 37 మంది, సింధ్‌లో 18 మంది, బలూచిస్తాన్‌లో 19 మంది మరణించారు. అదనంగా పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో ఒకరు మరణించగా, ఐదుగురు గాయపడ్డారు. వరదలు లక్షలాది మందిని ప్రభావితం చేశాయి. వందలాది ఇళ్లను ధ్వంసం చేశాయి. విద్యుత్, నీరు వంటి ముఖ్యమైన సేవలకు అంతరాయం కలిగించాయి. చాహన్ ఆనకట్ట కూలిపోవడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేసింది, రావల్పిండితో సహా అనేక ప్రాంతాలు మునిగిపోయాయి. ఇక్కడ సహాయ, రక్షణ కార్యకలాపాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# బడ్జెట్ లో సామ్ సంగ్ గెలాక్సీ.. 4K AI కెమెరా



ఇండియన్ మార్కెట్లో శాంసంగ్ కొత్త బడ్జెట్ స్మార్ట్ ఫోన్ విడుదల చేసింది. రీసెంట్ గా గెలాక్సీ ఎం సిరీస్ నుంచి ఎం 36 స్మార్ట్ ఫోన్ లాంచ్ చేసిన శాంసంగ్ లేటెస్ట్ గా గెలాక్సీ ఎఫ్ సిరీస్ నుంచి ఎఫ్ 36 స్మార్ట్ ఫోన్ మార్కెట్లో రిలీజ్ చేసింది. శాంసంగ్ సరికొత్తగా విడుదల చేసిన ఈ శాంసంగ్ గెలాక్సీ F36 స్మార్ట్ ఫోన్ యొక్క కాస్ట్ అండ్ ఫీచర్లు ఎలా ఉన్నాయో చూసేద్దాం. శాంసంగ్ ఈ స్మార్ట్ ఫోన్ ను రెండు వేరియంట్లలో విడుదల చేసింది ఇందులో బేసిక్ 6 జీబీ + 128 జీబీ వేరియంట్ ను రూ. 17,499 ధరతో అలాగే 8 జీబీ + 128 జీబీ వేరియంట్ ను రూ. 18,999 రూపాయల ధరతో విడుదల చేసింది. ఈ ఫోన్ కోరల్ రెడ్, లక్స్ వయోలెట్ అండ్ ఆక్సి బ్లాక్ మూడు రంగుల్లో లభిస్తుంది. ఈ ఫోన్ జూలై 29 వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి ఫ్లిప్ కార్ట్ అండ్ శాంసంగ్ అఫీషియల్ సైట్ నుంచి సేల్ అవుతుంది. ఈ స్మార్ట్ ఫోన్ లాంచ్ ఆఫర్ లో భాగంగా గొప్ప బ్యాంక్ డిస్కౌంట్ ఆఫర్ ని అందించింది. సెలెక్టెడ్ బ్యాంక్ క్రెడిట్, డెబిట్ అండ్ EMI ఆఫర్ తో ఈ ఫోన్ కొనుగోలు చేసే వారికి 1,000 రూపాయలు డిస్కౌంట్ లభిస్తుంది. ఇది కాకుండా ఈ ఫోన్ తో పాటు 500 రూపాయల కూపన్ డిస్కౌంట్ కూడా లభిస్తుంది.. ఈ రెండు ఆఫర్లు కలుపుకొని చూస్తే ఈ ఫోన్ కేవలం రూ. 15,999 రూపాయల స్టార్టింగ్ ప్రైజ్ లో లభిస్తుంది. శాంసంగ్ ఈ స్మార్ట్ ఫోన్ ను ప్రీమియం లెదర్ ప్యాట్రన్ డిజైన్ తో అందించింది అండ్ ఈ ఫోన్ చాలా సన్నగా ఉంటుంది. ఈ ఫోన్ లో 6.7 ఇంచ్ సూపర్ ఎమోలెడ్ స్క్రీన్ ఉంటుంది అలాగే ఈ స్క్రీన్ చాలా గట్టిగా ఉండే కార్నింగ్ ప్రీమియం గ్లాస్ విక్టస్ ప్లస్ ను రక్షణగా కలిగి ఉంటుంది. ఈ స్క్రీన్ 120Hz రిఫ్రెష్ రేట్, FHD+ రిజల్యూషన్ మరియు 16 మిలియన్ కలర్ సపోర్ట్ కలిగి ఉంటుంది. ఈ ఫోన్ ను సామ్ సంగ్ యొక్క సొంత చిప్ సెట్ Exynos 1380 తో అందించింది. ఇది 5nm చిప్ సెట్ మరియు 2.4 GHz క్లాక్ స్పీడ్ తో మంచి మల్టీ టాస్కింగ్ హ్యాండిల్ ప్రోసెసర్ గా చెప్పబడుతుంది. ఈ ఫోన్ 8 జీబీ ర్యామ్ అండ్ 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ కూడా కలిగి ఉంటుంది. ఈ ఫోన్ 2 TB వరకు మెమరీ కార్డు సపోర్ట్ సపోర్ట్ కలిగి ఉంటుంది. సో సామ్ సంగ్ ని ఇష్టపడే వాళ్లు ఈ ఫోన్ ని తప్పకుండా ట్రై చేయొచ్చు.

# ఏఐ బ్రౌజర్ల సంగతేంటి?




బ్రౌజర్ లో వెబ్ సైట్ అడ్రస్ ను టైప్ చేస్తాం. లేదూ తెలుసుకోవాల్సిన టాపిక్ టైప్ చేసి కింద కనిపించే వెబ్ సైట్ల లిస్ట్ ను క్లిక్ చేసి, అవసరమైన విషయాలను తెలుసుకుంటాం. కానీ చాట్‌జీపీటీలో మాదిరిగా ఏ విషయాన్ని అడిగినా దానికి సంబంధించిన టాపిక్స్ ని అడిగితే.. రిలేటెడ్ ఆన్సర్ తో పాటు వాటి వెబ్ సైట్లను ముందుంచితే? ఏఐ బ్రౌజర్ అలాంటి పనే చేస్తుంది. పర్‌ప్లెక్సిటీ సంస్థ తీసుకొచ్చిన కామెట్ దీనికి ఒక ఎగ్జాంపుల్. క్రోమియం వేదిక మీద రూపొందించిన ఇది డిఫాల్ట్ గా పర్‌ప్లెక్సిటీకి చెందిన ఏఐ సెర్చ్ ఇంజిన్ ను వాడుకుంటుంది. ఉద్యోగాలు, రిసెర్చ్, ఇతర అవసరాల కోసం అంతర్జాలాన్ని వాడుకునేవారిని ఉద్దేశించి దీన్ని తీర్చిదిద్దారు. బ్రౌజింగ్ సెషన్లను ఒకే ఒక, ఇంటరాక్షన్స్, సంక్లిష్ట పనులను తేలికైన సంభాషణలుగా మార్చేస్తుందని సంస్థ చెబుతోంది. సపోజ్.. మీటింగ్‌ను బుక్ చేయమని, చూస్తున్న అంశం మీద ఈమెయిల్ పంపమని, రోజంతా చేసిన పనులను రివ్యూ చేయమని కామెట్ ను అడగొచ్చు. అన్నింటినీ చిటికెలో చేసి పెడుతుంది. అంటే అవసరమైన విషయాన్ని ప్రాంప్ట్‌గా అందిస్తే ఆయా వివరాలను చూపిస్తుందన్నమాట. అలాగే కోరిన పనులూ చేసేస్తుంది. ఈ ఏఐ బ్రౌజర్‌లో కామెట్ అసిస్టెంట్ ఫీచర్ కూడా ఉంది. పేరుకు తగ్గట్టుగా ఇది ఏఐ ఏజెంట్‌లా పనిచేస్తుంది. తరచూ చేసే పనులను ఆటోమేట్ చేస్తుంది. ఈమెయిళ్ల సారాంశాన్ని గుది గుచ్చటం, క్యాలెండర్‌లో ఈవెంట్లను గుర్తుచేయటం, అన్ని ట్యాబ్‌లను పర్యవేక్షించటం, యూజర్ తరఫున వేర్వేరు వెబ్ పేజీలను తిరగేయటం వంటి పనులెన్నో చేసి పెడుతుంది. బ్రౌజర్ కుడివైపున పై నుంచి కామెట్ అసిస్టెంట్‌ను యాక్సెస్ చేయొచ్చు. ఇది వెబ్‌పేజీ కంటెంట్‌ను చూసి, అడిగిన ప్రశ్నలకు ఆన్సర్స్ ఇవ్వగలదు. గూగుల్ క్రోమ్, మైక్రోసాఫ్ట్ ఎడ్జ్ వంటి ట్రెడిషనల్ బ్రౌజర్ల మాదిరిగా దీనికి ట్యాబ్ ఇంటర్ఫేస్ ఉండదు. వర్క్‌స్పేస్ ద్వారా సమాచారాన్ని వేగంగా పొందొచ్చు. యూజర్ దేని కోసం వెతుకుతున్నారో గమనిస్తుంది కూడా. సూచనల మేరకు సమాచారాన్ని అందిస్తుంది. గత సెషన్లలో చేసిన పనులను దృష్టిలో పెట్టుకొని కొన్ని రిలేటెడ్ వార్తలను, రిమైండర్లను సూచిస్తుంది. కామెట్ బ్రౌజర్ ప్రస్తుతానికి వెయిట్‌లిస్ట్‌లో సైనప్ అయిన కొద్దిమంది ఆహ్వానితులకే అందుబాటులో ఉంది. అంతవరకూ వేచి చూడలేమనుకుంటే పర్‌ప్లెక్సిటీ నెలవారీ మ్యాక్స్ ప్లాన్ తీసుకొని, వాడుకోవచ్చు. ద బ్రౌజర్ కంపెనీ సైతం ఇటీవలే డయా అనే ఏఐ బ్రౌజర్‌ను విడుదల చేసింది. జనరేటివ్ ఏఐ ఆధారంగా పనిచేసే ఇది కేవలం వెబ్‌సైట్లను లోడ్ చేయటమే కాదు.. నేర్చుకోవటానికి, సమయాన్ని ఆదా చేయటానికీ ఉపయోగపడుతుంది. పర్ ప్లెక్సిటీ దారిలోనే చాట్ జీపీటీ కూడా త్వరలో ఏఐ ఆధారిత బ్రౌజర్‌ను రిలీజ్ చేయటానికి సన్నాహాలు చేస్తోంది. గూగుల్, యాపిల్ వంటి టెక్ దిగ్గజాలూ ఏఐ విషయంలో చొరవ చూపుతున్నాయి. తమ క్రోమ్, సఫారీ బ్రౌజర్లకు తేలికైన ఏఐ ఫీచర్లను యాడ్ చేస్తున్నాయి. ఏది ఏమైనా ఏఐ వచ్చాక మన టెక్నాలజీలో మాత్రం భారీ మార్పులే చోటు చేసుకున్నాయి.

# మీ వెన్నెముక ఆరోగ్యంగా ఉండాలంటే?



ప్రజంట్ ఉన్న మోడ్రన్ లైఫ్ స్టైల్ లో ల్యాప్ టాప్, కంప్యూటర్స్, టాబెట్స్, మొబైల్స్ వాడకం ఎక్కువగా ఉంది. కరోనా సమయం నుండి పెరిగిన వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్‌తో మన రోజువారీ జీవితంలో చాలా మంది వెన్నునొప్పితో బాధపడుతున్నారు. నేటి ప్రపంచంలో, వెన్నునొప్పికి అనేక కారణాలు ఉన్నాయి. వెన్నునొప్పితో మీ రోజువారీ జీవితాన్ని, ఆఫీస్ లైఫ్ ని బ్యాలెన్స్ చేయడం చాలా కష్టం. వెన్నెముకను ఆరోగ్యంగా ఉంచుకోవడం మొత్తం ఆరోగ్యం, శ్రేయస్సు కోసం ముఖ్యం. నిపుణుల అభిప్రాయం ప్రకారం, కొన్ని సాధారణ జీవనశైలి మార్పులు, అలవాట్లు మీ వెన్నెముకను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. రెగ్యులర్ వ్యాయామం వెన్నెముకకు సపోర్ట్ ఇచ్చే కండరాలను బలోపేతం చేయడంలో హెల్ప్ చేస్తుంది. వెన్నెముక యొక్క చలన పరిధిని మెరుగుపరుస్తుంది. నడక, స్విమ్మింగ్, యోగా వంటి కార్యకలాపాలు వెన్నెముక ఆరోగ్యానికి గొప్ప వ్యాయామాలు. ఎక్కువగా కూర్చోవడం మీ వెన్నెముకపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది, ఇది వెన్నునొప్పితో పాటు ఇతర సమస్యలకు దారితీస్తుంది. కూర్చున్నప్పుడు, నిలబడి, నిద్రపోతున్నప్పుడు, నడుస్తున్నప్పుడు ఒకేలా కాకుండా.. మీ భుజాలను వెనుకకు, ఛాతీని ముందుకు, అలా మీ భుజాలపై చెవులు ఉంచండి. నిద్రపోతున్నప్పుడు, సరైన భంగిమను నిర్వహించడానికి మీరు సరైన దిండును సెలెక్ట్ చేసుకోవాలి. వెన్నెముకకు మద్దతిచ్చే దృఢమైన పరుపుపై పడుకోవడం మంచిది, లేదంటే వెన్ను కుంగిపోయేలా చేస్తుంది. మీ పరిస్థితికి సరిపోయే మద్దతు, నిద్ర భంగిమను అందించడానికి మీరు సరైన బెడ్ ను సెట్ చేసుకోవాలి. వెన్నునొప్పిని తగ్గించడానికి వెన్నునొప్పి ఉన్నవారు గట్టి పరుపును ఉపయోగించడం మంచిది. అయితే, ఆధునిక పరిశోధనలు మీడియం సైజ్ బెడ్ ను వెన్నుకు ప్రయోజనకరంగా ఉండేలా తయారు చేశారు. మీ భాగస్వామి కదలికలు మిమ్మల్ని మేల్కొల్పినట్లయితే, అది మీ మ్యాట్రెస్ తగినంత సపోర్ట్ ను అందించడం లేదని అర్థం. కాబట్టి నిద్రకు అంతరాయం కలిగించడం కూడా ఒకరి వెన్నెముకపై ప్రభావం చూపుతుంది. ఫలితంగా, ఒకరి వెన్నెముకకు అంతరాయం కలిగించని నిద్రను అందించే పరుపులు సెలెక్ట్ చేసుకోండి. మీరు ఒత్తిడితో నిద్రపోతే, మీ వీపుపై ఒత్తిడిని తగ్గించడానికి మీ కాళ్ళ మధ్య ఒక దిండును ఉంచడానికి ప్రయత్నించండి. సైడ్ స్లీపర్స్ కోసం, తుంటిని బ్యాలెన్స్ చేయడానికి మోకాళ్ల మధ్య ఒక దిండును ఉంచడానికి ప్రయత్నించండి. గర్భాశయ వెన్నెముకకు మద్దతు ఇచ్చే కుషన్ కొంతమందికి హెల్ప్ అవుతుంది. నాణ్యమైన నిద్ర లేకపోవడం వెన్నునొప్పిని తీవ్రతరం చేస్తుంది. మీ శరీరానికి విశ్రాంతి కోలుకోవడానికి సమయం ఇవ్వడానికి ప్రతి రాత్రి 79 గంటల నిద్రను లక్ష్యంగా పెట్టుకోండి. ఒత్తిడి మీ కండరాలలో ఒత్తిడిని కలిగిస్తుంది. అలాగే వెన్నునొప్పికి దారితీస్తుంది. ఒత్తిడిని కంట్రోల్ చేయడానికి యోగా, మెడిటేషన్ ను ప్రాక్టీస్ చేయండి. దీంతో పాటు మీకు నచ్చిన హాబీని డెవలప్ చేసుకోండి.



# గిల్ కు అతిపెద్ద పరీక్ష: గ్రెగ్ చాపెల్

ఐదు టెస్టుల సిరీస్ లో భాగంగా జులై 23 నుంచి మాంచెస్టర్ వేదికగా ఇంగ్లాండ్, భారత్ టీమ్స్ మధ్య నాలుగో మ్యాచ్ స్టార్ట్ కానుంది. ఇందులో ఓడినా లేదా మ్యాచ్ డ్రా అయినా ఇంగ్లాండ్ గడ్డపై సిరీస్ గెలిచే అవకాశాన్ని టీమిండియా చేజార్చుకుంటుంది. సో కన్ఫార్మ్ గా గెలిచి తీరాల్సిందే. ప్రస్తుతం సిరీస్‌లో భారత్ 12తో వెనుకబడి ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆసీస్ మాజీ క్రికెటర్, భారత మాజీ కోచ్ గ్రెగ్ చాపెల్ నాలుగో మ్యాచ్ గురించి ఓ కాలమ్ రాశాడు. శుభ్‌మన్ గిల్ కు మాంచెస్టర్ టెస్టు రూపంలో అతిపెద్ద పరీక్షను ఎదుర్కొనబోతున్నాడని చాపెల్ అన్నాడు. ఈ మ్యాచ్ శుభ్‌మన్ కు బ్యాటర్ గానే కాకుండా కెప్టెన్ గానూ బిగ్గెస్ట్ ఛాలెంజ్ ఇది అని పేర్కొన్నాడు. గిల్ కెప్టెన్ గా ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నాడు. అతను ఎమోషన్స్ ని ప్రదర్శిస్తున్నాడు. కానీ, టైమ్ లైన్ బేస్ లేదు. నిజానికి, లార్డ్స్‌లో మైదానంలో గిల్ వ్యవహరించిన తీరు చూడటానికి బాగుంది. సమయం వృధా చేయడం గురించి జాక్ క్రాలీపై స్లెడ్జింగ్ చేశారు. కానీ, మ్యాచ్‌ల్లో విజయం సాధించినప్పుడు మాత్రమే ఇలాంటివి అర్థవంతంగా ఉంటాయి. బాగా మాట్లాడేవారు గొప్ప కెప్టెన్లుగా మారతారు. గిల్ కూడా చాలా త్వరగా వారిలో ఒకరిగా మారాలి. సాధన చేస్తున్నప్పుడు, ఆట మధ్యలో, విరామ సమయంలో డ్రెస్సింగ్ రూమ్‌లో స్పష్టంగా, ప్రశాంతంగా మాట్లాడాలి. గిల్ ప్రతి మ్యాచ్‌లో పరుగులు చేయలేడు. అతను టీమ్ మధ్య ఉన్న రిలేషన్ ను ఉల్లాసంగా ఉంచుతూ ఆటగాళ్లను ప్రోత్సహించే విధంగా వారికి నమ్మకాన్ని కలిగించే విధంగా మాట్లాడటం నేర్చుకోవాలి అని చాపెల్ వివరించాడు. రవీంద్ర జడేజా పోరాటంతో లార్డ్స్ టెస్టులో భారత్ చివరి వరకు పోరాడి ఓడింది. అయితే, ఈ మ్యాచ్‌లో జడేజా రిస్క్ తీసుకోవాల్సిందని చాపెల్ అభిప్రాయపడ్డాడు. బంతులను వదిలేస్తూ సింగిల్స్ తీస్తే ఎలా.. గెలవాల్సిన మ్యాచ్‌లో ఇలా ఎవరైనా ఆడతారా? టెయిలెండర్లు నీకు మద్దతుగా మాత్రమే నిలవగలరు. నువ్వే ఈ మ్యాచ్ గెలిపించాలి అని డ్రెస్సింగ్ రూమ్ నుంచి జడేజాకు మెసేజ్ పంపాల్సింది అని కామెంట్ చేశారు. అసలే జడేజా పై సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో వస్తున్న కామెంట్స్ కు ఇప్పుడు చాపెల్ మాటలు కూడా తెగ వైరల్ అవుతున్నాయి.




# ఇంగ్లండ్ వేదికగా బిగ్ ఫైట్

క్రికెట్ లో ఫార్మాట్ ఏదైనా సరే భారత్, పాకిస్థాన్ మ్యాచ్ కు స్పెషల్ క్రేజ్ ఉంటుంది. వరల్డ్ కప్ వంటి ఐసీసీ టోర్నీల్లో అయితే మ్యాచ్ రోజు స్టేడియాలు కిక్కిరిసిపోవాల్సిందే. అయితే.. ఆపరేషన్ సిందూర్ తర్వాతి ఇరుజట్ల మధ్య క్రికెట్ అనే మాటే కరువైంది. ఈ నేపథ్యంలో ఫ్యాన్స్ కు పూనకాలు తెప్పించేందుకు రెడీ అవుతున్నారు క్రికెటర్లు. త్వరలో జరుగబోయే వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ లీగ్ లో వెటరన్ ప్లేయర్స్ తో కూడిన ఇండియా ఛాంపియన్, పాకిస్థాన్ ఛాంపియన్ టీమ్స్ పోటీపడేందుకు రెడీ అవుతున్నాయి. దాంతో, మ్యాచ్ వేదిక ఎక్కడ? ఎప్పుడు మొదలవుతుంది? లైవ్ స్ట్రీమింగ్ ఎక్కడ చూడాలి? అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు ఫ్యాన్స్. ఒకప్పుడు మైదానంలో నువ్వా నేనా అన్నట్టు ఎదురుపడిన పాక్, టీమిండియా క్రికెటర్లు ఇప్పుడు మరోసారి తమ పోరాటంతో ఫ్యాన్స్ ను ఎంటర్ టైన్ చేసేందుకు రెడీ అయ్యారు. ప్రతిష్ఠాత్మక వరల్డ్ ఛాంపియన్ షిప్ లెజెండ్స్ లీగ్ రెండో సీజన్ లో జూలై 20 ఆదివారం నాడు ఇంగ్లండ్ వేదికగా ఇండోపాక్ క్రికెట్ సమరం జరుగనుంది. బర్మింగ్‌హామ్ లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానం ఈ ఇంట్రెస్టింగ్ పోరుకు వేదిక కానుంది. మాజీ ఆటగాళ్లు యువరాజ్ సింగ్, శిఖర్ ధావన్, సురేశ్ రైనా, రాబిన్ ఉతప్ప, అంబటి రాయుడులతో భారత జట్టు బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా ఉంది. వినయ్ కుమార్, అభిమన్యు మిథున్, సిద్ధార్థ్ కౌల్, వరుణ్ అరుణ్‌లతో కూడిన పేస్ దళం కూడా బలంగానే కనిపిస్తోంది. ఇక వెటరన్లు హర్భజన్ సింగ్, పీయూష్ చావ్లాలు తమ స్పిన్‌తో పాక్ బ్యాటర్లను బోల్తా కొట్టించేందుకు రెడీ అవుతున్నారు. భారత్, పాక్ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో లైవ్ స్ట్రీమింగ్ చూడొచ్చు. ఇండియా ఛాంపియన్స్ స్క్వాడ్ విషయానికి వస్తే.. యువరాజ్ సింగ్, శిఖర్ ధావన్, హర్భజన్ సింగ్, సురేశ్ రైనా, ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్, రాబిన్ ఊతప్ప, అంబటి రాయుడు, పీయూష్ చావ్లా, స్టువార్ట్ బిన్నీ, వరుణ్ అరొన్, వినయ్ కుమార్, అభిమన్యు మిథున్, సిద్ధార్థ్ కౌల్, గుర్కీరత్ మాన్ లు పార్టిసిపేట్ చేస్తున్నారు. ఇక పాకిస్థాన్ ఛాంపియన్స్ విషయానికి వస్తే.. మహమ్మద్ హాఫీజ్, షోయబ్ మాలిక్, సర్ఫరాజ్ అహ్మద్, షర్జీల్ ఖాన్, వాహబ్ రియాజ్, అసిఫ్ అలీ, షాహిద్ ఆఫ్రిది, కమ్రాన్ అక్మల్, అమిర్ యమిన్, సొహైల్ ఖాన్, సొహైల్ తన్వీర్. పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ దాడికి ప్రతిచర్యగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన సంగతి తెలిసిందే.



# కెరీర్‌లో బెస్ట్ మూమెంట్ అదే: ఆండ్రీ రసెల్

వెస్టిండీస్ ఆల్ రౌండర్ ఆండ్రీ రసెల్ త్వరలో ఇంటర్నేషనల్ క్రికెట్ కు గుడ్ బై చెప్పనున్న సంగతి తెలిసిందే. ఈ నెల 22న సబీనా పార్క్ వేదికగా ఆస్ట్రేలియాతో రెండో టీ20 మ్యాచ్ తర్వాత అంతర్జాతీయ కెరీర్‌కు రిటైర్మెంట్ ఇవ్వనున్నాడు. ఆసీస్‌తో అయిదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం రసెల్ ను సెలెక్ట్ చేసినా.. ఫస్ట్ రెండింట్లో మాత్రమే ఆడాలని అతను నిర్ణయించుకున్నాడు. ఆసీస్‌తో మొదటి టీ20 కూడా సబీనా పార్క్‌లోనే జరగనుంది. విండీస్ 2012, 2016 టీ20 ప్రపంచకప్ లు గెలవడంలో కీ రోల్ ప్లే చేసిన రసెల్ తన కెరీర్‌లో బెస్ట్ మూమెంట్ ఏంటో చెప్పుకొచ్చాడు. 2016 పొట్టి కప్ సెమీ ఫైనల్ లో ఇండియా పై గెలవడం తనకు మధుర జ్ఞాపకమని పేర్కొన్నాడు. 2016 ప్రపంచ కప్ లో భారత్ తో జరిగిన సెమీ ఫైనల్ ఆట నా కెరీర్ లో బెస్ట్ మూమెంట్. ఇతర బ్యాటర్లు శుభారంభం అందించగా.. నేను, లెండిల్ సిమన్స్ టీమ్ ను విజయతీరాలకు చేర్చాం. భారత్ లో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో 190కి పైగా లక్ష్యాన్ని ఛేదించాలి. ప్రేక్షకులంతా భారత్ కే సపోర్ట్. దీంతో కొంత ఒత్తిడికి గురయ్యా. కానీ, పిచ్ బ్యాటింగ్ కు అనుకూలించింది. టార్గెట్‌ను అందుకుంటామనే నమ్మకం కలిగింది. నేను ఔటైనా ఇంకా బ్యాటర్లు ఉండటంతో స్వేచ్ఛగా ఆడాను అని రసెల్ వివరించాడు. 2016 టీ20 వరల్డ్ కప్ సెమీస్‌లో భారత్ నిర్దేశించిన 193 పరుగుల టార్గెట్‌ని విండీస్ రెండు బంతులు మిగిలుండగానే ఛేదించింది. ఓపెనర్ జాన్సన్ చార్లెస్ రాణించగా.. మిడిల్ ఆర్డర్‌లో వచ్చిన సిమన్స్, రసెల్ చెలరేగారు. కాగా ప్రజంట్ రసెల్ చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇవన్నీ పక్కన పెడితే.. రసెల్ తన కెరీర్ లో ఎన్నో అవార్డులు, రివార్డులు సాధించిన సంగతి తెలిసిందే.

# అది మీరెలా చెప్తారు: రోహిత్ శర్మ ఇంట్రెస్టింగ్ కామెంట్స్




టీమిండియాకు కెప్టెన్సీ వహించిన గొప్ప కెప్టెన్లలో రోహిత్ శర్మ కూడా ఒకడు. రోహిత్ సారథ్యంలోని టీమిండియా టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ సాధించింది. టెస్ట్ క్రికెట్ లో కూడా మెరుగైన ఫలితాలు అందుకుంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ కు కూడా వెళ్లింది. అయితే ఈ ఏడాది మే నెలలో రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయిపోయాడు. ఇంగ్లండ్ సిరీస్ కు ముందు రోహిత్ టెస్ట్ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. రోహిత్ టెస్ట్ క్రికెట్ రిటైర్మెంట్ గురించి బీసీసీఐ మాజీ సెలక్టర్ జతిన్ పరంజ్‌పే మాట్లాడారు. తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ రోహిత్ తో సంభాషణను గుర్తు చేసుకున్నారు. రోహిత్ రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత నేను అతడితో మాట్లాడాను. తాను టెస్ట్ క్రికెట్ తోనే కెరీర్ మొదలుపెట్టానని, తనకు టెస్ట్ క్రికెట్ అంటే ఇష్టం లేదని మీరెలా చెప్పగలరని అడిగాడు అని జతిన్ చెప్పారు. టెస్ట్ క్రికెట్ పై ఆసక్తి లేదా అని తాను అడిగినందుకు రోహిత్ ఫీల్ అయ్యాడని కూడా జతిన్ తెలిపారు. 202425 సీజన్‌లో రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌లో పేలవ ప్రదర్శన కనబరిచాడు. స్వదేశంలో జరిగిన సిరీస్ లతో పాటు ఆస్ట్రేలియా పర్యటనలో కూడా నిరాశపరిచాడు. దీంతో అతడిపై విమర్శలు స్టార్ట్ అయ్యాయి. దీంతో ఈ ఏడాది ఇంగ్లండ్ సిరీస్ కోసం జట్టును సెలెక్ట్ చేసే ముందే టెస్ట్ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటిస్తూ రోహిత్ సోషల్ మీడియా ద్వారా తెలియజేశాడు. రోహిత్ తర్వాత కోహ్లీ కూడా టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అవుతున్నట్లు ప్రకటించాడు. ఏదైనా ఈ ఇయర్ టెస్ట్ సిరీస్ ల్లో రోహిత్, విరాట్ ల లోటు మాత్రం చాలా బలంగా కనిపిస్తుందని వారి ఫ్యాన్స్ పోస్టులు పెడుతున్న సంగతి తెలిసిందే.






# బీసీసీఐకి కొత్త అధ్యక్షుడు?

బీసీసీఐ ప్రస్తుత అధ్యక్షుడు రోజర్ బిన్నికి 70 సంవత్సరాలు రావటంతో సందర్భంగా ఆయన ఆ పదవీ నుంచి నిష్క్రమించే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. నిజానికి 1983లో భారత్ వన్డే వరల్డ్ కప్ గెలిచిన టీమ్ లో సభ్యుడిగా ఉన్నాడు బిన్ని. 2022లో భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ స్థానంలో ఆయన బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. అయితే బోర్డు రాజ్యాంగం ప్రకారం.. 70 ఏళ్ల వయస్సు వచ్చిన తరువాత ఏ వ్యక్తి కూడా పదవీని చేపట్టలేరు. బీసీసీఐ అధ్యక్షుడు అందుబాటులో లేనప్పుడు.. అధ్యక్షుడు లేనప్పుడు ఉపాధ్యక్షుడు బాధ్యతలు నిర్వర్తిస్తారు. అంటే బిన్నీ తరువాత ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా టెంపరరీ బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. అపెక్స్ కౌన్సిల్ జనరల్ బాడీ ద్వారా అధికారం పొందే విధులను ఉపాధ్యక్షుడు కూడా నిర్వర్తించాలని బోర్డు నియమాలు ఇంకా పేర్కొంటున్నాయి. ఒకవేళ శుక్లా బీసీసీఐ టెంపరరీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తే.. సెప్టెంబర్ వరకు ఆయన ఆ పదవీలో కొనసాగే అవకాశం ఉందని బోర్డు వార్షిక మీటింగ్ లో బేరర్లకు ఎన్నికలు జరిగే వరకు ఆయన కొనసాగే అవకాశం ఉందని ఐఏఎన్ఎస్ కి సమాచారం అందింది. బిన్ని 1979 నుంచి 1987 వరకు క్రికెట్ ఆడారు. ఇందులో 27 టెస్టులు, 72 వన్డేలు ఆడాడు. అతను సీనియర్ పురుషుల సెలక్షన్ కమిటీలో భాగంగా ఉన్నాడు. శ్రీలంకలో 2000 U19 పురుషుల క్రికెట్ ప్రపంచ కప్ ను భారత్ గెలుచుకున్నప్పుడు ప్రధాన కోచ్ గా పని చేశాడు. ఇక బిన్ని బీసీసీఐ అధ్యక్షుడిగా ఉన్న కాలంలో మహిళల ప్రీమియర్ లీగ్ విజయవంతంగా ప్రారంభించారు. ఆయన 2011 నుంచి 2017 వరకు కూడా ఐపీఎల్ కమిషనర్ గా పని చేశారు. 2020లో బీసీసీఐ ఉపాధ్యక్షుడు అయ్యారు. 2022లో ఆ పదవీకి తిరిగి ఎన్నికయ్యాడు. ప్రస్తుతం రోజర్ తరువాత ఆయన బీసీసీఐ అధ్యక్షుడుగా అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం టీమిండియా 5 టెస్టు సిరీస్ మ్యాచ్ లు ఆడుతున్న సంగతి తెలిసిందే.




# స్పిరిట్ కోసం ప్రభాస్ విధ్వంసం

యంగ్ రెబల్ స్టార్ కమ్ పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ ప్రజంట్ తన ఫ్యాన్స్ కి బ్యాక్ టు బ్యాక్ ఫీస్ట్ ఇచ్చేందుకు రెడీగా ఉన్నారు. ఇక్కడ్నుండి ప్రభాస్ ఏడాదికి ఒక సినిమా కచ్చితంగా రిలీజ్ ఉండేలా ప్లాన్ చేస్తున్నాడు. ఈ ఇయర్ డిసెంబర్ లో రాజా సాబ్ తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు ప్రభాస్. ఆ సినిమా తో పాటు హను రాఘవపూడి డైరెక్షన్ లో చేస్తున్న ఫౌజీ సినిమాను కూడా నెక్స్ట్ ఇయర్ సమ్మర్ లో రిలీజ్ చేసేలా చూస్తున్నారట. ప్రభాస్ నెక్స్ట్ సందీప్ వంగాతో స్పిరిట్ సినిమా చేస్తున్నాడు. ఆ సినిమా విషయంలో అంచనాలు టాప్ స్టేజ్ లో ఉన్నాయి. ఐతే స్పిరిట్ లో ప్రభాస్ ని కొత్తగా చూపించాలని ఫిక్స్ అయ్యాడు సందీప్ వంగ. ప్రభాస్ ఈ సినిమాలో పోలీస్ క్యారెక్టర్ లో కనిపించనున్నాడు. ఐతే తన ప్రతి సినిమా హీరో విషయంలో హీరో క్యారెక్టర్ ఆర్క్ ని డిఫరెంట్ గా ప్లాన్ చేస్తూ వచ్చిన సందీప్ ప్రభాస్ స్పిరిట్ కోసం కూడా అదిరిపోయే రేంజ్ లో సెట్ చేస్తున్నాడట. స్పిరిట్ కోసం ప్రభాస్ రచ్చ మామూలుగా ఉండదని తెలుస్తుంది. సినిమాలో ప్రభాస్ మేకోవర్ కూడా వేరే లెవెల్ అనేలా ఉంటుందని టాక్. త్వరలో సెట్స్ మీదకు వెళ్తున్న ప్రభాస్ స్పిరిట్ సినిమా విషయంలో ప్రతి విషయాన్ని సందీప్ చాలా కేర్ ఫుల్ గా డీల్ చేస్తున్నాడట. సినిమా షూటింగ్ మొదలు పెట్టడమే మొదలు పూర్తి చేసే దాకా ఆగకూడదని ఫిక్స్ అయ్యాడట. ప్రభాస్ అనుకున్న విధంగా డేట్స్ ఇస్తే మాత్రం సందీప్ స్పిరిట్ సినిమాను వన్ ఇయర్ లో పూర్తి చేయాలని చూస్తున్నాడు. అంటే 2026 చివర్లో లేదా 2027 మొదట్లో స్పిరిట్ ని దించే ఛాన్స్ ఉంది. ప్రభాస్ స్పిరిట్ లో యానిమల్ బ్యూటీ త్రిప్తి డిమ్రి హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. సందీప్ వంగ సినిమా అనగానే హీరో ఎరగెంట్ మాస్ విధ్వంసం గుర్తొస్తుంది. ఇక మాస్ కి కేరాఫ్ అడ్రస్ అయిన బాహుబలి ప్రభాస్ తో సందీప్ చేసే స్పిరిట్ ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే గూస్ బంప్స్ వస్తున్నాయి. స్పిరిట్ సినిమా చేసే ముందే ప్రభాస్ గురించి మీరు ఒక్క మాటలో చెప్పాలంటే ఏం చెబుతారు అని ఒక ఇంటర్వ్యూలో సందీప్ ని అడిగితే.. అది స్పిరిట్ లో చూపిస్తా అని ఆన్సర్ ఇచ్చాడు. సో ప్రభాస్ ఏంటో స్పిరిట్ బొమ్మలో తన మేకింగ్ లో చూస్తారని సందీప్ చెప్పకనే చెప్పాడు. ఇక ప్రభాస్ జానర్ అండ్ స్టోరీ సెలెక్షన్ వైజ్ గా చూసినా కూడా ఎక్కడా డ్రాప్ అయ్యే పరిస్థితి కనిపించట్లేదు. కన్ఫార్మ్ గా హిట్ మీద హిట్ కొట్టే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి

# వీరమల్లు మేకింగ్ చూశారా?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మోస్ట్ అవైటెడ్ మూవీ హరిహర వీరమల్లు కోసం ఆడియన్స్ ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు జ్యోతికృష్ణ ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించాడు. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, టీజర్, ట్రైలర్, సాంగ్స్ ఈ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. రిలీజ్‌కు దగ్గరపడుతున్న టైమ్ లో ఈ సినిమా ప్రమోషన్స్ ను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా ఈ సినిమాకి సంబంధించిన మేకింగ్ వీడియోను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు. ఇలాంటి హిస్టారికల్ ఎపిక్ సినిమాని ఇంత గ్రాండియర్ గా మలిచేందుకు సినిమా యూనిట్ ఎంత కష్టపడిందో మనకు ఈ వీడియోలో చూపెట్టారు. ఇందులోని భారీ క్యాస్టింగ్, భారీ సెట్టింగ్స్‌తో ఈ మేకింగ్ వీడియో అద్భుతంగా ఉంది. ఇక ఈ మేకింగ్ వీడియోకు ఓ థీమ్ సాంగ్ ను కూడా యాడ్ చేశారు. ఇది అభిమానులను సర్‌ప్రైజ్ చేసింది. పులి, మేక ఆట అనే పాటగా ఈ సాంగ్ ఆకట్టుకుంటుంది. ఇక ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా హారిక నారాయణ్ పాడారు. కీరవాణి మరోసారి తనదైన ట్యూన్స్‌తో ఈ పాటను ఆసక్తికరంగా క్రియేట్ చేశారు. మొత్తానికి ప్రేక్షకుల్లో ఈ సినిమాపై అంచనాలను పీక్స్‌కు తీసుకెళ్లేలా ఈ సాంగ్, మేకింగ్ వీడియో ఉండటంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాను జూలై 24న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.




# హరిహర వీరమల్లు టికెట్ రేట్లు పెంపు





పవన్ కళ్యాణ్ సినీ కెరీర్ లోనే ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సినిమా హరిహర వీరమల్లు వచ్చే వారం గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమాను దర్శకుడు జ్యోతికృష్ణ పవర్‌ఫుల్ హిస్టారికల్ ఎపిక్ గా ప్లాన్ చేశారు. ఇక ఈ సినిమాలో పవన్ క్యారెక్టర్ ప్రేక్షకులను సర్ ప్రైజ్ చేస్తారని మేకర్స్ కాన్ఫిడెంట్‌గా చెబుతున్నారు. అయితే, తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టికెట్ రేట్లు పెంచేందుకు ఏపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హరిహర వీరమల్లు సినిమా టికెట్ ధరలు సింగిల్ స్క్రీన్స్‌కు రూ.150, మల్టీప్లెక్స్‌కు రూ.200 పెంచుకునేందుకు ఏపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయంతో సినిమా యూనిట్ సంతోషం వ్యక్తం చేస్తోంది. ఈ లెక్కన ఏపీలో సింగిల్ స్క్రీన్ అప్పర్ బాల్కనీ టికెట్ ధర రూ.297, మల్టీప్లెక్స్ టికెట్ ధర రూ.377 గా ఉండనుంది. ఈ టికెట్ రేట్ల పెంపు పది రోజుల వరకు ఉంటుందని ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఇక ఈ టికెట్ రేట్ల పెంపుతో తమ సినిమాకు కలిసొస్తుందని నిర్మాతలు భావిస్తున్నారు. ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్లు సాధించేందుకు ఇది దోహదపడుతుందని వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటు తెలంగాణలో కూడా టికెట్ రేట్లు పెంచేందుకు ప్రభుత్వాన్ని కోరగా, దీనిపై నిర్ణయం ఇంకా రావాల్సి ఉంది. కాగా ప్రజంట్ వీరమల్లు మూవీ ప్రమోషనల్ కంటెంట్ పై ఫోకస్ చేశారు.





# అఖండ 2లో సంయుక్త స్పెషల్ సాంగ్?

నటసింహా నందమూరి బాలకృష్ణ, బోయపాటి కాంబినేషన్ లో వచ్చిన బ్లాక్ బస్టర్ మూవీ అఖండకు పార్ట్ 2 తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సీక్వెల్ సినిమాతో బాలయ్య నటవిశ్వరూపాన్ని మరోసారి అభిమానులు చూడబోతున్నారు. ఇది భారీ యాక్షన్ ఎంటర్ టైనర్. ఎంటర్ టైన్ మెంట్ కు లిమిట్ లేదని బోయపాటి టీమ్ చెబుతోంది. అయితే రొమాన్స్ పార్ట్ కోసం గ్లామరస్ హీరోయిన్స్ ను సెలెక్ట్ చేసుకున్నా కానీ, ఐటమ్ సాంగ్ తో మరింత కిక్ పెంచాలని కూడా ప్లాన్ చేస్తున్నట్టు తెలిసింది. అంతేకాదు.. ఇప్పటికే స్పెషల్ సాంగ్ కోసం హీరోయిన్ ను ఫైనల్ చేసేందుకు బోయపాటి సీరియస్‌గా ప్రయత్నిస్తున్నారు. మలయాళ బ్యూటీ సంయుక్త మీనన్‌ను ఐటమ్ పాట కోసం ఒప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. సంయుక్త ఇప్పటివరకూ మలయాళం, తెలుగులో అగ్ర హీరోల సరసన భారీ సినిమాల్లో నటించింది. తనదైన అందం, నట ప్రతిభతో మైమరిపించింది. అయితే సంయుక్త రూపం ట్రెడిషనల్ అప్పియరెన్స్ కి స్పెషల్ ఫాలోయింగ్ ఉంది. ఇప్పుడు తన ఇమేజ్ ని బ్రేక్ చేసి సంయుక్త ఐటమ్ పాటలో డాన్స్ చేస్తుందా? అన్నది ఆసక్తిగా మారింది. రీసెంట్ గా సమంత, తమన్నా ఐటమ్ పాటల్లో డాన్స్ చేసినా వారికి ఉన్న ఇమేజ్ కంప్లీట్ గా డిఫరెంట్. గ్లామరస్ క్వీన్స్ గా ఫస్ట్ నుంచి ఎస్టాబ్లిష్ అయ్యారు. అయితే సంయుక్త మీనన్ గ్లామరస్ హీరోయిన్ ట్యాగ్ కంటే ట్రెడిషనల్ బ్యూటీ అన్న ట్యాగ్ తోనే అందరి దృష్టిలో ఉంది. అందుకే ఇప్పుడు బాలయ్య సినిమాలో స్పెషల్ సాంగ్ కు ఓకే చెబుతుందా? అన్నది వేచి చూడాలి. ఒకవేళ అంగీకరిస్తే, ఆ తర్వాత సంయుక్తకు ఈ తరహా గ్లామర్ ఎలివేషన్ ఉన్న సినిమాల్లోను అవకాశాలు పెరిగే ఛాన్సుంది.

# తేజ సజ్జా మిరాయ్.. అదిరిపోయే అప్డేట్!

యంగ్ హీరో తేజా సజ్జ కెరీర్ ని చాలా బాగా ప్లాన్ చేసుకుంటున్నాడు. అతను చేస్తున్న సినిమాలు వాటి ఫలితాలు అతనికి మంచి పాపులారిటీ తెచ్చేలా చేస్తున్నాయి. తేజా సజ్జా హనుమాన్ సినిమా పాన్ ఇండియా హిట్ అందుకుంది. ఆ సినిమాతో అతను నేషనల్ లెవెల్ క్రేజ్ తెచ్చుకున్నాడు. ఐతే ఇక నెక్స్ట్ సినిమాలను కూడా అదే రేంజ్ లో ఉండేలా చూస్తున్నాడు తేజా. ప్రజంట్ అతను కార్తీక్ ఘట్టమనేని డైరెక్షన్ లో మిరాయ్ సినిమా చేస్తున్నాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ భారీ బడ్జెట్ తో ఈ సినిమా ప్రొడ్యూస్ చేస్తున్నారు. సినిమాలో విలన్ గా మంచు హీరో మనోజ్ కూడా నటిస్తున్న విషయం తెలిసిందే. అసలైతే ఏప్రిల్ లో రిలీజ్ చేయాలని అనుకున్న ఈ సినిమా సెప్టెంబర్ కి వాయిదా వేశారు మేకర్స్. ప్రస్తుతం మిరాయ్ సినిమా రామోజి ఫిల్మ్ సిటీలో షూటింగ్ జరుపుకుంటుంది. అక్కడ భారీ యాక్షన్ సీన్ చేస్తున్నట్టు తెలుస్తుంది. అంతేకాదు నెక్స్ట్ వీక్ ఒక సాంగ్ షూట్ చేస్తారట. సినిమాకు కీలకమైన అంశాలు ఈ షెడ్యూల్ లో షూట్ చేస్తున్నారట. ఇక మిరాయ్ సినిమాను ఫైనల్ గా సెప్టెంబర్ 5న రిలీజ్ ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. నెక్స్ట్ రిలీజ్ చేసే ప్రమోషనల్ టీజర్ లో రిలీజ్ అప్డేట్ కూడా ఉంటుందని తెలుస్తుంది. ఐతే ఆల్రెడీ సెప్టెంబర్ 5కి అనుష్క ఘాటి, రష్మిక ది గర్ల్ ఫ్రెండ్ రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. ఐతే ఇప్పుడు ఆ డేట్ కి తేజా సజ్జ మిరాయ్ కూడా రిలీజ్ అంటూ చెబుతున్నారు. తేజా సజ్జా మిరాయ్ సినిమా కూడా ఒక డిఫరెంట్ కాన్సెప్ట్ తో వస్తుంది. ఈ సినిమాను కూడా పాన్ ఇండియా లెవెల్ లో రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు. మిరాయ్ సినిమా కథ ఏంటి అన్నది క్లూ ఇస్తూ వదిలిన టీజర్ సినిమాపై అంచనాలు పెంచింది. కార్తీక్ ఘట్టమనేని ఈసారి ఒక అద్భుతమైన స్టోరీతో విజువల్ ట్రీట్ ఇచ్చేలా సినిమా చేస్తున్నాడు. అంతేకాదు ఈ సినిమాలో తేజ సజ్జ, మనోజ్ ల సీన్స్ కూడా క్రేజీగా ఉంటాయని అంటున్నారు. మిరాయ్ సినిమా టీజర్ తోనే సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నారు. కాగా రాబోతున్న ప్రమోషనల్ కంటెంట్ సినిమాను నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్తుందని అంటున్నారు. ఇక దీంతో పాటు తేజ సజ్జా జై హనుమాన్ మూవీ కూడా చేస్తున్న సంగతి తెలిసిందే.

